అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

సోమవారం 26-2-2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 59 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల: 5.00







# శ్రీదేవి కన్నుమూత

## వెండితెరను శాసించిన మహానటి

- గుండెపోటుతో దుబాయ్‌లో హఠాన్మరణం
- నేడు అంత్యక్రియలు


(ఫైల్)

**ముంబయి :** ప్రముఖ సినీ నటి శ్రీదేవి (55) శనివారం రాత్రి దుబాయ్‌లో కన్నుమూశారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు శ్రీదేవి తన బంధువు మోహిత్ మర్వా వివాహం కోసం కుటుంబ సభ్యులతో కలిసి దుబాయ్ వెళ్ళారు. అక్కడ వివాహ వేడుకల్లో పాల్గొన్న ఆమెకు ఆకస్మికంగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. వివాహం అయిన వెంటనే కొంతమంది కుటుంబ సభ్యులు దుబాయ్ నుంచి తిరిగి వచ్చారు. శ్రీదేవి, ఆమె భర్త బోని కపూర్, కూతురు ఖుషీ అక్కడే ఉండిపోయారు. అయితే శనివారం రాత్రి పదిన్నర గంటల ప్రాంతంలో శ్రీదేవికి గుండెపోటు రావడంతో వెంటనే మృతి చెందారు. పోస్టుమార్టం చేశాక ఆమె భౌతికకాయాన్ని ఇవ్వడానికి పోలీసుశాఖా పరంగా జాప్యం అయింది. అందువల్ల ఆమె పార్థీవ దేహాన్ని ప్రత్యేక విమానంలో సోమవారం ముంబయికి చేర్చేలా ఏర్పాట్లు చేశారు. అదే రోజు అంత్య క్రియలు జరుగుతాయి. శ్రీదేవి మరణ వార్త వినగానే అభిమానులంతా శోకసంద్రంలో మునిగిపోయారు. ముంబయిలోని 9లో

# బుద్ధి తెచ్చుకోవాలి

## కేంద్రానికి 20 ఉత్తరాలు రాశా.. పట్టించుకోలేదు..


మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

- టార్పాలిన్ల కొనుగోలుకు 75శాతం సబ్సిడీ
- మే నెలలో పెట్టుబడి చెక్కుల పంపిణీ
- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయితే కోటి ఎకరాలకు సాగు నీరు
- రూ.6నుంచి 7కోట్ల వరకు బ్యాంకు గ్యారంటీ: రైతు సమన్వయ సమితుల సదస్సులో సీఎం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

'ఉపాధిహామీ'ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరుతూ పదిసార్లు చెప్పినా, 20 ఉత్తరాలు రాసినా కేంద్ర ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోలేదని ముఖ్యమంత్రి కేసీఆర్ అసహనం వ్యక్తం చేశారు. రైతులకు ఏదైనా చేయాలని ఎన్ని సార్లు కోరినా పట్టించుకోలేదన్నారు. 13 జిల్లాలకు సంబంధించిన రైతు సమన్వయ సమితుల సభ్యులతో అవగాహన సదస్సును ఆదివారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఇక నుంచి టార్పాలిన్లు కొనుగోలు చేసే రైతులకు 75శాతం సబ్సిడీ ఇస్తామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 4లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు మాత్రమే ఉండేవని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 24 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన శాస్త్రీయ పద్ధతిలో గోదాముల నిర్మాణం చేపట్టామని తెలిపారు. అన్ని కొత్త మండలాల్లో గోదాముల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రూ. 12వేల కోట్లతో పెట్టుబడి పథకం ప్రారంభిస్తామని చెప్పారు. ఈ పథకం ద్వారా మే నెలలో చెక్కుల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. భూరికార్డుల ప్రక్షాళన రెవెన్యూ సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించారని అభినందించారు. ఇదే పని గుజరాత్‌లో మొదలుపెట్టి ఆరు నెలలు గడిచినా పూర్తి చేయలేకపోయారని పేర్కొన్నారు. పెట్టుబడి పథకం కింద కోటి 65 లక్షల ఎకరాలకు గాను కోటి 42 లక్షల మందికి లబ్ది చేకూరనున్నదని వెల్లడించారు. ఇంకా మూడు లక్షల ఎకరాల భూమి వివాదాస్పదంగా ఉన్నదని, త్వరలో అది కూడా పరిష్కారం అవుతుందని అన్నారు. పాలమూరు, డిండి, సీతారాం ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం, దేవాదుల వంటి ప్రాజెక్టులు జూన్ నెలఖారు వరకు పూర్తయితే, 2020 నాటికి కోటి ఎకరాలకు సాగునీరందిస్తామని చెప్పారు. 1.25వేల కోట్ల విలువైన పంట పండించే పరిస్థితులు రాబోతున్నాయని అన్నారు. మిషన్ కాకతీయ ఆధ్వర్యంలో ప్రజలకు శాశ్వత ప్రయోజనాలు 9లో

# బోనాల సొమ్ము బొక్కేశారు!

- చక్రంతిప్పిన మంత్రి బంధువు
- అధికారులూ పాత్రధారులే
- లేని ఆలయాల పేర్లపై సొమ్ము స్వాహా
- దేవాదాయశాఖకు కలెక్టర్ షోకాజ్
- యుటిలిటీ సర్టిఫికెట్స్ ఇవ్వాలని ఆదేశం
- రూ.18.15 కోట్లకు రెక్కలు

**నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో**

బోనాల సొమ్మును బొక్కేశారు...ఓ మంత్రి గారి బంధువు ఈ వ్యవహారంలో చక్రం తిప్పితే... దేవాదాయశాఖ అధికారులు పాత్రధారులుగా వ్యవహరించి, వాటాలు పంచేసుకున్నారు! మూడేండ్లలో మొత్తంగా రూ.18.15 కోట్లను ప్రభుత్వం విడుదల చేస్తే...దానిలో అధికభాగం స్వాహా చేసేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితారాణా జోక్యం చేసుకున్నారు. ఖర్చు చేసిన సొమ్ముకు వెంటనే యుటిలిటీ సర్టిఫికెట్స్ ఇవ్వాలంటూ దేవాదాయశాఖ అధికారులకు షోకాజ్ నోటీస్ ఇచ్చారు. ఇప్పటి వరకు పై సొమ్మును ఎందు కోసం ఖర్చు చేశారో లెక్కలు చెప్పనందుకు మీపై చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ఆ షోకాజ్‌లో పేర్కొన్నారు. దీంతో దేవాదాయశాఖ అధికారులు ఉరుకులు పరుగులు

బాగ్‌లింగంపల్లి బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై గుడిపేరుతో...



పెడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే...2015 జులై 27వ తేదీ జీవో నెంబర్ 340 ద్వారా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో బోనాల వేడుకల నిర్వహణ కోసం రూ.3.95 కోట్ల నిధుల్ని నాన్‌ప్లాన్ బడ్జెట్ క్రింద మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. 2016 జులై 2వ తేదీ జీవో నెంబర్ 309 ద్వారా రూ.4.20 కోట్లు మంజూరు చేసింది. దేవాదాయ శాఖ పరిధిలోని గ్రామదేవత ఆలయాలతోపాటు, ఆ శాఖ గుర్తించని చిన్నచిన్న ఆలయాలకు స్థానిక ప్రజాప్రతినిధుల రికమండేషన్‌తో స్థాయినిబట్టి డబ్బును చెక్కుల రూపంలో ఆలయ కమిటీలకు ఇచ్చేశారు. ఒక్కో ఆలయానికి రూ.5 వేలు మొదలు రూ.లక్ష వరకు చెక్కులు ఇచ్చారు. ఈ వ్యవహారమంతా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో దేవాదాయశాఖ అధికారులు నిర్వహించారు. 2017 జూన్ 8వ తేదీ జీవో నెంబర్ 454 ద్వారా ఆ ఏడాది బోనాలు నిర్వహణకు పై తరహాలోనే రూ.10 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ జీవోలో మాత్రం హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి చైర్మెన్‌గా ఉన్న కమిటీని నియమించినట్టు 9లో



# చేతబడి నెపంతో దాడి

## పెద్దపల్లి జిల్లా రాగినేడులో ఘటన

**నవతెలంగాణ–పెద్దపల్లి రూరల్**

చేతబడి నెపంతో మహిళలపై దాడి చేశారు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లాలో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం...పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామానికి చెందిన సోమిశెట్టి లక్ష్మి ఈ నెల 22న మృతిచెందింది. ఆమె మృతదేహానికి గ్రామంలోని శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు. శ్మశాన వాటికలో 9లో



# రుస్తుం-2 పరీక్ష విజయవంతం

## డీఆర్‌డీవో తయారుచేసిన డ్రోన్



**న్యూఢిల్లీ:** భారత పరిశోధన సంస్థ డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో) నిర్వహించిన మానవ రహిత వైమానిక వాహనం రుస్తుం-2 డ్రోన్ పరీక్ష విజయవంతమైంది. కర్నాటకలోని చిత్రదుర్గ జిల్లా చలకేరేలో ఆదివారం ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్(ఏటీఆర్) నుంచి డీఆర్‌డీవో చైర్మన్ ఎస్ క్రిస్టోఫర్, డైరెక్టర్ జనరల్ సీపీ రామనారాయణన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్ డీజీ మంజుల, సీనియర్ 9లో

# రోజుకు 8 గంటలు వారానికి 48 గంటలు

## జర్మనీలోని ఓ రాష్ట్రంలో వారానికి 28 గంటలే పని

- మిగతా రాష్ట్రాల్లో 35 గంటలు
- కార్మికులతో ఒప్పందాలకు సంస్థల ఆసక్తి


(ఫైల్)

**నవతెలంగాణ, జనరల్‌డెస్క్**

కార్మికుల పని గంటలను తగ్గించడం ద్వారా పలు రంగాలలో మెరుగైన ఫలితాలను సాధించవచ్చునన్న భావన బలపడుతోంది. రోజుకు 8 గంటలు, వారానికి 48 గంటల పని విధానం అమలులో ఉన్న ఇండియాలోనూ ఆ దిశగా ఆలోచనలు సాగుతున్నా యి. వారానికి రెండు రోజుల సెలవుపై ఇప్పటికే కొందరు ప్రతిపాదించగా అన్ని రంగాలలో అది సత్ఫ లితాలనివ్వదన్న అంచనాతో ఆ ఆలోచన వెనక్కి వెళ్లింది. అయితే,జర్మనీ కార్మికులు పని గంటలు తగ్గించుకోవడంలో ఇటీవల సాధిం చిన విజయం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మరోసారి ఆలోచనలను రేకెత్తిస్తోంది. లోహ,విద్యుత్ రంగాల కార్మికుల పట్టు వదలని పోరాటంతో వారానికి 28 గంటల పని విధానం మొదటిసారిగా జర్మనీలోని బ్యాడెన్ ఉర్టెంబెర్గ్ రాష్ట్రంలో అమలులోకి వచ్చింది. జీవితంతో శ్రమను సమన్వయం చేయాలన్న నినాదంతో కార్మికులు రెండేండ్లపాటు ఆందోళనలు నిర్వహించి ఈ డిమాండ్‌ను సాధించుకున్నారు. ఈ నెల మొదటి వారంలో జర్మనీలోని అతిపెద్ద కార్మిక సంఘం ఐజీ మెటల్(లోహ కార్మికుల పారిశ్రామిక సంఘం) నేతలు–లోహ, విద్యుత్ కంపెనీల యజమానులు పని గంటల తగ్గింపు ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారు. మెర్సిడెస్ బెంజ్, బోచ్‌వంటి కార్ల కంపెనీలతోపాటు పలు సంస్థలతో కార్మికులు ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. అయితే, ఈ 28 గంటల పని విధానం 9లో




# బహుజనుల రాజ్యమొచ్చేదాక ఉద్యమం

## కుల వ్యవస్థను కూలిస్తేనే సామాజిక న్యాయం

- మచ్చలేని కేరళ పాలనే ఆదర్శం: బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్లా
- నలుగురి చేతిలో రాష్ట్రం బందీ : రాష్ట్ర కన్వీనర్ తమ్మినేని వీరభద్రం


మాట్లాడుతున్న నల్లా సూర్యప్రకాశ్



**నవతెలంగాణ–మహబూబ్‌నగర్ ప్రతినిధి**

తెలంగాణలో పెత్తందారుల పాలనపోయి బహుజనుల రాజ్యం వచ్చేదాక ఉద్యమాన్ని చేపట్టాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ పిలుపునిచ్చారు. నిచ్చెనమెట్ల కులవ్యవస్థను కూల్చడం ద్వారానే సామాజిక న్యాయం సిద్ధిస్తుందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బీఎల్ఎఫ్ బహిరంగసభ జిల్లా కేంద్రంలోని జడ్పీ మైదానంలో ఆదివారం నిర్వహించారు. సభా ప్రాంగణానికి దొడ్డి కొమురయ్య, చాకలిఐలమ్మ, బందగీ, కొమరంభీమ్‌గా నామకరణం చేశారు. సుమారు 3వేల మంది హౌసింగ్‌బోర్డు నుంచి జడ్పీ వరకు ర్యాలీచేశారు. అనంతరం జలజం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. పూలే, సావిత్రి, అంబేద్కర్, మార్క్స్ లాంటి మహనీయుల సిద్ధాంతాలే 9లో

## బీహార్‌లో దారుణం

- బీజేపీ నాయకుడి వాహనం ఢీకొని...
- 9 మంది చిన్నారులు మృతి

**పాట్నా:** బీజేపీ నాయకుడు ప్రయాణిస్తున్న ఓ వాహనం వేగంగా దూసుకువచ్చి రోడ్డు దాటుతున్న విద్యార్థులను ఢీకొన్నది. దీంతో 9 మంది చిన్నారులు మృతి చెందారు. ఈ ఘటన బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం... ముజఫర్‌పూర్ జిల్లా పరిధిలోని మీనాపూర్‌లో ఎన్‌హెచ్ 77 సమీపాన గల ఒక పాఠశాల నుంచి విద్యార్థులు స్కూలు అయిపోగానే ఇంటికి బయలుదేరారు. రోడ్డు దాటుతుండగా అటువైపు నుంచి వేగంగా వచ్చిన బోలెరో వాహనం విద్యార్థులను ఢీకొనేసింది. మరో 14 మంది విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ. 4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. చిన్నారులంతా 7-12 ఏండ్ల వయస్సు వారే కావడంతో వారి కుటుంబాల్లో విషాద చాయలు అలుముకున్నాయి.

**ఆ వాహనం బీజేపీ నాయకుడిదే...**

ప్రమాదానికి కారణమైన బోలేరో.. సీతామరి జిల్లాకు చెందిన బీజేపీ నాయకుడు మనోజ్‌బైఠా పేరిట ఉన్నది. ప్రమాదం జరిగినప్పుడు ఆయన వాహనంలోనే ఉన్నారని, తర్వాత అక్కడినుంచి డ్రైవర్‌తో సహ పారిపోయారని స్థానికులు చెబుతున్నారు. ఘటనపై ప్రతిపక్ష ఆర్జేడీ తీవ్రంగా మండిపడింది. ఆ పార్టీ నాయకుడు తేజస్వి యాదవ్ ఘటనా స్థలిని సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

## మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు

**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ జరిపిన మందుపాతర పేలుళ్లలో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా తార్రెగూడ, తారుడ్ గ్రామాలకు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో ఈ పేలుళ్లు సంభవించాయి. సీఏఎఫ్ 12వ బెటాలియన్ ఆదివారం కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో కమాండర్ పూరన్ సింగ్, కానిస్టేబుల్ భువనేశ్వర్ యాదవ్‌లు గాయపడ్డారు. ఆపరేషన్‌లో భాగంగా ఆ మార్గం నుంచి ప్రయాణిస్తున్న క్రమంలో మందుపాతరపై అడుగు వేయడంతో జరిగిన పేలుళ్లలో వారు గాయపడ్డారని సీఏఎఫ్ అధికారులు వెల్లడించారు.

## రైల్వే స్టేషన్ల సుందరీకరణ

- డిజైన్లు ఉచితంగా ఇవ్వనున్న హఫీజ్

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రైల్వేస్టేషన్ల పునరాభి వృద్ధిలో భాగంగా.. ముంబయికి చెందిన ప్రముఖ ఆర్కిటెక్ట్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత హఫీజ్ కాంట్రాక్టర్ దేశంలోని 19 రైల్వే స్టేషన్ల డిజైన్లను ఉచితంగా అందించనున్నారు. ఈ విషయాన్ని ఢిల్లీలో జరిగిన ఒక సమావేశంలో ఇండియన్ రైల్వే స్టేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌ఎస్‌డీసీ) మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ కుమార్ లోహియా ఆదివారం తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ... రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధిలో భాగంగా దేశవ్యాప్తంగా 600 స్టేషన్లను ఉత్తమ స్టేషన్లుగా తీర్చిదిద్దడానికి ఏర్పాటుచేసిన కార్యక్రమానికి.. ముంబయికి చెందిన ఆర్కిటెక్ట్ హఫీజ్ 19 స్టేషన్లకు డిజైన్లను తయారుచేసి ఇవ్వడానికి ముందుకొచ్చారన్నారు. వీటిలో మహారాష్ట్రకు చెందిన దదార్, పరేల్, వదాలా, బాంద్రాలతో పాటు మరిన్ని ఇతర స్టేషన్లున్నాయి. ఆయన ఇటీవలే కేంద్ర రైల్వే మంత్రి పియూష్ గోయల్‌తో సమావేశమై చర్చించినట్టు చెప్పారు.

## మార్చి 9న అమర్త్య సేన్ డాక్యుమెంటరీ విడుదల

**కోల్‌కతా:** ఉడ్తా పంజాబ్ సహా ఇటీవల ఎస్ దుర్గా, న్యూడ్ లాంటి చిత్రాలపై 'సెన్సార్' విధించడంతో చెలరేగిన వివాదాల పరంపర కొనసాగుతూనే ఉన్నది. అదే కోవలో సెన్సార్ బోర్డు కష్టాలనెదుర్కొన్న అమర్త్య సేన్ చిత్రం 'ది ఆర్గ్యుమెంటేటివ్ ఇండియన్' డాక్యుమెంటరీ ఎట్టకేలకు మార్చి 9న విడుదల కాబోతున్నది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ముంబయి సూచన మేరకు ఈ చిత్రంలో 'గుజరాత్' శబ్దాన్ని మ్యూట్(తొలగించేందుకు) చేసేందుకు అంగీకరించినట్టు డాక్యుమెంటరీ దర్శకుడు సుమన్ ఘోష్ తెలిపారు.

# శ్రీదేవి స్టైలే వేరు..

**లేడీ సూపర్‌స్టార్‌గా చెరగని ముద్ర**

- హీరోయిన్ల రేంజ్ పెంచి న్యూట్రెండ్ సృష్టించిన తార
- పురుషాధిక్యత తెరపై అతిలోకసుందరి తళుక్కులు



**ముంబయి:** శ్రీదేవి ప్రేక్షక హృదయాలనుంచి దూరమైనా..ఆమె చెరగని ముద్రవేశారు. సిల్వర్ స్క్రీన్‌పై దుమ్మురేపారు. 80,90 దశకాల్లో శ్రీదేవి ఎవరూ అందుకోని స్థానాన్ని సినీ నటి శ్రీదేవి దక్కించుకున్నారు.

**శ్రీదేవితో మారిన ఇండస్ట్రీ ట్రెండ్**

అన్నిచోట్లా పురుషాధిక్యత ఉన్నట్టే..ఫిల్మ్ ఇండస్ట్రీలోనూ ఎక్కువగా ఉండేది.ఫలానా హీరో ఉంటే హిట్టయ్యేదని ప్రచారం జోరుగా కొనసాగింది. అలాంటి ట్రెండ్‌కు తగ్గట్టు పనిచేసుకోవటం కామన్. ఆ ట్రెండ్‌కు భిన్నంగా కొత్తగా చూపించటమే కాదు.. శ్రీదేవి ఉంటే హిట్ గ్యారంటీ అనే విధంగా సిల్వర్‌స్క్రీన్ రేంజ్‌ను మార్చారు.శ్రీదేవి నటన తర్వాత ఆ స్థాయి నటన చేసిన హీరోయిన్లు అందుకోకపోవటం గమనార్హం.రియల్ లైఫ్‌లో ఆమె మనస్తత్వానికి భిన్నంగా ఎన్నో ముఖ్యపాత్రలు పోషించారు. అలరించారు. యావత్ ప్రేక్షకులను ఆకట్టుకున్న ఘనత శ్రీదేవిదే అని చెప్పవచ్చు. టాలీవుడ్,బాలీవుడ్,కోలీవుడ్..ఇలా ఏ ఉడ్ స్క్రీన్ అయినా నేను రెడీ అన్నట్లుగా నటించారు.ఇలా ఎన్నో పాత్రల్లో ఆమె ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయి ముద్రవేసుకున్నారు.శ్రీదేవి ఇకలేరనే షాక్ న్యూస్ నుంచి.. ఆమెతో పనిచేసిన సహనటులు,అభిమానులు తేరుకోలేకపోతున్నారు.




ఒడిషా సముద్ర తీరంలో నటి శ్రీదేవి అకాల మరణం నేపథ్యంలో సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన సైకత శిల్పం

# సిల్వర్ స్క్రీన్‌పై జాహ్నవిని చూడకుండానే..

**ముంబయి:** ఏ తల్లి అయినా .తన కండ్లముందే నిలదొక్కుకోవాలనికుంటుంది. బిడ్డల భవిష్యత్ కోసం సుమారు 15 ఏండ్లపాటు వెండితెరకు దూరమైంది శ్రీదేవి. బాలీవుడ్ తొలి మహిళా సూపర్‌స్టార్ శ్రీదేవి తన కూతుళ్ల విషయంలో ఎంతో శ్రద్ధ చూపేవారు. కూతుళ్లుజాహ్నవి, ఖుషీల జీవితాన్ని అందంగా తీర్చిదిద్దాలని తల్లిగా శ్రీదేవి ఆరాటపడేవారు. తన పెద్ద కుమార్తె సినీ రంగ ప్రవేశం గురించి కూడా ప్రత్యేకశ్రద్ధచూపారు. తాను బాలనటి నుంచి హీరోయిన్‌గా ఎన్నో దశాబ్దాలు సినీ పరిశ్రమలో కొనసాగించినా బిడ్డల విషయంలో..శ్రీదేవి నిత్యం ఆదుర్దాగానే ఉండేవారు. ఈ విషయంపై ఓ ఇంటర్వ్యూలో స్పందిస్తూ.. 'తను (జాహ్నవి) సినీ రంగాన్ని ఈ వృత్తిగా ఎంచుకున్నది.కానీ నేను ఎంతోకాలంగా ఈ పరిశ్రమలో ఉన్నా... తన కన్నా ఎక్కువగా నేనే సంసిద్ధమై ఉన్నాను. తను నన్ను చూస్తూ పెరిగింది. సినీ రంగంలోకి రావడమంటే ఏమిటో తనకు తెలుసు. ఏ వృత్తిలోనైనా.. అనుకున్నంత ఈజీ కాదు. తను చాలా కష్టపడాల్సి ఉంటుంది. తనకు సవాళ్లు ఎదురవుతాయి. వాటిని ఎదుర్కోవడానికి తను సంసిద్ధంగా ఉందని నేను అనుకుంటున్నాను' అని శ్రీదేవి చెప్పిందంటే..వెండితెర వెలుగుల వెనుక ఎంత కథదాగుందో అర్థమవుతోంది.ఈ లోపు కూతురు వెండితెరపై కనిపించేందుకు



సిద్ధమవుతుండగా చూసేందుకు శ్రీదేవి శాశ్వతంగా దూరమయ్యారు. తను లేదు. ఇషాన్ కట్టర్ సరసన 'ధడక్' సినిమాతో జాహ్నవి బాలీవుడ్‌లో ఆరంగేట్రం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది ద్వితీయార్థంలో ఈ సినిమా విడుదల కానున్నది. కానీ, తను నడిచిన సిని పరిశ్రమలో అడుగుపెట్టిన జాహ్నవి తొలి సినిమాలో ఏవిధంగా యాక్టింగ్ చేసింది. ఓ తల్లిగా గర్వపడేలా చెప్పుకోవటానికి శ్రీదేవి లేకపోవటం కుటుంబసభ్యులకూ తీరని శోకమే..

## ఉగ్రవాదుల దాడిలో ఇద్దరు పోలీసుల మృతి

**శ్రీనగర్:** జమ్ముకాశ్మీర్‌లో చోటుచేసుకున్న రెండు వేర్వేరు ఉగ్రవాదుల దాడుల్లో ఇద్దరు పోలీసులు మృతి చెందారు. బుడ్గాం జిల్లాలోని చార్ ఈ షరీఫ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలీసు పోస్టుపై ఉగ్రవాదులు కాల్పులు జరపగా కానిస్టేబుల్ కుల్తార్ సింగ్ తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సింగ్ మరణించాడని వెల్లడించారు.

శ్రీనగర్‌లో హురియత్ నేత ఫజల్ హక్ ఖురేషీ నివాసం బయట ఏర్పాటు చేసిన పోలీసు పోస్టుపై సాయుధులు దాడి చేయడంతో కానిస్టేబుల్ ఫరూక్ అహ్మద్ మృతి చెందారని చెప్పారు. ఖురేషీ 2009లో సాయుధుల దాడిలో గాయపడ్డారని గుర్తు చేశారు. ఈ ప్రాంతాల్లో నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారని తెలిపారు.

## 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ర్యాంక్ కోసం కేంద్రం కసరత్తులు

**న్యూఢిల్లీ:** దేశంలోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం పలువిధాలుగా ప్రయత్నిస్తున్నది. ఇందులో భాగంగానే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ర్యాంక్‌ను మరింత మెరుగుపరుచుకునేందుకు కసరత్తులు మొదలు పెట్టింది. దీని కోసం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ నాలుగు సంస్థలను నియమించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంక్‌లో భారత్ మెరుగుపడేందుకు నాలుగు సంస్థలు..ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ), ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ), ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రెటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ), నేషనల్ ఇనిస్టుట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐసీఎంఆర్)లు భాగస్వామ్య పక్షాలకు సలహాలు ఇవ్వాలని సూచించింది.

## యూపీలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

**భాదోహి:** అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన ఉత్తరప్రదేశ్‌లో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భాదోహి జిల్లాలోని మిశ్రాని గ్రామంలో ఉండే అంబేద్కర్ విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేశారు. ఈ ఘటన పై గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చివరకు గ్రామస్తుల అంగీకారంతో నాలుగు అడుగుల ఎత్తు ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. కాగా, నిందితుల పై సంబంధిత సెక్షన్ల కింద కేసుల నమోదు చేసినట్టు పోలీసు అధికారి రాం కరణ్ తెలిపారు.

## తండ్రికి జరిగిన అవమానం తట్టుకోలేక...

- కూతురు ఆత్మహత్యా యత్నం
- మధ్యప్రదేశ్‌లో ఘటనః

**భోపాల్:** తీసుకున్న అప్పు కట్టలేదని తన తండ్రిని అవమానించడమే కాక, ఆ ఘటనను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవమానాన్ని భరించలేక యువతి (19) ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... జబల్‌పూర్‌కు చెందిన బీజేపీ మైనార్టీ శాఖ నాయకుడు మహమ్మద్ షఫీ వద్ద బాధితురాలి తండ్రి అప్పు తీసుకున్నాడు. కొంతకాలంగా అప్పు తీర్చాలని వేధిస్తున్నాడు. శనివారం ఓ రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి.. అక్కడ ఆమె తండ్రిని 'కోడి'లాగా కూర్చోబెట్టారు. షఫీ, అనుచరులు అతడిని కాళ్లతో తన్నారు. అతడిపట్ల అభ్యంతరకరంగా ప్రవర్తిస్తూ అవమానించారు. ఘటనను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ వీడియోను ఆమె చదువుతున్న కాలేజీలోని తోటి విద్యార్థులూ చూశారు. దీంతో ఆమె అవమానం భరించలేక ఆత్మాహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## తొలిసారిగా ఎలిఫెంటా గుహలకు విద్యుత్

- మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ:** ఎలిఫెంటా గుహలతో పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న మహారాష్ట్ర సమీపంలోని ఘరాపురి ద్వీపానికి మొట్టమొదటి సారి విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. 70 ఏండ్ల స్వాతంత్ర్య భారతంలో తొలిసారిగా ఈ సౌకర్యాన్ని ఆ ద్వీప వాసులు పొందడం ఆశ్చర్యంగా ఉన్నదని ఆదివారం నిర్వహించిన 41వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ఈ ద్వీపంలోని మూడు గ్రామాలు రాజ్‌బందర్, మోరాబందర్, షేట్‌బందర్ వాసుల జీవితాల్లోకి మొదటిసారిగా విద్యుత్ వెలుగులువచ్చాయని అభివర్ణించారు. ఇది అభివృద్ధి శకానికి నాంది అని ప్రకటించారు. అన్ని అంశాల్లో మహిళలను భాగస్వాములను చేయాలన్నారు. నూతన భారత నిర్మాణంలో మహిళల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. సాంకేతికత, కృత్రిమ మేధ..పేదలు, అట్టడుగు వర్గాల సంక్షేమానికి ఉపకరించాలని చెప్పారు. కృత్రిమ మేధస్సుతో వికలాంగుల జీవితాలను మెరుగుపర్చేందుకు కృషి చేయాలని శాస్త్రవేత్తలను కోరారు.

**అంతర్జాతీయం**

## సిరియాలోని ఉగ్ర శిబిరాలను నిర్మూలిస్తాం : ఇరాన్ ఆర్మీ చీఫ్

**టెహ్రాన్ :** సిరియాలోని ఉగ్ర శిబిరాలను నిర్మూలించడమే తమ లక్ష్యమని ఇరాన్ ఆర్మీ చీఫ్ మొహ్మద్ బగేరీ తెలిపారు. సిరియాలో 30 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించాలని భద్రతా మండలి తీసుకున్న నిర్ణయానికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. అయితే, కాల్పుల విరమణ ఒప్పందంలో ప్రస్తావించని ప్రాంతాలపై తమ దాడులు యధాతథంగా కొనసాగుతాయని ఆయన ఉద్ఘాటించారు. ఉగ్రసంస్థల నిర్మూల కోసం తమ ఆపరేషన్ కొనసాగిస్తామన్నారు.

## సోమాలియాలో పేలుళ్లు : 40 మంది మృతి



**మొగధీషు :** సోమాలి యాలో రెండు కారు బాంబులు పేలడంతో 40 మంది మృతి చెందారు. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షత గాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తు న్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...సోమాలియా అధ్యక్ష కార్యాలయంతో పాటు దీనికి దగ్గరలో ఉన్న మరో హోటల్ ఆవరణలో బాంబులు పేలాయి. దీంతో, ఆ ప్రాంతమంత దద్దరిల్లింది. పేలుడు ధాటికి పార్కింగ్ స్టాండ్, పలు భవనాలు తునాతునకలయ్యాయి. పేలుళ్ల చప్పుడుతో ప్రజలు భయాందోళనకు గురై ప్రాణభయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. కాగా, ఈపేలుళ్లకు తామే బాధ్యత వహిస్తున్నట్టు అల్-షాబాబ్ ఉగ్రసంస్థ ప్రకటించుకుంది. భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉంటారని అనుమానిస్తున్నట్టు సోమాలియా రక్షణ మంత్రి మొహ్మద్ అబూకర్ ఇస్లో తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## అమెరికా ఆరోపణలు అర్థరహితం : రష్యా

**వాషింగ్టన్ :** దక్షిణ కొరియాలోని ప్యాంగ్ చాంగ్ నగరంలో జరిగిన వింటర్ ఒలింపిక్స్‌కు సంబంధించి అగ్రరాజ్యం రష్యాపై ఆరోపణలు చేసింది. అమెరికా ఆరోపణలను రష్యా తాజాగా ఖండించింది. అమెరికా ఆరోపణలు అర్థరహితమంటూ చురకలంటించింది. వింటర్ ఒలంపిక్స్‌లో అధికారులు ఉపయోగించే కంప్యూటర్లను రష్యా హ్యాక్ చేసిందంటూ అమెరికా ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈనెల 9న ప్రారంభమైన ఈ క్రీడా సమరం ఆదివారంతో ముగిసింది. అయితే, రష్యన్ మిలిటరీ గూఢాచారులు ఒలింపిక్స్‌కు సంబంధించిన కీలక సమాచారాన్ని దొంగిలించారంటూ అమెరికా ఆరోపిస్తోంది. ఫిబ్రవరి 9న ప్రారంభ వేడుకల సందర్భంగా సైబర్ దాడులు జరిగినట్టు నిర్వాహకులు ప్రకటించారు. కానీ, అది రష్యా పనేనా అన్న విషయం మాత్రం వాళ్లు ధృవీకరించలేదు. దీంతో, అమెరికా చేస్తున్న ఆరోపణలు వాస్తవమేనన్న అనుమానాలు మొదలయ్యాయి. డోపింగ్ ఆరోపణల కారణంగా రష్యన్ బృందంలోని సభ్యులపై అంతర్జాతీయ ఒలంపిక్ కమిటీ(ఐవోసీ) నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఈ కారణంతో రష్యా నుంచి ఎక్కువ సంఖ్యలో ఆటగాళ్లు హాజరుకాలేకపోయారు. ఈ నేపథ్యంలోనే ఐవోసీపై ప్రతీకారం తీర్చుకునేందుకు రష్యా ఈ దాడులకు పాల్పడిందని అమెరికా చెబుతోంది. ముగింపు వేడుకలకు కూడా రష్యా అంతరాయం కలిగించే ఆస్కారం ఉందన్న ఆరోపణలతో దగ్గరుండి పర్యవేక్షించబోతున్నట్టు అమెరికా ప్రకటించగా.. అందుకు దక్షిణ కొరియా అంగీకరించింది. మరోవైపు రష్యా మాత్రం అమెరికా ప్రకటనను ఖండించింది.

# ఇజ్రాయిల్‌లో నిరసనలు

- ప్రధాని రాజీనామా చేయాలని డిమాండ్

**టెల్‌అవీవ్ :** ఇజ్రాయిల్ నిరసనలతో అట్టుడికింది. దేశ ప్రధాని రాజీనామా చేయాలంటూ ఆందోళనకారులు కదం తొక్కారు. నెతన్యాహూ తన పదవికి రాజీనామా చేసేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు. అవినీతి, అధికార దుర్వినియోగం, విదేశాల నుంచి ముడుపులు స్వీకరించిన ఆరోపణలు నెతన్యాహూ ఎదుర్కొంటున్నారు.ఈనేపథ్యంలో ప్రధాని తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. రాజధాని టెల్‌అవీవ్ వీధుల్లో ప్లకార్డులు, బ్యానర్లు చేబూని నెతన్యాహూ వ్యతిరేక నినాదాలు చేశారు. ప్రధాని తన పదవికి రాజీనామా చేసి విచారణకు సహకరించాలని కోరారు. స్థానిక మీడియా సంస్థలు తెలిపిన వివరాల ప్రకారం...టెల్ అవీవ్‌లో తీసిన ర్యాలీలో 1500 మంది నిరసనకారులు పాల్గొన్నారు. ' నెతన్యాహూ లాంటి అవినీతి ప్రధానిని మేం చూడలేదు. చట్టం ముందు అందరూ సమానులే. నెతన్యాహూ స్వచ్ఛంధంగా తన పదవికి రాజీనామా చేయాలి' అంటూ నిరసనకారులు నినదించారు. కాగా, అవినీతి, అధికార దుర్వినియోగం కేసుల్లో ప్రధాని నిందితుడనేందుకు తమ వద్ద స్పష్టమైన ఆధారాలున్నాయని గతవారం పోలీస్ ఉన్నతాధికారులు




మీడియా సమావేశంలో పేర్కొన్నారు. నెతన్యాహూని విచారించేందుకు తమను అనుమతించాలంటూ అటార్నీ జనరల్‌కు విజ్ఞాపన పత్రం పంపారు. ప్రస్తుతం ఇది పెండింగ్ దశలో ఉంది. అటార్నీ జనరల్ నుంచి అనుమతి లభించినట్టయితేనే నెతన్యాహూను విచారించేందుకు వీలుంటుంది.

# భద్రతా మండలి డిమాండ్లను స్వాగతిస్తున్నా

- ఐరాస జనరల్ సెక్రటరీ ఆంటోనియో గుటెరస్

**న్యూయార్క్ :** సిరియాలో 30 రోజులపాటు కాల్పులను విరమించాలని ఐక్యరాజ్య సమితి (ఐరాస) భద్రతా మండలి చేసిన డిమాండ్‌ను ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ స్వాగతించారు. తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి రావాలన్నారు. తిరుగుబాటుదారుల స్వాధీనంలో ఉన్న ఘౌటా ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిరియా సైన్యం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నది. తిరుగుబాటుదారులకు, భద్రతా బలగాలకు మధ్య జరుగుతున్న పోరు కారణంగా సామాన్య ప్రజలు చనిపోతున్నారు. ఈ ప్రాంతంలో భీతావహ వాతావరణం నెలకొన్నది. ఈ నేపథ్యంలో సిరియాలో శాంతియుత




వాతావరణం నెలకొల్పాలని ఐరాస భద్రతా మండలి తీర్మానించింది. సిరియా ప్రజలకు మానవీయ సహాయం ఎటువంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా జరగడానికి వీలుగా ఈ తీర్మానం తక్షణమే అమలు జరగాలని గుటెరస్ పిలుపునిచ్చినట్టు ఐరాస అధికార ప్రతినిధి డుజారిక్ చెప్పారు.

సామాన్య ప్రజలను కాపాడవలసిన బాధ్యత అన్ని పక్షాలకు ఉందని గుటెరస్ చెప్పారు.

**'సిరియాలో హింసాత్మక ఘటనలు అమానవీయం**

సిరియాలో హింసాత్మక ఘటనలు చెలరేగడం పట్ల పోప్ ఫ్రాన్సిస్ ఆందోళన వ్యక్తం చేశారు. సిరియాలో అమానవీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. సిరియాలో శాంతి స్థాపన కోసం ఐరాస భద్రతా మండలి ప్రతిపాదించిన 30రోజుల కాల్పుల విరమణ ఒప్పందం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తద్వార యుద్ధవాతావరణం నెలకొన్న ప్రాంతాల్లోని ప్రజలకు సహాయక చర్యలు అందించేందుకు వీలవుతుందని పోప్ అభిప్రాయపడ్డారు. సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లోని చర్చిలో ఆయన ప్రార్థన చేశారు.సిరియాలో శాంతియుత వాతావరణం నెలకొనాలని ప్రార్థించినట్టు తెలిపారు

# దక్షిణ కొరియాలో నిరసనలు

- ఉత్తర కొరియా ఇంటెలిజెన్స్ చీఫ్ తమ దేశంలో డుగుపెట్టొదంటూ...

**సియోల్ :** ఉత్తర కొరియా జాతీయ నిఘా విభాగం అధ్యక్షుడు కిమ్ యోంగ్ చోల్ దక్షిణ కొరియాలో అడుగుపెట్టవద్దంటూ అక్కడ నిరసనకారులు ఆందోళ నకు దిగారు. పియాంగ్‌చాంగ్‌లో జరిగే శీతాకాల ఒలింపిక్స్ ముగింపు ఉత్స వాల్లో పాల్గొనేందుకు ఉత్తర కొరియా నుంచి కిమ్ యోంగ్ చోల్ నేతృత్వంలో 8 మంది ఉన్నతస్థాయి అధికారుల బృందం ఆదివారం దక్షిణ కొరియాకు చేరుకుం ది. ఈ బృందానికి దక్షిణ



కొరియాలో నిరసన సెగ తాకింది. కిమ్ యోంగ్ చోల్‌ను తమ దేశానికి రానివ్వమంటూ నిరసనకారులు గళమెత్తారు. అనంతరం అధికారులు సర్దిచెప్పడంతో సద్దుమణిగారు. 2010 సంవత్సరంలో దక్షిణ కొరి యాకు చెందిన యుద్ధనౌక పేలుడు ఘటనలో 46 మంది సైనికులు చనిపో యారు. ఈ సంఘటనకు సూత్రధారిగా కిమ్ యోంగ్ చోల్ అని దక్షిణ కొరియా ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ఆయన రాకను నిరసిస్తూ పాజులో అప్పుడు చనిపోయిన సైనికుల కుటుంబాలు, కొంత మంది చట్టసభ్యులు ఆందోళనకు దిగారు. కిమ్ యోంగ్ చోల్ పర్యటనపై ప్రజలు అసహనం ప్రదర్శిస్తున్నప్పటికీ రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, శాంతి భద్రతలు మెరుగుపడతాయనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆయన పర్యటనను ఆహ్వానించింది. ఫిబ్రవరి 9న జరిగిన ప్రారంభోత్సవానికి ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యో జోంగ్, ఉన్ ప్రభుత్వంలో కీలక అధికారి కిమ్ యోంగ్ నామ్ హాజరైన సంగతి తెల్సిందే.

## చైనాపై పట్టుబిగిస్తున్న జిన్‌పింగ్

- రాజ్యాంగ సవరణకు చైనా కమ్యూనిస్ట్ పార్టీ ప్రతిపాదన



**బీజింగ్ :** చైనా అధ్యక్షుడు జిన్‌పిం గ్ అటు పార్టీపై ఇటు పాలనపై తనదైన శైలిలో ముద్రవేసి పట్టుబిగిస్తున్నారు. దీనిలో భాగంగా చైనా కమ్యూనిస్టు పార్టీ తాజాగా కొత్త ప్రతిపాదనలను తెరపైకి తీసుకొచ్చింది. దీని ప్రకారం.. అధ్యక్ష పదవిలో ఎవరైనా రెండు సార్లు మాత్రమే కొనసాగాలనే నిబంధనకు మంగళం పాడాలని యోచిస్తున్నది. ఇప్పటికే జిన్‌పింగ్‌కు పార్టీ వ్యవస్థాపకుడు మావో తర్వాత అత్యంత శక్తివంతమైన నేత హోదాను కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా కట్టబెట్టింది. తాజా సవరణతో జిన్‌పింగ్ స్థానం మరింత పదిలం కానుంది. ఈ విషయాన్ని చైనా అధికారిక మీడియా సంస్థ జిన్హువా పేర్కొన్నది. వచ్చే పదేండ్ల కాలానికి.. ఆ తర్వాత కూడా జిన్ పింగ్ స్థానం పదిలం కానుందని పేర్కొంది. కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీకి చెందిన 205 మంది సభ్యులు రాజ్యాంగాన్ని సవరించాలని ప్రతిపాదించినట్టు తెలిపింది. అధ్యక్షుడు, ఉపాధ్యక్ష పదవులకు ఉన్న 'వరుసగా రెండుసార్లు మాత్రమే ' నిబంధనను తొలగించాలని దీనిలో పేర్కొన్నట్టు సమాచారం. జిన్‌పింగ్‌కు ముందు ఆ పదవిలో ఉన్న హుజింటావో, జియాంగ్ జెమిన్‌లో రెండు సార్లు అధ్యక్షులుగా పనిచేసి తప్పుకున్నారు.

## కాంట్రాక్టు కాలపరిమితి మేరకే హెచ్1బీ వీసాల మంజూరు

- యూఎస్‌సీఐఎస్ తాజా మార్గదర్శకాలు

**వాషింగ్టన్:** థర్డ్‌పార్టీ వర్క్‌సైట్లలో కాంట్రాక్టు కాలపరిమితి మేరకే వీసాలు మంజూరు చేయనున్నట్టు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) పేర్కొన్నది. ఈ విధా నం ఈనెల22 నుంచి అమల్లోకి తీసుకొచ్చినట్టు తెలిపింది. అమెరికన్లు, వల సేతర కార్మికుల వేతనాలు, పరిస్థితుల్ని మెరుగుపర్చేందుకే ట్రంప్ యంత్రాంగం కొత్త హెచ్1బీ వీసా పాలసీని తీసుకొచ్చిందని పేర్కొన్నది. అమెరికాలో పలు సంస్థలు ఉద్యోగులకు చెల్లించాల్సిన వేతనాల కంటే తక్కువగా చెల్లించడమే కాకుండా నైపుణ్యంలేని పనుల్ని అప్పగిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని యూఎస్‌సీఐఎస్ వెల్లడించింది. ఇలాంటి మోసాలను అరికట్టేందుకే కొత్త హెచ్1బీ విధానాన్ని తీసుకొచ్చినట్టు వివరిం చింది. యూఎస్‌సీఐఎస్ జారీ చేసిన తాజా నిబంధనల ప్రకారం థర్డ్ పార్టీ వర్క్ సైట్‌లో ఎంత కాలం పనుంటే అంత కాలానికే హెచ్1బీ వీసాలు జారీ చేస్తారు. గతంలో మూడేండ్ల కాలానికి హెచ్1బీ వీసాల్ని జారీచేస్తుండగా... ఇక నుంచి అంతకంటే తక్కువ కాలానికే జారీ చేయనున్నారు. 2019 ఆర్థిక సంవత్సరానికి హెచ్1బీ వీసా దరఖాస్తుల ప్రక్రియ ఏప్రిల్2 నుంచి ప్రారంభం కానుంది.

## నా బట్టతల కన్పించకుండా చేయలేకపోతున్నా : ట్రంప్



**వాషింగ్టన్:** ప్రముఖ మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విటర్ ద్వారా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ నెటిజన్లకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సవాళ్లు విసురు తుంటారు. ఏదైనా కార్యక్రమంలో మాట్లాడే సమయంలో ఆయన చూపే హావ భావాలు, ముఖ కవళికలు చాలా విచిత్రంగా ఉంటాయి. ఒక్కోసారి ట్రంప్ తనమీద తానే జోకులు వేసుకుంటారు. కన్జర్వేటివ్ పొలిటిక్ యాక్షన్ కాన్ఫ రెన్స్‌లో ట్రంప్ ప్రసంగానికి వచ్చిన సమయంలో ఆయన తన బట్టతల గురించి మాట్లాడారు. తన బట్టతల గురించి జోకులు వేయడంతో హాలంతా నవ్వులతో నిండిపోయింది. 'నా బట్టతలను కనిపించకుండా చేయడం కోసం నేను చాలా కష్టపడుతున్నాను. కానీ అది మాత్రం అందరికీ కనపడుతున్నది. నా బట్టతల అంత బాగోకుండా మాత్రం లేదు' అంటూ ట్రంప్ చమత్కరించారు. దీంతో ఆ హాలు అంతా నవ్వులతో నిండిపోయింది. తన బట్టతలను కనిపించకుండా ఉంచేందుకు జుట్టును ఎలా సరిచేసుకుంటారో అనేది యాక్షన్ ద్వారా చేసి చూపించడం కార్యక్రమానికి వచ్చిన వారికి మరింత నవ్వు తెప్పించింది.

# యాదాద్రీశా... ఇదేం అన్యాయం!

## కల్యాణం పేరిట ఉద్యోగుల జీతాల్లో కోత

- 300 మంది నుంచి రూ.7.55లక్షలు వసూలు
- ఈవో మెప్పు కోసం యూనియన్ నాయకుల పాట్లు
- ప్రశ్నిస్తే ఎక్కడ కొలువు పోతుందోనన్న భయంలో సిబ్బంది
- మీడియా ప్రకటనల కోసమే... ఒప్పుకున్నాకే కట్ చేశాం : ఈవో




**నవతెలంగాణ-యాదాద్రిభువనగిరి ప్రతినిధి**

యాదాద్రీశుని చెంతన నిధులకు కొదువ లేదు. సర్కారే రూ.వెయ్యి కోట్లు కేటాయించింది. ఇంకో వైపు దేవస్థాన ఆదాయమూ బానే వస్తోంది. కానీ, అధికారుల్లో ఉన్నదల్లా భావ'దారిద్ర్యం'! చిరుద్యోగులపట్ల నిర్దయ. అంతకుమించి 'గీత' దాటనివ్వనంతగా ఆధిపత్యం. ఆపై చిన్న చూపు! అందుకేనేమో బ్రహ్మోత్సవాల పేరిట ఉన్నతాధికారులు సిబ్బంది జీతాల్లో కోత పెట్టారు. అదీ..తెలివిగా.. అఫీషియల్‌గా కల్యాణం టిక్కెట్లు కొనిపించారు. అట్లా..302 మంది ఉద్యోగుల నుంచి తలా రూ.2,500 చొప్పున రూ.7.55 లక్షలు గుంజారు. చాలీ చాలని జీతంలోనే జీవితాలను సర్దుకునే శ్రమజీవుల సొమ్మే వారికి కావాల్సి రావడం అత్యంత బాధాకరం. రకరకాల పనులతో స్వేదం చిందించే సిబ్బంది పట్ల గౌరవం, జాలి చూపించి...పారితోషికాలు ఇచ్చి బ్రహ్మోత్సవాల అనుభూతిని పంచాల్సిన ఆలయ పెద్దలే ఫోర్సుగా పెద్ద భారం మోపడాన్ని ఆ భగవంతుడు మెచ్చుతాడా..? అంతగా కాంట్రిబ్యూట్ చేయాలనుకుంటే.. భారీ పైకాలు పొందే ఉన్నతాధికారులు వేతనాలను ఎందుకు సమర్పించుకోరో? అర్థం కాని పరిస్థితి. ఉద్యోగులపై యాదాద్రి ఆలయ ఉన్నతాధికారులు చూపిస్తున్న జులుంపై కథనం..

తెలంగాణ తిరుమలగా యాదాద్రిని అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.400లకు పైగా కోట్లు ఇచ్చినట్టు ప్రకటించింది. భక్తుల నుంచి ఆలయానికి ఏటా కోట్లా రూపాయల అదాయం వస్తోంది. బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ప్రభుత్వం సుమారు రూ.40లక్షలు ఖర్చు పెట్టుకోవడానికి దేవస్థానం అధికారులకు బడ్జెట్ అనుమతి ఇచ్చింది. ఈ నిధులు సరిపోనట్టూ.. ఆలయ అధికారి మాత్రం యాదాద్రి బ్రహ్మోత్సవాల మీడియా ప్రకటనలకని ఉద్యోగుల జీతాలకు కోత పెట్టారు. బ్రహ్మోత్సవాల బడ్జెట్‌ను మిగల్చడానికే యూనియన్ నేతల అంగీకారంతోనే ఇలా చేస్తున్నట్టు సమాధానం చెప్పడం గమనార్హం. ఇదీలా ఉండగా ప్రతి విషయంలో తారతమ్యం ప్రదర్శించే ఉన్నతాధికారులు కల్యాణం పేరిట కట్ చేసిన జీతంలో మాత్రం అందరూ సమానులేనని వ్యవహరించారు. పైస్థాయి అధికారి నుంచి కింది స్థాయి చిరుద్యోగి వరకు ఒకే రకమైన కోత విధించారు. ఆలయంలో వివిధ స్థాయి అధికారులు 85, అర్చకులు, వేద పండితులు 78, నాలుగోవ తరగతి ఉద్యోగులు 139 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా నాల్గో తరగతి ఉద్యోగుల్లో 90 శాతం పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన వారే ఉన్నారు. ఒక్కోఉద్యోగి పేరిట రూ.2,500 చొప్పున 302 మంది నుంచి 7,55,000 నగదును కల్యాణ టికెట్ పేరున కట్ చేసి ఇందుకు ధ్రువీకరణగా రశీదు ఇచ్చారు. పై స్థాయి నుంచి కింది స్థాయి చిరుద్యోగి వరకు డబ్బులను సమానంగా కట్‌చేసి కళ్యాణోత్సవంలో కూర్చునే వద్ద మాత్రం గ్రేడింగ్ ఏర్పాటు చేసి వివక్ష ప్రదర్శించారు. ఉన్నతాధికారుల కుటుంబ సభ్యులు ముందు వరుసలో కూర్చుని సిబ్బంది కుటుంబ సభ్యులను వెనుక వరుసలో కూర్చోబెడుతున్నారు. మరోవైపు బ్రహ్మోత్సవాల పనుల్లో తలమునకలై ఉండే ఆలయ సిబ్బంది కల్యాణంలో ఎలా కూర్చుంటారో అధికారులే చెప్పాలి. ఈ అంశాలను బట్టి చూస్తే ఆలయ ఉన్నతాధికారులే సిబ్బందితో బలవంతంగా టికెట్లు కొనిపించి బల్మీకి విరాళాలు సేకరించినట్టు తెలుస్తోంది. సిబ్బంది పక్షాన అధికారులను ప్రశ్నించాల్సిన యూనియన్ నాయకులు ఈవో మెప్పు పొందటానికి ఉద్యోగుల ప్రయోజనాలను పణంగా పెడుతున్నారన్న విమర్శలున్నాయి. సంఘాన్ని కాదని గొంతెత్తి ప్రశ్నిస్తే ఎక్కడ తమ కొలువులకు ఎసరు వస్తుందోనన్న భయంతో సిబ్బంది బహిరంగంగా మాట్లాడట్లేదు.

**యూనియన్ ఒప్పుకున్నాకే కట్ చేశాం : గీత, యాదాద్రి ఈవో**

ఉద్యోగులను పేరుపేరునా అడగలేం కదా! యూనియన్ సభ్యులతో చర్చించే ఉద్యోగుల జీతంలో కట్ చేశాం. అందుకు వారు అంగీకరించారు. అసలు ఈ నగదంతా మీడియా ప్రకటనల కోసమే. బడ్జెట్ నుంచి కాకుండా ఈ-టికెట్ల ద్వారా వచ్చిన దాంతోనే లోటు లేకుండా చూస్తున్నాం.



## ఘనంగా స్వామివారి దివ్య విమాన రథోత్సవం

**నవతెలంగాణ-యాదాద్రి**

యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు ఆదివారం రాత్రి విశేష ఘట్టమైన శ్రీస్వామి వారి దివ్యవిమాన రథోత్సవం నయనానందకరంగా జరిగింది. రాత్రి 7.00 గంటల నుంచి 7.30వరకు బాలాలయంలోనే స్వామివారి దివ్య విమాన రథోత్సవాన్ని నిర్వహించారు. రథంపై నూతన దంపతులు కల్యాణమూర్తులైన (ఉత్సవమూర్తులు) శ్రీఅమ్మవారిని, శ్రీస్వామివారిని పట్టుపీతాంబరాలు, వజ్ర వైఢూర్యాలు పొదిగిన బంగారు ఆభరణాలతో అలంకరించి అధిష్ఠించారు. రథంముందు రథాంగహోమం, బలిహరణం గావించారు. రథాన్ని ఆలయ ఈవో ఎన్.గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఆలయాధికారులు ప్రారంభించారు. రాత్రి 8 గంటలకు కొండకింద వైకుంఠ ద్వారం నుంచి శ్రీస్వామివారి కవచమూర్తులను ప్రచార రథంలో అధిష్ఠింపజేసి పురవీధుల గుండా రథోత్సవం నిర్వహించారు.

## పోరాట యోధులను కన్ననేల పాలకుర్తి

- శాసనమండలి చైర్మెన్ స్వామిగౌడ్



**నవతెలంగాణ-పాలకుర్తి**

పాలకుర్తి ప్రాంతం పోరాటయోధులను కన్న విప్లవనేల అని శాసన మండలి చైర్మెన్ కనకమామిడి స్వామిగౌడ్ అన్నారు. పోరాట యోధులను విస్మరిస్తే రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలకు మనుగడ ఉండదన్నారు. జనగామ జిల్లా పాలకుర్తిలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న కాంస్యవిగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య, షేక్ బందగీ, చాకలి ఐలమ్మలతో పాటు మరెందరో మహానుభావులకు పాలకుర్తి జన్మనిచ్చిందన్నారు. పోరాటయోధుల స్ఫూర్తిని ముందుతరాలకు అందించేందుకు బహుజనులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. నిజాం నవాబులకు వ్యతిరేకంగా దొరల అరాచకాలను అంతమొందించేందుకు ఆత్మగౌరవం కోసం సర్దార్ సర్వాయిపాపన్న ఆ రోజుల్లోనే పోరాటం చేశారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని స్వామి గౌడ్‌ను కోరారు. కల్లుగీత సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ రమణ మాట్లాడుతూ బహుజనుల రాజ్యాన్ని స్థాపించేందుకు బహుజనులందరూ ముందుకు సాగాలన్నారు. గీత కార్మికుల సమస్యలను పరిష్కరించి వారందరికీ న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రతి వంటగదీ ఆయుర్వేద క్లీనిక్

హైకోర్టు జస్టిస్ టి.అమర్‌నాథ్‌గౌడ్

- ఆయుర్వేద అభివృద్ధికి కేంద్రం కృషి : ఎన్.రాంచందర్‌రావు

**నవతెలంగాణ-సిటీ బ్యూరో**

ప్రతి వంట గదీ ఓ ఆయుర్వేద క్లీనిక్‌ను తలపిస్తుందని ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు జస్టిస్ టి.అమర్‌నాథ్‌గౌడ్ అన్నారు. ఎర్రగడ్డలోని డాక్టర్ బీఆర్‌కేఆర్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాలలో ఆదివారం 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ పెయిన్ మేనేజ్‌మెంట్ ఇన్ ఆయుర్వేద' అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆయుర్వేదిక్ వైద్యురాలిగా చలామణి కావడానికి వంటగది ఎంతో ప్రావీణ్యం కల్పిస్తుందన్నారు. మానవ జీవితంలో పలు మానసిక ఒత్తిడులను అధిగమించడానికి ఆయుర్వేదిక్ ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. ఆయుర్వేదంలో అనేక రోగాలకు ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ లేకుండా నివారించే మందులున్నాయని వివరించారు. దీనికి కొంతకాలం నుంచి వచ్చిన మార్పులే నిదర్శనమని చెప్పారు. డాక్టర్ యాదయ్య లాంటివాళ్లు చాలా మంది ఆయుర్వేదిక్ నిపుణులను తయారు చేస్తున్నారని కొనియాడారు.

ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆయుర్వేద అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందన్నారు. ఆయుర్వేదం, యునానీలకు గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రాధాన్యత పెరిగిందని చెప్పారు. అనంతరం కొన్నేండ్లుగా ఆయుర్వేదిక్ వైద్యం, టీచింగ్‌లో నైపుణ్యం సాధించిన ప్రొఫెసర్ ఎస్ఎస్. సావరికర్, డాక్టర్ మాణిక్‌శర్మ, డాక్టర్ విద్యాసాగర్‌లకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు అందజేశారు. డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ సందీప్‌పాటిల్‌కు వైద్యరత్న అవార్డులు ఇచ్చారు. ఎస్.గోపకుమార్‌కు యంగ్ సైంటిస్టు అవార్డు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులు, వివిధ అవార్డుల గ్రహీతలు కలిసి సావనీర్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు డాక్టర్ బీఆర్‌కేఆర్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల విద్యార్థిని రుచిక చేసిన నాట్యం అందర్నీ ఆకట్టుకుంది.

# నేడే ప్రజా చైతన్య బస్సు యాత్ర

## చేవెళ్ల నుంచి ప్రారంభం...షెడ్యూల్ విడుదల

- పాటల సీడీని ఆవిష్కరించిన ఉత్తమ్
- బస్సు యాత్రకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపు

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

టీఆర్ఎస్ ఎన్నికల హామీలు.. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంతో జరుగుతున్న మోసాన్ని ప్రజలకు చెప్పేందుకు టీపీసీసీ తలపెట్టిన ప్రజా చైతన్య బస్సుయాత్ర సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభం కానుంది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణంలో నిర్వహించనున్న బహిరంగ సభ తర్వాత బస్సుయాత్ర ప్రారంభమవుతున్నది. ఆదివారం ఈమేరకు టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బస్సుయాత్ర షెడ్యూల్ ప్రకటించారు. 26న ప్రారంభం కానున్న బస్సుయాత్రను హోలిపండుగ సందర్భంగా మూడు రోజులపాటు విరామం ఇవ్వనున్నారు. ఆ తర్వాత మార్చి 9 వరకు యాత్ర కొనసాగుతుందని ఆయన చెప్పారు.

**'తెలంగాణ గుండె చప్పుడు' పేరుతో పాటల సీడీ**

బస్సు యాత్రను పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ యువనేత పెరిక శ్యామ్ నిర్మించిన 'తెలంగాణ గుండె చప్పుడు' పాటల సీడీని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఏపూరి సోమన్న ఆధ్వర్యంలో సాంస్కృతిక బృందం సీడీలో కొన్ని పాటలను పాడి వినిపించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కటకం మత్యుంజయం, వేణుగోపాలరావు, నేరెళ్ల శారద పాల్గొన్నారు. అనంతరం ప్రజా చైతన్య యాత్ర మద్దతుగా ఓయూ జేఏసీ రూపొందించిన నిరుద్యోగ పోస్టర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్ రూపొందించిన పోస్టర్‌ను కూడా ఆయన ఆవిష్కరించారు. బండి సుధాకర్‌గౌడ్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



**ఎన్ఎస్‌యూఐ, యూత్ పూర్వ నేతల సమ్మేళనం**

నాలుగేండ్ల కేసీఆర్ పాలనలో ప్రజా సంక్షేమం లేదని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. ఇందిరాభవన్‌లో జరిగిన పూర్వ ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నేతల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కాంగ్రెస్ ప్రజా చైతన్య బస్సు ద్వారా కేసీఆర్ నియంత, కుటుంబ పాలనకు పరిమితమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు రూ 3 వేల నిరుద్యోగ భతి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు భట్టి మల్లు విక్రమార్క, ఉపాధ్యక్షులు మల్లురవి, వినోద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**రాజకీయ కక్ష సాధిస్తున్న ప్రభుత్వం : డీజీపీకి మల్లు రవి లేఖ**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం ఎత్తొండ సహకార సంఘాన్ని రద్దు చేసి, సీసీ కెమెరాలను మూసేసి రికార్డులను ఎత్తుకెళ్లారని, దీనిపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి కోరారు. ఈమేరకు ఆదివారం ఆయన డీజీపీ లేఖ రాశారు. సంఘం చైర్మెన్ సోమశేఖర్‌రావు సంఘాన్ని ఆర్థికంగా ఎంతో బలోపేతం చేశారన్నారు.

## నేడే పీఈసెట్ నోటిఫికేషన్ జారీ

- 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీఈసెట్)-2018 రాతపరీక్ష నోటిఫికేషన్ సోమవారం విడుదల కానుంది. పీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వి సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పీఈసెట్ రాత పరీక్ష మే7న జరగనుందని తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు ఫీజు ఎస్సీ, ఎస్టీలు రూ.400, ఇతరులు రూ.800 చెల్లించాలని కోరారు. దరఖాస్తుల సమర్పణకు తుదిగడువు ఏప్రిల్ 10వ తేదీ వరకు ఉందని తెలిపారు. అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఏప్రిల్ 20వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని పేర్కొన్నారు. అపరాధ రుసుం రూ.500తో ఏప్రిల్ 17 వరకు, రూ.2 వేలతో ఏప్రిల్ 24 వరకు, రూ.5 వేలతో ఏప్రిల్ 30వ తేదీ వరకు అవకాశముంటుందని తెలిపారు. అపరాధ రుసుంతో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మే 2వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. పూర్తి వివరాలకు **www.tsche.ac.in, http://pecet.tsche.ac.in** వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

## రైతు ఆత్మహత్య

**నవతెలంగాణ-రేగొండ**

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కనిపర్తిలో శనివారం రాత్రి జరిగింది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. కనిపర్తికి చెందిన శ్రీపతి కొమురయ్య తన ఎకరంతో పాటు మరో నాలుగెకరాలను కౌలుకు తీసుకొని పత్తి, మిర్చిపంట సాగు చేశాడు. పత్తి, మిర్చిపంటకు తెగుళ్ల సోకి పంట నష్టం వాటిల్లింది. వ్యవసాయం నిమిత్తం తెచ్చిన రూ. 5 లక్షలు ఎలా తీర్చాలని మనస్తాపంచెంది ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతునికి భార్య కమలమ్మ, ముగ్గురు కుమారులున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగపూరి సుధాకర్ తెలిపారు.

# పని బారెడు.. జీతం బెత్తెడు

## స్వచ్ఛ కార్మికులకు కనీసం వేతనం రూ.18వేలు చెల్లించాలి

- జీతాల తగ్గింపు సరి కాదు
- స్వచ్ఛ కార్మికుల రాష్ట్ర సదస్సులో వక్తలు




మాట్లాడుతున్న రమ

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

స్వచ్ఛ కార్మికుల బతుకులు పని బారెడు..జీతం మూరెడు అన్న చందంగా మారాయని సీఐటీయూ రాష్ట్ర సదస్సులో వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. చాలీ చాలని జీతాలతో స్వచ్ఛ కార్మికులు దుర్భర బతుకులు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 7వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు స్వచ్ఛ కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయు కార్యాలయంలో స్వచ్ఛ కార్మికుల సంఘం నాయకులు ప్రకాశ్, జగదీశ్ అధ్యక్ష వర్గంగా స్వచ్ఛ కార్మికుల రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో సీఐటీయూ సీనియర్ నాయకులు రాజారావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమ, రాష్ట్ర కార్యదర్శులు పాలడుగు భాస్కర్, జె వెంకటేశ్, వివిధ జిల్లాల నాయకులు రాజేందర్, లోకేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లోని స్వచ్ఛ కార్మికులను స్వచ్ఛగా ఉంచాల్సిన సర్కారు వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కార్మికులకు జీతాలు పెంచకపోవడమే కాకుండా చెల్లిస్తున్న జీతంలోనే రూ.వెయ్యి తగ్గించడం అన్యాయమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో స్వచ్ఛ కార్మికులకు రూ. 3500 వేతనం చెల్లిస్తే టీఆర్ఎస్ ప్రభుత్వం దానిని రూ.2500కు కుదించి కార్మికుల కడుపు కొట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల పక్షాన కాకుండా పెద్దల పక్షాన ఉన్నాయని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వచ్ఛ కార్మికులకు చెల్లిస్తున్న జీతాల తో నెలకు సరిపడ బియ్యాన్ని కొనుగోలు చేయడం కష్టతరంగా మారిందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు ధర్నాలు చేయాలిసిన అవసరం లేదని, తెల్ల కాగితంపై సమస్యలు రాసిస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తామన్న సీఎం కేసీఆర్, ఉద్యమాలు చేస్తున్నా సమస్యలు పరిష్కరించడం లేదని విమర్శించారు.

ఉద్యోగులు, సామాన్య ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి వీలు లేకుండా ధర్నా చౌక్‌ను కూడా ఎత్తివేయడం శోచనీయమన్నారు. ఒక్క ఎమ్మెల్యే దినసరి వేతనం అంత కూడా స్వచ్ఛ కార్మికులకు నెలసరి జీతాన్ని చెల్లించక పోవడం అన్యాయమన్నారు. కార్మికులు అవినీతిలో వాటా అడగడం లేదని, కష్టానికి తగ్గ ఫలితం మాత్రమే అడుగుతున్నారని తెలిపారు. కార్మికులకు మెరుగైన జీవితాన్ని కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. స్వచ్ఛ కార్మికులకు రూ. 18వేలు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాల పెంపు కోసం కార్మికులంతా ఐక్యంగా ఉండి పోరాటాలు నిర్వహించాలని ఆమె పిలుపునిచ్చారు.

# పాలకుల విధానాలతోనే అసమానతలు

## చట్టాలు పక్కాగా అమలైతే సమానత్వం

- జేవీవీ సదస్సులో కెఆర్ వేణుగోపాల్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

పాలకులు అనుసరిస్తున్న విధానాలతోనే సమాజంలో ఇంకా అసమానతలు కొనసాగుతున్నాయని ప్రధాన మంత్రి మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ కెఆర్ వేణుగోపాల్ చెప్పారు. జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) ఆవిర్భవించి 30 వసంతాల సందర్భంగా ఆదివారం జేవీవీ సామాజిక న్యాయం సబ్‌కమిటీ కన్వీనర్ ఎస్ సర్వేశ్వరరావు అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ కంటితో చూసింది, చెవితో విన్నది నమ్మకూడదని అన్నారు.

ఏ అంశమైనా పరిశీలించి, పరిశోధించి ఓ నిర్ణయానికి రావడమే సైన్స్ అని చెప్పారు. ప్రతి ఒక్కరికీ సైన్స్ ఎంతో ముఖ్యమని అన్నారు. తాను డాక్టర్ అవ్వాలనుకుంటే సామాజిక కారణాల వల్ల మెడికల్ కాలేజీలో సీటు రాలేదని, అందుకే ఐఏఎస్ అయ్యాయని వివరించారు. దేశంలో ఉన్న చట్టాలు పక్కాగా అమలైతే సమానత్వం వస్తుందన్నారు. చట్టాల్లో ప్రజలకున్న హక్కులపై అవగాహన పెంచాలని కోరారు. ధనిక, పేద, కులం, మతం అన్న తేడా లేకుండా అందరికీ అవకాశాలు రావాలని చెప్పారు. రాజ్యాంగంలో ఉన్న హక్కులపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. అందరికీ ఆరోగ్యం ఉండాలని చెప్పారు. ఆహార భద్రత దేశానికి ఎంతో అవసరమని అన్నారు. ఆకలి తీర్చడమే పేదరిక నిర్మూలనకు ప్రధానమని చెప్పారు. పేదలు, అవసరం ఉన్న వారికే ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా సరుకులు ఇవ్వాలని సూచించారు. రాజ్యాంగం మంచిదేనని, అమలు చేసే వారూ మంచివారే అయినపుడు ఆ ఫలాలు అందరికీ అందుతాయని, చెడ్డవారు అమలు చేస్తే రాజ్యాంగం చెడ్డగా కనిపిస్తుందని అంబేద్కర్ ఏనాడో చెప్పారని గుర్తు చేశారు.

ప్రభుత్వ పథకాల్లోనూ హక్కులున్నాయని, వాటిని ప్రజలకు చెప్పాలని సూచించారు. ఆహార భద్రత చట్టంలో భూకంపం, వరదలు, కరువు వచ్చినపుడు ఈ చట్టం వర్తించబోదని ఓ క్లాజు ఉందన్నారు. విపత్తు సంభవించినపుడే ప్రజలకు ఆహారం అవసరముంటుందని, పాలకులు ఇలాంటి తిరకాసు నిబంధనలు పెడుతున్నారని చెప్పారు. ఆహార భద్రత చట్టంలో మార్పు తేవాలని కోరారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ తేజల్ కనిద్కర్ మాట్లాడుతూ నేడు ప్రభుత్వాలు కేటాయిస్తున్న పరిమితి నిధులతో నడుస్తున్న విశ్వవిద్యాలయాల్లో ప్రయోగపూర్వక సైన్స్ బోధన కష్టతరంగా మారిందన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి పరిమితులు ఏర్పడ్డాయని చెప్పారు. శాస్త్రీయ దృక్పథం పెంచాలని రాజ్యాంగంలో పేర్కొన్నా పాలకులు అమలు చేయడం లేదన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని మతాధిపతులు వ్యతిరేకిస్తున్నారని, కానీ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారని చెప్పారు. అంతకుముందు మరో సదస్సుకు జేవీవీ సీనియర్ నాయకులు కోయ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఐఏఎస్ మాజీ అధికారి వీఎం మనోహర్ ప్రసాద్ మాట్లాడుతూ ఆలోచనా దిగ్బంధం నుంచి బయటపడేసి ప్రశ్నించేతత్వాన్ని పెంచేదే హేతువాదమని అన్నారు. ప్రశ్నించేతత్వాన్ని పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పెంచాలని కోరారు. మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలనా సమితి కార్యవర్గ సభ్యురాలు సరితాసెతె మాట్లాడుతూ సత్యాన్వేషకులైన దబోల్కర్, గౌరీలంకేష్, గోవింద్ పన్సారే హత్యలకు సమాధానం చెప్పాల్సింది ప్రభుత్వాలేనని అన్నారు. మూఢవిశ్వాసాలను నిర్మూలించడం ప్రతిఒక్కరి కర్తవ్యమని చెప్పారు. విజ్ఞాన్ ప్రసార్ శాస్త్రవేత్త టివి వెంకటేశ్వరన్ మాట్లాడుతూ డార్విన్ సిద్ధాంతం తప్పని శాస్త్రీయంగా నిరూపిస్తే సమాజం స్వీకరిస్తుంది తప్ప రుజువు చేసిన వారిపైదాడి చేయబోదని అన్నారు.

## ప్రభుత్వ విద్యను పరిరక్షించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు

**నవతెలంగాణ-మహబూబాబాద్**

ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని, కేజీ టు పీజీ వరకూ ఉచిత విద్య అందించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో గర్ల్స్ రాష్ట్ర కన్వీనర్ రజని, టౌన్ సీఐ జబ్బార్‌తో కలిసి జిల్లా స్థాయి టాలెంట్ టెస్టును ప్రారంభించి మాట్లాడారు. మండల, పట్టణ స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజయవంతమైందని అన్నారు. జిల్లా స్థాయిలో 70మందితో టెస్ట్ నిర్వహించినట్టు చెప్పారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. రాబో యే బడ్జెట్‌లో విద్య కోసం కేంద్రంలో 10శాతం, రాష్ట్రంలో 12శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగంలో ప్రిప్రైమరీ స్థాయిలో ఆంగ్లబోధన ప్రారంభించాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు ఎన్. కిరణ్, మాలోతు శాంతికుమార్, ఎమ్‌డి.రజాక్, వీరబాబు, జి అరుణ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ దర్వాజ
హైదరాబాద్ 4
సోమవారం 26-2-2018

# ప్రయోగశీలీ, ప్రతిభాశాలీ




కథారుషులు ఒకరిద్దరిలో ఒకరు – మునిపల్లె రాజుగారు. 1925 మార్చి 16న గుంటూరు జిల్లా గరికపాడులో జన్మించారు. 93 ఏళ్ళ నిండు జీవితాన్ని మొన్న 24వ తేదీన చాలించారు. కథకుల కథకుడుగా పేరు తెచ్చుకున్న పరిణత రచయిత రాజుగారు. వారి 'అత్యుత్తమ కథాకృతులు' సంపుటిలో 16 కథలు ఉన్నాయి. 'పుష్పాలు – ప్రేమికులు – పశువులు' లో 20 కథలు వచ్చాయి. 28 కథలతో 'అస్తిత్వనదం ఆవలితీరాన' సంపుటి వెలువడింది. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య సంధి యుగాన్ని, రెండవ ప్రపంచ యుద్ధ బీభత్సాన్ని, ఆర్థిక మాంద్యాన్నీ, బెంగాలు కరువునీ అనుభవించినవారు ఆయన. జీవితంలోని సంతోష విషాదాల్ని సమస్థితిలో స్వీకరించిన స్థితప్రజ్ఞ వారిది. కథకుడుగా రాజుగారు నూతలపాటి సాహితీ సత్కారం, జ్యేష్ఠ లిటరరీ ట్రస్ట్ పురస్కారం, రావిశాస్త్రి మెమోరియల్ ట్రస్ట్ ప్రప్రథమ పురస్కారం వంటి ప్రతిష్టాత్మక అవార్డులూ, రివార్డులతో పాటు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని కూడా స్వీకరించారు. 1952లో 'వారాల పిల్లవాడు' కథతో రాజుగారి కథారచన మొదలైంది. 'నా కథ కాకపోయినా, చరిత్ర గతిలో నా తరం మానవుడనుభవించిన క్షోభ ఈ కథ' అన్నారు ఆ కథ గురించి రాస్తూ. రాజుగారి పేరుతో పెనవేసుకు పోయిన గొప్ప కథలు కొన్ని ఉన్నాయి. వాటిలో తొలి పంక్తిలో నిలిచేవి 'వీరకుంకుమ'. 1953 ఆంధ్ర పత్రిక ఉగాది సంచికలో వచ్చింది. రాయలసీమని కాటేసిన గంజి కరువు నేపథ్యం. సన్నకారు రైతుల కడగండ్లు, ఆ గడ్డు రోజుల్లో మధ్య తరగతి రైతు ప్రతాపరెడ్డి ఛిత్ర జీవన విషాదం ఈ కథ. కొడుకు ఫీజు కోసం కోడెను అమ్ముకుంటాడు. కానీ నిలువలేడు. 'వద్దు మీ డబ్బు మీరు తీసుకుని కోడెను తిరిగి ఇచ్చేయమంటే వినరు – కసాయివాళ్ళు. పైగా పొడిచేస్తారు. కోడె వాళ్ళని తరిమి తరిమి కొట్టి రక్తం కళ్ళజూస్తుంది. ప్రతాపరెడ్డి శవాన్ని కొమ్ముల మీద ఎత్తుకొని తెచ్చి భార్య అన్నమ్మకిస్తుంది. ఆమె భర్త నెత్తురుతో వీర తిలకం దిద్దుకుని అతనిపై వాలిపోతుంది. ఈ మధ్యన ప్రతాపరెడ్డి కొడుకు చిటిరెడ్డి భావుకుడుగా, చారిత్రక స్ఫూర్తితో మిత్రుడు రాజుతో హంపీయాత్ర చేయడం – సీమ భవిష్యత్తు గురించి శుభాన్ని ఆశించడం వస్తాయి. సమాజపు రొదని ఆలంబనం చేసుకుని, పాత్రల బహిరంతర యుద్ధారావాన్ని కాల్పనిక వాస్తవికతతో కథాగతం చేశారు రాజుగారీ కథలో. వారి మరో కథ – 'బిచ్చగాళ్ళ జెండా'. రేషన్ రోజుల్లో పూనాలో బిచ్చగాళ్ళను తన ఖాళీజాగాలో గుడిసెలు వేసుకోనిచ్చి, వాటికి అద్దె వసూలు చేస్తూ, వారు అడుక్కువచ్చిన బియ్యాన్ని కూడా వారికి దక్కనీకుండా దోపిడీ చేసే సేట్ శంకర్ లాల్ భోగా లాల్ దుర్మార్గం ఈ కథలో చిత్రితమైంది. చివరికి బిచ్చగాళ్ళు ఆ దుర్మార్గులపై తిరగబడి, 'నెత్తురు తడిసిన బట్టను ఓ కర్రకు గట్టి దాన్ని బిచ్చగాళ్ళ జెండాగా నేలపైన పాతిపెడతారు! 'ఇంకానా ఇకపై సాగదు' హెచ్చరికకు రూపకల్పన! 'అరణ్యంలో మానవయంత్రం' కూడా దురాశాపరుడై అధిక ధరలతో ప్రజల్ని పీడించే వ్యాపారికి సర్వమంగళం పాడించిన విప్లవాత్మక కథే! ఆ తర్వాత చాలా కాలానికి 'నెత్తురు కన్నా చిక్కనిది' అనే చిన్న కథని 'కృష్ణా పత్రిక'లో రాశారు. డబ్బు మనిషికి రక్తసంబంధం ఒక లెక్కలోది కాదు, రాదు. ఇదే సామాజికంగా, వ్యక్తిగతంగా కొనసాగుతున్న లోకరీతీ – రివాజూ. ధనికుడు, జగన్నాథం తన తమ్ముడిని చేరదీయ వద్దని భార్యకి ఉపదేశిస్తాడు! 'కథకుని వ్యక్తిత్వపు అభివ్యక్తిని బట్టి అతని కథల విశిష్టత గోచరిస్తుంది' అంటాడు ప్రసిద్ధ హిందీ రచయిత జైనేంద్ర కుమార్. పీడిత జన పక్షపాతిగా – సౌమ్యులు, అమాయకులు సాధుస్వభావులు ఐనవారి శ్రేయోదాయకమైన, స్ఫూర్తివంతమైన కథారచనతో నిరంతర ప్రగతిశీలిగా నిలిచారు రాజుగారు. మనిషి బతుకంతా దు:ఖమయం అన్నట్టు కనిపించే ఇతివృత్తాలు వారికథల్లో కనిపించినా – వాటి ముగింపులు నైరాశ్యరాశికాదు, ఆశా, శ్వాసనూదే ధైర్య ఘటికలు.

కాగా, రాజుగారి చాలా కథలు మనిషి అంతరంగ కల్లోలాన్ని అమితమైన సహానుభూతితో ఆవిష్కరించినవే. 'యశోదకొడుకు', సవతి తమ్ముడు', 'కస్తూరి తాంబూలం' వంటివి పాఠకాదరణని విశేషంగా పొందాయి. 'చెప్పుల దానం' వంటి కథలు మరీ మన మధ్యన, మన పక్కన రోజూ తిరిగే విలక్షణ స్వభావాలు గల మనుషుల విచిత్ర చిత్త వృత్తికి యధార్థ చిత్రణలనిపిస్తాయి. రిటైరు కాకమునుపే అరిగిపోయిన చెప్పుల జతని తీసేసి కొత్తవి కొనుక్కోవాలనుకున్న వెంకట్రామయ్య, రిటైరైనా ఆ కోరికని సాఫల్యం చేసుకోలేకపోయాడు. పాత చెప్పులకి మేకులు కొట్టించుకుని తిరుగుతుంటే, అవి గుచ్చుకుని, ధనుర్వాతం కమ్మి, గాంగ్రీన్ అయి, కాలు నరికేస్తారు. చివరికి చనిపోయాడు. కర్మాంతరాల్లో బాటా కంపెనీ చెప్పులు దానం చేశారు కొడుకులు. భార్యేమో ఏటా తద్దినంలో చెప్పుల దానం ఇప్పిస్తూనే ఉన్నది. ఈ నడుమ ఆయన మనవరాలు 'తాతయ్యకు ఒక కాలేగదా మిగిలింది. మీరు రెండు చెప్పులిస్తున్నారెందుకు?' అని ప్రశ్నించింది! ఇదీ కథ. సున్నిత మనస్కుడైన పఠిత – 'జీవన రహస్యం విషాదాంత వలయం' ఎలా అవుతుందో, ఎందుకవుతుందో తెలుసుకున్న సంస్పందనతో ఉక్కిరిబిక్కిరవుతాడు. అదీ రాజుగారివంటి ఉత్తమ కథకుల నిరాడంబర కథా కథన శక్తి.



**'కాలం మార్మిక గతి. తెగని తంత్రి' అన్నారు రాజుగారు. వీరి ప్రయోగాత్మక కథలన్నీ ఆ వాక్యాన్ని స్ఫురింపచేస్తాయి. మంచికథల్లోని పాత్రలన్నీ ప్రవాహశీలాన్ని ప్రభావశీలాన్ని కూడా ప్రోది చేసుకుని వుంటాయి. వాటి సందేశాలన్నీ హృదయాన్ని తాకేవే! కథకుడుగా రాజుగారు శబ్దం చేస్తున్న సమాహారాల రొద నుండి నిశ్శబ్దం చేస్తున్న మానవీయ సంగీతాన్ని వినగలిగిన కథా కథన శిల్పి. అందుకనే ఆయన తాత్త్వికుడు, సకలుడు!**



తాను రాసిన 'మాజికల్ రియలిజమ్' కథల్ని గురించి చెబుతూ అవి తన 'అదృశ్య పృచ్ఛకుడి ప్రశ్నలకు సమాధానాలుగా వెలువడినవే' అన్నారు రాజుగారు. ఈ సాహిత్య ధోరణి లాటిన్ అమెరికన్ రచయితల సృష్టి అని ప్రాచుర్యం వహించినా, రాజుగారి అభిప్రాయంలో ఈ మాయావాద రసాన్ని అనితర సాధ్యంగా నిర్వహించిన వాడు వ్యాసుడే. అందుకని ఆయనే మాజికల్ రియలిజం సృష్టికర్త అని రాజుగారి విశ్వాసం. 'అస్తిత్వనదం ఆవలితీరాన', 'నైమిశారణ్యంలో సత్రయాగం', 'అదృష్టదేవత', 'మహాబోధి ఛాయలో' వంటి ప్రసిద్ధమైన కథల్ని రాశారు రాజుగారు. భౌతిక దృష్టికి కనబడే వాస్తవం వెనుక గాఢంగా పెనవేసుకుని వున్న – అతిలోక, అలౌకిక వాస్తవాల చిత్రణని ఈ కథల్లో చూస్తాం. అవన్నీ కార్యకారణ సంబంధాలకు అతీతంగా, వివరణల కందని సంభవాలతో కలగలిసి ఉంటాయి. కథ ద్వారా మనకు తెలిసి వున్న దానికీ, మన ఇతర జ్ఞానసంపద మూలంగా ఊహించుకోగలిగిన దానికీ ఆవలి అంచుల్ని స్పృశిస్తుంది – ముగింపు. ఇదీ అద్భుత వాస్తవికత(!). అందుకనే మేజికల్ రియలిజమ్‌ని 'It is a combination of reality and fantasy' అని 'An art of surprises' అనీ కొందరు నిర్వచించారు. ఈ కారణం వల్లనే – ఈ కథలో అనుభూతి రసాస్వాదనకి – విశ్వాసం కేంద్ర బిందువవుతుంది. ఈ సాహిత్య ధోరణికి రూపకల్పనగా వచ్చిన ప్రసిద్ధ రచనే రాజుగారి 'అస్తిత్వనదం ఆవలి తీరాన' అనేది. ఒక ద్రష్ట యోగి, విరాగి, జీవన సమరంలో క్షతగాత్రుడు – కథా నాయకుడు. 'కస్త్వం? కోహం?' (నీ వెవరివి? నేనెవరిని?) అని సమాధానం వెతుక్కుంటూ ప్రస్థానాన్ని సాగిస్తున్నాడు. ఒక మహాస్వప్నం. ఒక మంత్ర నగర ద్వారం. సత్రం. దాని దగ్గర – ఒక మహనీయుడు, ఒక చిదానందమూర్తి మహా నిర్యాణం పొందాడు. ఆ అద్భుత దృశ్యాన్ని చూశాడు. భక్తుల ఆరాధన, ఆర్భాటం అంతా చూస్తూ అచేతనుడై పడిపోయాడు. జ్వరం తీవ్రత, సంధి ప్రేలాపన. మార్వాడీ వర్తకులెవరో అంబులెన్స్‌లో డాక్టర్ దగ్గరికి తీసుకుపోయాడు. డాక్టర్ సచ్చిదానందం ఇతన్ని చూసి సంభ్రమాశ్చర్యాలతో 'రఘూ' అన్నాడు. 'చూడు రఘూ, మన లావణ్య – ఈ ఆస్పత్రిలోనే ఉన్నది. స్పెషల్ వార్డ్ డాక్టర్. అక్కడకు పంపిస్తాను నిన్ను' అన్నాడు. స్ట్రెచర్ మీద లిఫ్ట్‌లో తీసుకువెళ్ళారు. 'చాలా తేలికగా ఉన్నాడీ గడ్డపాయన' అన్నారు లిఫ్ట్ బాయ్స్. డాక్టర్ లావణ్య వచ్చింది. దుప్పటి తొలగించింది. దానికింద ఏ రోగీ లేడు! ఏ రఘూ లేడు! ఇదీ కథ! ఇదెలా సాధ్యం అనే opendended ప్రశ్నతో ముగియటమే ఈ అద్భుత వాస్తవికత లక్షణం! రష్దీ అంటాడు 'అది మూడో ప్రపంచపు ఆత్మభావనని వ్యక్తీకరిస్తుంది' అని! అని ఈ ప్రయోగాత్మక శిల్ప విశేషం!

'కాలం మార్మిక గతి. తెగని తంత్రి' అన్నారు రాజుగారు. ఈ ప్రయోగాత్మక కథలన్నీ ఆ వాక్యాన్ని స్ఫురింపచేస్తాయి. మంచికథల్లోని పాత్రలన్నీ ప్రవాహశీలాన్ని ప్రభావశీలాన్ని కూడా ప్రోది చేసుకుని వుంటాయి. వాటి సందేశాలన్నీ హృదయాన్ని తాకేవే!

రాజుగారు 'తను పుట్టిన మట్టినీ, తన చుట్టూ వున్న మనుషుల్నీ అమితంగా ప్రేమించినవాడు. చిర సనాతనమూ, చిర నూతనమూ అయిన భారతీయ సంస్కృతిని నిత్యమూ ఆరాధించినవాడు. చిక్కని జాతీయతా భావజాలం నుండి అంతర్జాతీయ మానవతా దృక్పథాన్ని అవలోకించినవాడు ప్రతి కథకూ ఒక తాత్వికాకృతిని కల్పించినవాడు' అన్నారు. వారి కథా సంపుటి ప్రచురణ కర్తలు తమ ముందు మాటలో. అక్షర సత్యమైన అభిప్రాయం ఇది.

కథకుడుగా రాజుగారు శబ్దం చేస్తున్న సమాహారాల రొద నుండి నిశ్శబ్దం చేస్తున్న మానవీయ సంగీతాన్ని వినగలిగిన కథా కథన శిల్పి. అందుకనే ఆయన తాత్త్వికుడు, సకలుడు!

**– విహారి, 98488025600**

## పాత సామాను కొంటాం

ఆడంబరాల కులాసాలకి
జీవితకాలం అవసరాలకి
బతుకంతా చాకిరి చేసి
పాతబడ్డ సామాను...

ఇంటెనుక గిరాటేస్తే
ఎండకు ఎండి వానకు తడిసి
దానికి పట్టిన తప్పు
ఘనీభవించిన
దాని అంతులేని దు:ఖం

'పాత సామాను కొంటాం'
పాత సైకిలు మీద
ఎండిపోయిన గొంతు పిలుపు

ఎన్నో ఏళ్లకి
దాయాదులెవరో
వచ్చిన అనుభూతి
ఉలిక్కిపడి లేచిన
పంచన పడి ఉన్న పాతసామాను
ఎలక్షన్లొస్తేనే స్లమ్ ఏరియాలు
చావుబతుకుల పేదవాళ్లు
గుర్తొచ్చినట్లు
"పాత సామాన్లంటూ...."
గొంతులు వినిపిస్తే చాలు
మా వెతల బతుకుల్ని
వెతుకుతాయి

ఉన్నన్నాళ్లూ
ఎంతో ప్రేమలు కురిపించినట్లూ
బేరమాడి, బేరమాడి
అనుకున్నది కుదిరికా
వచ్చిన వాడి చేతిలో
మమ్ము పెట్టేసి
హాయిగా ఊపిరి పీల్చుకుంటాయి.

**– మునిమడుగుల రాజారావు, 94934 30130**

## నేను జీవించే వుంటాను!



చూపులు సంధించిన బాణాన్ని
లక్ష్యాన్ని ఛేధించగల అస్త్రంగా
మలచడం నీ నుంచే నేర్చుకున్నాను!
అవరోధాల ముళ్ళకంచెలను అధిగమించి
గమ్యాన్నీ ఎలా ముద్దాడవచ్చో
నీ అడుగు జాడల పాఠం చెప్పాయి!
చీకటి రంగు అలుముకున్న
బతుకు చిత్రానికి సరికొత్త వర్ణాలతో
స్వాగతం పలకడం ఎలాగో
నీ పలకరింపు నాకు నేర్పింది!
మంచు శిల్పంలా కరిగిపోతున్న నాతో
పిడికెడు మాటలు సుగంధమై
తోడు వస్తావు...! మిత్రమా...
శోకంతో నిశీధిలో కలిసిపోతున్నప్పుడు
నీ కన్నుల దీపాలను వెలిగించి
దారి చూపుతావు! ప్రేమగా...
నా అస్తిత్వమే శాశ్వత చిరునామాగ
స్థిరనివాసం చేసుకున్న
కవిత్వమా... కన్నీటి సంతకమా...
నువ్వు నా తోడున్నంత కాలం
నేను జీవించే వుంటాను...!

**– పొద్దుటూరి మాధవీలత, 9030573354**

## సాహిత్యవార్తలు

### కొలకలూరి సాహితీ పురస్కార ప్రదాన సభ

ఈ రోజు సాయంత్రం 6 గంటలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని యన్.టి.ఆర్. కళా ప్రాంగణంలో కొలకలూరి సాహితీ పురస్కార ప్రదాన సభ జరుగుతుంది. కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం అంకం లింగమూర్తి, జీడిగుంట రామచంద్రమూర్తికి, కొలకలూరి భాగీరథి కవితా పురస్కారం ఈతకోట సుబ్బారావు, అడిగోపుల వెంకటరత్నంకి ప్రదానం చేస్తారు. కొణిజేటి రోశయ్య, ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు, ఆచార్య కొలకలూరి సుమకిరణ్, ఆచార్య కొలకలూరి మధుజ్యోతి పాల్గొంటారు.

### 4న 'చెల్లె లేనోడు' కథ ఆవిష్కరణ-చర్చ

స్కైబాబ కథ 'చెల్లె లేనోడు' ఆవిష్కరణ– చర్చ మార్చి 4న సాయంత్రం 5.30కు బాగ్‌లింగంపల్లి సుందరయ్య భవన్‌లో జరుగుతుంది. శిలాలోలిత, కనీజ్ ఫాతిమా, మానస ఎండ్లూరి, కృష్ణవేణి సొన్నాయిల, స్వేచ్ఛ, షకీనా దూదేకుల పాల్గొంటారు.

**– 'హర్యాలీ' ముస్లిం రచయితల వేదిక**

### 'నది కాలం అతడు' ఆవిష్కరణ

రవూఫ్ కవితా సంపుటి 'నది కాలం అతడు' ఆవిష్కరణ సభ మార్చి 4వ తేదీ ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె శివారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షత వహిస్తారు. వాడ్రేవు చినవీరభద్రుడు, గుంటూరు లక్ష్మీనరసయ్య, శిఖామణి, శిలాలోలిత, కవి యాకూబ్ ప్రసంగిస్తారు.

### సాహిత్య గ్రంథాల పరిచయ కార్యక్రమం

తెలంగాణ సాహిత్య అకాడమి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురించిన సాహిత్య గ్రంథాల పరిచయ కార్యక్రమం 28 వ తేదీన 'రవీంద్ర భారతి మినీ కాన్ఫరెన్స్ హాల్'లో జరుగుతుంది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరిగే సభకు డా॥ నందిని సిధారెడ్డి గారు అధ్యక్షత వహిస్తారు. శ్రీ బుర్రా వెంకటేశం గారు ముఖ్య అతిథి. డా॥ జి.అంజయ్య, గురిజాల రామశేషయ్య, కె.పి.అశోక్ కుమార్, బుజంగరెడ్డి, ఆచార్య వెలుదండ నిత్యానందరావు, చంద్రబోసు, కె.వి. రమణాచారి, హరగోపాల్, మల్లెగోడ గంగాప్రసాద్, వఝల శివ కుమార్, సగిలి సుధారాణి, డా॥ బాల శ్రీనివాస మూర్తి, డా॥ పగడాల నాగేందర్, భాస్కర్ యోగి పాల్గొంటారు.

**డా॥ ఏనుగు నరసింహా రెడ్డి, కార్యదర్శి , తెలంగాణ సాహిత్య అకాడమి**

### బీసీ కవిత్వ సంకలనానికి కవితలు

మహాత్మాజ్యోతిబాపూలే ఆలోచనలు విస్తరించుకుంటూ దేశవ్యాపితంగా బీసీ చైతన్యం పదునెక్కుతుంది. ఈ నేపథ్యంలో గతం నుంచి భవిష్యత్తుకు తెలుగు సమాజంలోని బీసీలు ఐక్యతతో అడుగులు వేయవలసి ఉంది. బీసీ తాత్త్విక చింతనతో ఎవరి కులమూలల నుంచి వాళ్లు రాసుకోవలసి ఉంది. తమ కులవృత్తుల, సంస్కృతుల, చరిత్ర, సామాజిక అంశాల నేపథ్యంతో బీసీ కవుల నుంచి కవిత్వాన్నీ ఆహ్వానిస్తున్నాం. బృహత్తర బీసీ సంకలనం తీసుకురావాలన్న తలంపుతో ఈ పనికి పూనుకోవటం జరిగింది. మార్చి 25వ తేదీలోపుగా మీ కవితలను పంపించవలసిందిగా కోరుతున్నాం.

జూలూరు గౌరీశంకర్, ఎం.ఎస్.కె.టవర్స్, ప్లాటినెంబర్–410, స్ట్రీట్ నెంబర్–11, హిమాయత్ నగర్ – 500 026, చిరునామాకు కవితలు పంపగలరు.

**– జూలూరు గౌరీశంకర్**

# తెలుగు మరాఠీ భాషల వారధి

గత కొన్ని దశాబ్దాలుగా మహారాష్ట్రలో తెలుగు వెలుగుల్ని వెదజల్లిన సాహితీ శిఖరం నేలకు ఒరిగింది. ప్రముఖ కవి, రచయిత, అనువాదకుడు, చిత్రకారుడు, నాటకకర్త డా॥బొల్లి లక్ష్మినారాయణ 23 ఫిబ్రవరి 2018 నాడు చివరి శ్వాస తీసుకున్నారు.

'రాస్తూ రాస్తూనే మృత్యువు ఒడిలోకి చేరుకుంటాను..' అని చెప్పుకునే డా॥బొల్లి లక్ష్మినారాయణ తన మాటను నిలబెట్టుకున్నారు. శుక్రవారం ఉదయం 'దక్షిణ భారతంలో రామాయణం' అనే కావ్యాన్ని రాస్తూ రాస్తూనే ఆయన మృత్యువు ఒడిలోకి చేరుకున్నారు.

'జననమెంతో అందమైనది. మరణం కూడా అందమైనదే... జనన మరణాల మధ్య జీవితం కూడా ఎంతో అందమైనది..' లాంటి ఎన్నో కవితలతో ఆయన మరాఠీ పాఠకుల మన్ననలు పొందారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి.

డా॥బొల్లి లక్ష్మినారాయణ పుట్టింది షోలాపూర్‌లోనే ఐనా ఆయన పూర్వీకులు ప్రస్తుత సిద్ధిపేట జిల్లా, బెజ్జంకి మండలం, గుండారం గ్రామానికి చెందినవారు. పొట్ట చేత బట్టుకొని షోలాపూర్ వెళ్ళిన మొదటి తరానికి చెందిన కుటుంబం అది. 1944 ఏప్రిల్ 15 నాడు జన్మించిన లక్ష్మినారాయణ చదివింది పదవ తరగతి వరకే. అది కూడా మరాఠీ మాధ్యమంలో.. కానీ తెలుగు భాషపై పెంచుకున్న అభిమానంతో తెలుగు నేర్చుకున్నారు. తెలుగు సాహిత్యాన్ని విరివిగా చదివారు.

లక్ష్మినారాయణ కుటుంబ సభ్యులంతా చేనేత మగ్గాలు నడిపేవారు. ఇంట్లో ఉదయం లేచినప్పట్నుండి కుటుంబంలోని ప్రతి ఒక్కరు పని చేసేవారు. లక్ష్మినారాయణ మాత్రం కలం చేతపట్టి కవితలు రాసేందుకు ప్రయత్నించేవాడు. గడుస్తున్న కాలంతో పాటు లక్ష్మినారాయణలో సాహితీ పిపాస పరాకాష్టకు చేరుకుంది.

సాహిత్యమే తన జీవిత లక్ష్యంగా మలుచుకున్న ఆయన తన మొదటి కావ్యసంగ్రహం 'మైఫల్' తోనే మరాఠీ పాఠకులకు అభిమాన కవిగా మారిపోయాడు. అంతేగాక, మరాఠీలో గొప్ప సాహితీవేత్తలుగా పేరుపొందిన పి.ఎల్.దేశపాండే, బి.బి.బోర్కర్‌లాంటి వారు కూడా లక్ష్మినారాయణ కవిత్వాన్ని ఎంతగానో అభినందించారు.

మరాఠీ తెలుగు భాషల సాహితీవేత్తల మధ్య ఉన్న సారూప్యతలపై తులనాత్మకత దృష్టితో ఆయన ఎన్నో పరిశోధనలు చేశారు. భక్త తుకారాం, సంత్ జ్ఞానేశ్వర్, వేమన లాంటి వాగ్గేయకారుల సాహిత్యంలో ఉన్న సారూప్యతలను ఆయన తన పరిశోధనల్లో ఆసక్తికరంగా వెల్లడించారు. ఆయన వెలువరించిన 'తెలుగు పూలాంచే మరాఠీ సుగంధ్' అనే తులనాత్మక గ్రంథం ఎంతో ఆదరణ పొంది, తెలుగు మరాఠీ భాషల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింతగా పెంచేందుకు దోహదపడింది. తాను రాసిన తన ఆత్మకథాశ్రిత గ్రంథం 'ఏక్ శాల్యానే..' విడుదలైన నెల రోజులకే రెండవ ముద్రణ పొందడం విశేషం. ఆ పుస్తకం చదివిన ప్రముఖ రాజకీయ నాయకుడు సుశీల్‌కుమార్ షిందే స్వయంగా లక్ష్మినారాయణ ఇంటికి వెళ్ళి అభినందించడం మరోవిశేషం.

మరాఠీ సాహిత్యంలో డా॥బొల్లి లక్ష్మినారాయణ అగ్రశ్రేణి రచయితగా పేరుపొందారు. ఆయన సాహిత్యాన్ని మరాఠీ విద్యార్థులకు పాఠ్యాంశాలుగా బోధిస్తున్నారు. పదవ తరగతి వరకు మాత్రమే చదువుకున్న లక్ష్మినారాయణ రచనలు ఎమ్మే విద్యార్థులకు బోధనాంశాలుగా ఉన్నాయంటే ఆయన రచనల మేలిమి ఏమిటో గ్రహించవచ్చు.



**'రాస్తూ రాస్తూనే మృత్యువు ఒడిలోకి చేరుకుంటాను..' అని చెప్పుకునే డా॥బొల్లి లక్ష్మినారాయణ తన మాటను నిలబెట్టుకున్నారు. శుక్రవారం ఉదయం 'దక్షిణ భారతంలో రామాయణం' అనే కావ్యాన్ని రాస్తూ రాస్తూనే ఆయన మృత్యువు ఒడిలోకి చేరుకున్నారు.**

డా॥బొల్లి లక్ష్మీనారాయణ ఇప్పటి వరకు 28 గ్రంథాలు వెలువరించారు. మైఫల్, ఝుంబర్, సావ్‌లీ, విరహిణి వాసవదత్త, గవాక్ష్, తెలుగు పూలాంచే మరాఠీ సుగంధ్, లక్ష్మినారాయణ బొల్లిచ్యా కవిత, ఏక్ శాల్యానే, గవ్‌తాచే ఫూల్, గీత్ మార్కండేయ, కవిరాయ రామ్‌జోషి, దక్షిణ్ భాషేతీల్ రామాయణే, కృష్ణదేవరాయ, కవితేచా ఆత్మస్వర్ దత్తా హల్‌సగీకర్ లాంటి స్వంత రచనలతో పాటు, అభంగ్ కలశ్, పంచపది (సినారె పంచపదులు) రాత్ ఏకా హొడిత్‌లీ, ఏకా పండితాచ్యే మృత్యుపత్ర్, సంత్‌కవి వేమన, యకృత్, కమలపత్ర్, రాజర్షి షాహూ ఛత్రపతి, రాత్రీచా సూర్య్ (ప్రముఖ కవి జగదీశ్ కేరె రాత్రి సూర్యుడు) స్వర్ లయ లాంటి అనువాద గ్రంథాలను కూడా వెలువరించారు.

అంతేగాక, షిరిడి సాయిబాబా అనుభవ రహస్య, షిరిడి సాయిబాబా సేవా రహస్య, శ్రీ అమ్మ భగవాన్ లాంటి ఆధ్యాత్మిక అనువాదాలు కూడా చేశారు. శ్రీ సాయి చరిత్ర పోథీ పేరుతో సొంతంగా భక్తికావ్యాన్ని రచించారు. శ్రీపాద వల్లభ అనే అనువాద కావ్యం, కవిరత్న కాళిదాస్ అనే చరిత్రాత్మక నవల ముద్రణ కోసం వేచి ఉన్నాయి.

కేంద్ర సాహిత్య అకాడెమీ వారి కోరిక మేరకు శ్యాం మనోహర్ రచించిన ప్రఖ్యాత నాటకం 'యకృత్' ను అదే పేరుతో తెలుగులోకి అనువదించారు. ఇది ఆయన రాసిన ఏకైక తెలుగు పుస్తకం.

మరాఠీలో తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూనే తెలుగు భాషాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. మహారాష్ట్రలో తెలుగు పాఠ్యపుస్తకాల ముద్రణ కోసం ఉద్యమించి విజయం సాధించారు. అందుకోసం ఆయన 'బాలభారతి తెలుగు పాఠ్యపుస్తక సమితి' ని స్థాపించి దానికి అధ్యక్షుడిగా కొనసాగారు. 'తెలుగు భాషా రక్షణ సమితి'ని కూడా స్థాపించి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. జల్‌గావ్‌లో జరిగిన సూర్యోదయ్ మరాఠీ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షుడిగా వ్యవహరించారు. అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళనాల్లో ఆయన జ్యేష్ట కవిగా పాలుపంచుకున్నారు.

లక్ష్మినారాయణ రచనలపై పుణే విద్యాపీఠం, ముంబై సాహిత్య అకాడెమీ, గోవా విద్యాపీఠం, కాకతీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ యూనివర్శిటీ లాంటి పలు విద్యాలయాల్లో ఎన్నో పరిశోధనలు జరిగాయి. మహారాష్ట్రలో సాహితీవేత్తలకు అందించే పురస్కారాలన్నీ లక్ష్మినారాయణకు లభించాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చి సన్మానించారు.

లక్ష్మినారాయణ చాల సంవత్సరాల నుండి మధుమేహంతో బాధపడుతున్నారు. ఇటీవలే హస్పిటల్‌లో సుదీర్ఘ చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చారు. తన మరణానికి నాలుగు రోజుల ముందు ఆయన స్థానిక ఎమ్మెల్యే ప్రణతి షిందే నిర్వహించిన ఒక తెలుగు సమావేశంలో అతిథిగా పాల్గొన్నారు. తెలుగు వారికోసం షోలాపూర్‌లో ఒక సాంస్కృతిక భవనం నిర్మించాలనీ ఆయన ఎమ్మెల్యేను కోరడం అందుకు ఆమె సానుకూలంగా స్పందించడం ఒక మరిచిపోలేని యాదిలా మిగిలిపోయాయి. మనుషుల్లో దైవత్వాన్ని సందర్శించాలనుకునే డా॥బొల్లి లక్ష్మినారాయణ తన తెలుగు కవితలో తన గురించి ఇలా చెప్పుకుంటారు..

*"ప్రతి క్షేత్రంలో కల్ప వృక్షం నాటే*
*తెలుగు తల్లి తనయుడ నేను...*
*మరాఠీ మకరంద బాణీతోనే*
*భువికి దిగివచ్చిన రవిని నేను...*
*భూత వర్తమాన భవిష్యత్తులో*
*కావ్యలక్ష్మి పెదవిపై నవ్వుని నేను...*
*ఇంపైన సొంపైన షోలాపూర్‌లో*
*వీరమ్మ, లచ్చన్న గన్న గువ్వల చెన్నను నేను*
*లచ్చన్న కవిని నేను.."*

తెలుగు మరాఠీ భాషల మధ్య ఒక బలమైన వారధిగా నిలిచిన డా॥బొల్లి లక్ష్మినారాయణ మరణం రెండు భాషల సాహిత్యానికి తీరని లోటు. ముఖ్యంగా తెలుగు వారు గర్వంగా చెప్పుకునే లచ్చన్న కనుమరగు కావడం అతి పెద్ద లోటు. అది ఎప్పటికీ తీరనిది. ఆయన స్మృతికి నివాళి.

**– సంగెవేని రవీంద్ర, 099871 45310**


ఫొటో: పిప్పళ్ల వెంకటేశ్

**ఒక్క క్షణం.. ఒకే ఒక్క క్షణం... చావుకూ బతుక్కూ మధ్య ఒకే ఒక్క క్షణం. కష్టాల కడలి ముంచేస్తుంటే... ఒడ్డుకు చేర్చే తెడ్డు దొరక్క ఎందరో ఒంటరి మహిళలు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఆ ఒక్క క్షణం 'మీకు మేమున్నాం' అంటూ భరోసా ఇస్తే చాలూ.. ఇక భవిష్యత్ అంతా వారిదే. అలాంటి మహిళలకు కొత్త జీవితాన్ని అందిస్తుంది ఓ ఇల్లు. కష్టాల్లో ఉన్న ప్రతి ఆడపిల్లలకు ఆ ఇంటి గుమ్మం 24 గంటలూ ఆహ్వానం పలుకుతూనే ఉంటుంది. అదే సయోధ్య .**

# ఒంటరి మహిళకు కొండంత అండ...

సరిత... ఇంట్లో పెద్దలు సంబంధం చూసి పెండ్లి చేశారు. నెలన్నర పాటు అత్తారింట్లో ఉంది. సొంత అన్న భార్యతోనే భర్త సంబంధం పెట్టుకున్నాడు. ప్రశ్నించిన భార్యను కొట్టేవాడు. పుట్టెడు దు:ఖంతో పుట్టింటికి చేరింది. వెళ్ళిన వారం రోజులకు గర్భవతి అని తెలిసింది. బిడ్డ పుట్టిన తర్వాతైనా భర్త మారతాడనుకుని సంతోష పడింది. కానీ అతనిలో ఎలాంటి మార్పులేదు. దాంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్ళింది. కౌన్సెలింగ్ ఇచ్చి వేరు కాపురం పెట్టించారు. అయినా అతనిలో మార్పు లేదు. పైగా హింస పెరిగింది. ఒక్క వదినతోనే కాదు ఇతర ఆడపిల్లలతో కూడా అతనికి సంబంధాలున్నాయని తెలిసింది. దాంతో ఎనిమిది నెలల గర్భవతిగా మళ్ళీ పుట్టింటికి వెళ్ళింది. పాప పుట్టింది. తర్వాత కూడా పుట్టింట్లోనే ఉండిపోయింది. కొన్ని రోజులకు అక్కడ కూడా ఆమెకు ఆదరణ కరువైంది. తల్లీ, అక్క సరిత భర్త నుంచి డబ్బులు తీసుకుని విడికాగితాలు ఇప్పించే ప్రయత్నం చేశారు. కానీ సరిత ఒప్పుకోలేదు. దాంతో పుట్టింట్లో కూడా ఉండనీయలేదు. పొత్తిళ్ళలో ఐదు నెలల పాప. ఎటు పోవాలో, ఏం చేయాలో దిక్కు తోచలేదు. అలాంటి పరిస్థితుల్లోనే సయోధ్య సరితకు అండగా నిలిచింది. ఇప్పుడు సయోధ్య సభ్యులు అన్ని విధాలుగా ఆమెకు అండగా నిలుస్తున్నారు.

✲✲✲✲✲

### ప్రేమించిన వాడు మోసం చేస్తే

కమలది మరో విషాదగాథ. ఓ వ్యక్తిని ప్రేమించింది. ఇంట్లో ఒప్పుకోలేదు. పారిపోయి పెండ్లి చేసుకున్నారు. కన్నవారిని కాదనుకొని వచ్చిన తనకు భర్తే సర్వస్వం అనుకుంది. కానీ పెండ్లి తర్వాత అతని నిజస్వరూపం బయటపడింది. డబ్బు తీసుకురమ్మని చిత్రహింసలు పెట్టేవాడు. అన్నీ భరిస్తూ ఓ మగబిడ్డకు జన్మనిచ్చింది. చివరకు ఇంట్లో నుంచి గెంటేశాడు. ఇటు ప్రేమించిన వాడు వంచించాడు, అటు కన్న వాళ్ళు రానీయలేదు. ఐదేండ్ల కొడుకుతో ఎటు పోవాలో తెలియక సయోధ్యకు చేరింది. కేసు పెట్టి న్యాయం కోసం పోరాడుతున్నది.

✲✲✲✲✲

### అత్తింటి ఆదరణ లేక...

కుమారి కష్టం వింటే కటిక రాయి సైతం కన్నీరు పెడుతుంది. పెండ్లయిన మూడు నెలలకే ఏవో కుటుంబ సమస్యల వల్ల భర్త విషం తాగి చనిపోయాడు. కండ్ల ముందే ప్రాణం వదిలిన భర్తను చూసి ఆమె స్పృహ కోల్పోయింది. ఆస్పత్రికి తీసుకెళితే గర్భవతని తెలిసింది. బతుకుపై విరక్తితో కుమారి కూడా విషం తాగింది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళితే పెద్ద ప్రాణమైతే దక్కింది. విష ప్రభావంతో అబార్షన్ అయింది. దాంతో ఆమె మతి చలించింది. అత్తింటి వాళ్ళు ఆదరించలేదు. పుట్టింటి వాళ్ళు చికిత్స చేయించారు. అయినా తనకు జరిగిన దారుణం నుంచి బయటపడలేకపోయింది. దాంతో సయోధ్యకు చేరింది. హోమ్‌కు వచ్చిన కొత్తలో తోటి వారు కుమారితో మాట్లాడాలన్నా భయపడేవారు. మనుషులను చూస్తే తీవ్రంగా స్పందించేది. అలా మూడేండ్లు గడిచింది. ప్రస్తుతం కుమారి హోమ్‌కు దగ్గరలోనే ఓ గది అద్దెకు తీసుకుని అందులో ఉంటూ చదువుకుంటుంది. మిగిలిన సమయమంతా హోమ్‌కు కేటాయిస్తుంది. త్వరలోనే లాబ్ టెక్నీషియన్ పూర్తి చేసి ఉద్యోగంలో చేరబోతున్న ఆమెను ఇప్పుడు మనం కదిలిస్తే...

"మా అమ్మ నాకు జన్మనిస్తే ఈ హోమ్ పునర్జన్మనిచ్చింది. గతంలో మా అమ్మానాన్న హోంకి వచ్చి ప్రతి రోజూ ఏడ్చుకుంటూ వెళ్లేవారు. నా పరిస్థితి చూసి తట్టుకోలేకపోయేవారు. కానీ ఇప్పుడు నేను ఒంటరిగా గది అద్దెకు తీసుకున్నా ధైర్యంగా ఉంటున్నారు. ఇదంతా సయోధ్య సభ్యులు నాకు ఇచ్చిన ధైర్యం వల్లనే. ప్రస్తుతం నా భర్త తరపు రావాల్సిన ఆస్తికోసం పోరాటం చేస్తున్నాను. త్వరలోనే ఉద్యోగం సంపాదించి నా తల్లిదండ్రుల్ని మంచిగా చూసుకుంటాను" అంటూ గర్వంగా చెబుతోంది.




✲✲✲✲✲

### పుట్టింట్లోనే రక్షణ కరువై

షహనాజ్‌ది మరో దీన గాథ. తండ్రి ఉపాధి కోసం సౌదీ వెళ్ళాడు. ఇక్కడ తల్లి ఓ వ్యక్తితో సంబంధం పెట్టుకుంది. ఇప్పుడు ఆ వ్యక్తి షహనాజ్‌పై కన్ను వేశాడు. తల్లి కూడా అతడికే సపోర్ట్ చేస్తున్నది. ఎంతో కాలం తర్వాత ఇంటికి వచ్చిన తండ్రికి విషయం చెప్పినా పెద్దగా పట్టించుకోలేదు. అతని బారి నుంచి ఎలా తప్పించుకోవాలో తెలియక భరోసా సెంటర్‌లో కేసు పెట్టింది. వాళ్ళు ఆమెను సయోధ్యకు పంపించారు. ప్రస్తుతం ఆమె హోంలోనే ఉండి డిగ్రీ చదువుతోంది.

ఇలా ఎందరికో అండగా నిలబడుతోంది సయోధ్య. కష్టాల్లో ఉన్న ఒంటరి మహిళలకు, అత్తింట్లో ఆదరణ కరువైనవారికి, కన్నవారి వద్ద రక్షణ లేని అమ్మాయిలకు ఈ హోం కొండత అండ. ఇక్కడికి ఎలాంటి సమస్యతోనైనా రావొచ్చు. ఎప్పుడైనా రావొచ్చు. సమస్యను పరిష్కరించుకోవచ్చు. కొత్త జీవితాన్ని ప్రారంభించవచ్చు. ఇతర పనులతో నగరానికి వచ్చి ఎక్కడ ఉండాలో తెలియక ఇబ్బంది పడే ఒంటరి అమ్మాయిలు కూడా కొన్ని రోజులు ఇక్కడ ఆశ్రయం పొందవచ్చు.

### హోం పెట్టనీయలేదు

2010లో ప్రారంభమైన ఈ హోం మొదట మెహదీపట్నంలో ఉండేది. అయితే ఎప్పుడు పడితే అప్పుడు మహిళలు రావడం, నిత్యం పోలీసులు వస్తూ పోతూ ఉండటంతో స్థానికులు అభ్యంతరం చెప్పారు. దాంతో షల్టర్ కోసం జీహెచ్ఎంసీ వారిని కలిశారు. వారు అంబర్‌పేటలో ఖాళీగా ఉన్న కమ్యూనిటీ హాల్ కేటాయించారు. అక్కడ చూస్తే పరిస్థితులు హోంకు అనుకూలంగా లేవు. 'బిల్డింగ్ పాడుబడినా పర్లేదు, ఇలాంటి హోంను మా ఏరియాలోకి రానీయం' అన్నారు స్థానికులు. దాంతో ముందు ఈ హోం ఎవరి కోసం, ఎలాంటి వారి కోసమో అక్కడి వారికి అవగాహన కల్పించాలనుకున్నారు సయోధ్య సభ్యులు. స్థానిక పెద్దలను, రాజకీయ నాయకులను కలిసి కొన్ని సమావేశాలు ఏర్పాటు చేశారు. యువత, మహిళలతో గ్రూపు సమావేశాలు పెట్టి అవగాహన కల్పించారు. చివరకు స్థానికులను ఒప్పించారు. అప్పుడు వద్దన్న వారే ఇప్పుడు ఆ చుట్టుపక్కల ఏ ఫంక్షన్ జరిగినా హోంలో ఉన్న వారందరినీ భోజనాలకు పిలుస్తారు. ఏ సమస్య వచ్చినా ఆదుకుంటున్నారు.

### ఎందుకు వచ్చారని అడగరు

కొంత మంది గవర్నమెంట్ హోంలు ఉన్నాయి కదా, ఇక ఇదెందుకు అనేవారు. అన్నారు. అయితే అక్కడకు మహిళలు వెళ్ళాలంటే సమయం ఉంటుంది. అలాగే పోలీస్‌స్టేషన్ నుండే వెళ్ళాలి. ఏదో ఒక ఐడెంటిటీ కచ్చితంగా చూపించాలి. కానీ సమస్యలతో అప్పటికప్పుడు ఇంటి నుంచి వచ్చే వారికి ఇదంతా సాధ్యం కాదు. అలాంటి మహిళలకు అండగా నిలబడాలనే ఈ హోంను ప్రారంభించారు. ఇక్కడకు వెళ్ళిన వారిని ఎందుకు వచ్చారని కూడా అడగరు. ముందు వారి ప్రాథమిక అవసరాలు తీరుస్తారు. నిదానంగా వారి సమస్యను తెలుసుకుంటారు. అప్పుడు వాళ్ళకు ఎలాంటి సహకారం కావాలో చేస్తారు.

సలీమ

### కొత్త జీవితం ఇచ్చినప్పడే



ఒక కేర్‌టేకర్‌ను పెట్టి హోం నడిపేయవచ్చు అనుకుంటారు అధికారులు. కానీ ఇది కరెక్టు కాదు. ఇక్కడి వచ్చే మహిళలు ఎన్నో రకాల సమస్యలతో వస్తారు. రోజుల తరబడి కుటుంబంలో జరుగుతున్న హింసను భరించలేక అడుగు బయటకు వేస్తారు. అలాంటి వారు మానసికంగా నలిగిపోయి ఉంటారు. జీవితం పట్ల విరక్తితో వస్తారు. అలాంటి వారికి లీగల్‌గా, మెడికల్‌గా కౌన్సెలింగ్ అవసరం. వాళ్ళు మళ్ళీ కొత్త జీవితాన్ని ప్రారంభించే స్థాయికి తీసుకురావాలి. అలాంటి సదుపాయాలు హోమ్స్‌లో ఉండాలి. అందుకే మాలాంటి హోమ్స్‌కు రెగ్యులర్ సైకాలజిస్టులు, థెరపిస్టులను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. మేము స్వచ్ఛందంగా కొంత వరకు ప్రయత్నిస్తున్నాం. కానీ ప్రభుత్వం దీని గురించి ఆలోచించాలి. అలాగే ప్రభుత్వం తరపున ఇచ్చే వృత్తి శిక్షణను హోంకు లింక్ చేయాలి. అప్పుడు మహిళలు బయటకు వెళ్ళిన తర్వాత ఏదో ఒక పని చేసుకుని బతుకుతారు. మేము కొన్ని ఎన్‌జీవోలతో కలిసి ఇలాంటి ప్రయత్నం చేస్తున్నాం. కొంత మంది ఉద్యోగాలు కూడా చేసుకుంటున్నారు. ఎవరు ఎన్ని చేసినా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటేనే కష్టాల్లో ఉన్న మహిళలకు న్యాయం జరిగేది.

**- మృదుల,**
**సయోధ్య జనరల్ సెక్రటరీ**

### చిన్న ఓదార్పుతో...



గతంలో మేం చిల్డ్రన్ సమస్యలపై పని చేసేవాళ్ళం. అలా చేస్తున్నపుడే సమస్యల్లో ఉన్న ఒంటరి మహిళలు ఎదురయ్యారు. గృహహింసను ఎదుర్కొంటూ ఆత్మహత్యలు చేసుకున్న కేసులు కనిపించాయి. ఇలాంటి మహిళలకు ఏమైనా చేయాలనిపించింది. చిన్న ఓదార్పు, ధైర్యం వాళ్ళకు జీవితంతో పోరాడే శక్తిని ఇస్తుంది. అలాంటి ఆలోచనల నుండి పుట్టిందే సయోధ్య. హోం ప్రారంభించిన తర్వాత స్థానికులతోనే కౌన్సెలింగ్ సెంటర్లు ప్రారంభించాం. అంబర్ పేట ఏరియాలో ఉత్సాహవంతమైన మహిళలను గుర్తించి మహిళల కోసం ఉన్న అన్ని రకాల చట్టాలపై ట్రైనింగ్ ఇచ్చి గుర్తింపు కార్డులు కూడా అందించాం. అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ నుండి కూడా హోంకు రక్షణ ఇస్తున్నారు. ఈ హోం అందరికీ అందుబాటులో ఉండాలని టోల్‌ఫ్రీ నెంబర్ కూడా ప్రారంభించాం.

**- పులిపాటి జ్యోతి,**
**సయోధ్య జాయింట్ సెక్రటరీ**

సంప్రదించవలసిన
నెం.040-23524144

---



## ఉప్పు ఎక్కువైతే!

- దోశ, పకోడీ, సమోసా లాంటివి చేసేటప్పుడు కొద్దిగా పాలు పోసి పిండి కలపాలి. ఆ తర్వాత చిటికెడు ఉప్పు కలిపి నూనెలో వేయించుకుంటే కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.
- నెయ్యి త్వరగా పేరుకుపోకుండా ఉండాలంటే మీగడ కట్టేటప్పుడు కొద్దిగా నీళ్ళ చల్లాలి.
- కరివేపాకు ఆకులు సీసాలో వేసి గట్టిగా మూత పెట్టి ఫ్రిడ్జ్‌లో ఉంచితే పాడవకుండా ఉంటాయి.
- బియ్యం పురుగులు పట్టకుండా ఉండాలంటే కరివేపాకు ఆకులు బియ్యంలో వేస్తే సరిపోతుంది.
- వేపుడు కూరలు దించే ముందు కొంచెం శనగ పిండి పైన చల్లి దించితే కూర రుచికరంగా ఉంటుంది.
- ఆలుగడ్డ దుంపలు ఉడికేటప్పుడు ఆ నీళ్లల్లో కొంచెం నూనె పోస్తే పాత్ర జిడ్డు పట్టకుండా ఉంటుంది.
- కూరగాయ ముక్కలని పసుపు కలిపినా నీళ్లల్లో ఉంచితే క్రిములు, దుమ్ము ఉంటే నీటి పైకి తేలుతాయి.
- పాలు మరిగేటప్పుడు కొద్దిగా తేనె వేస్తే పాలు విరగకుండా ఉంటాయి. దాంతో పాటు చిటికెడు తినే సోడా వేస్తే సరిపోతుంది.
- కూరలో ఉప్పు ఎక్కువైతే కొన్ని ఆలుగడ్డ ముక్కలను వేయండి లేదా కొబ్బరి తురుము, నువ్వుల పొడి, కొన్ని కాయగూర ముక్కలు వేసుకుంటే సరిపోతుంది.
- కూరలు రుచిగా ఉండాలంటే దించే ముందు కొత్తిమీర తురుము, ధనియాల పొడి చల్లి దించితే కూర రుచిగా ఉంటుంది.

❄

## నువ్వుల నూనెతో అందంగా...



పోషకాహార లోపం వల్ల, కాలుష్యం వల్ల చర్మం త్వరగా పాడవుతుంది. దాంతో పాటు ఎక్కువ సమయం ఎండలో ఉన్న... వేడి నీటితో స్నానం చేసిన సరే చర్మం నిర్జీవంగా తయారవుతుంది. అలా కాకుండా చర్మాన్ని రక్షించుకోవాలంటే కింది చిట్కాలను పాటిస్తే సరిపోతుంది.

- నువ్వుల నూనెలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. చర్మం దురదగా ఉంటే నువ్వుల నూనెలో కొద్దిగా ఆలివ్ నూనె కలుపుకొని చర్మానికి రాసుకుంటే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల చర్మం మృదువుగా, అందంగా తయారవుతుంది.
- చర్మం బాగా పొడి బారితే నువ్వుల నూనెను రాసుకోవాలి. ఈ నూనె చర్మాన్ని తాజాగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మ సమస్యలను కూడా దూరం చేస్తుంది.
- ఇది సహజ సిద్ధమైన ఔషధగుణాలను కలిగి ఉంటుంది. మంచి మాయిశ్చరైజర్‌గా కూడా పని చేస్తుంది. ముఖంపై ఉండే టాక్సిన్లను తొలగించడంలో నువ్వుల నూనె బాగా పని చేస్తుంది.
- నువ్వుల నూనెలో యాంటీ ఆక్సిడెంట్లు అధిక శాతం ఉంటాయి. ఇవి ముఖంపై ఉండే ముడతలను తగ్గించడంలో కీలకమైన పాత్ర పోషిస్తాయి. రాత్రి పడుకునే ముందు ముఖానికి నువ్వుల నూనెను రాసుకొని మర్నాడు ఉదయం స్నానం చేస్తే సరిపోతుంది. ఇలా క్రమం తప్పకుండా చేస్తే ముడతలు తగ్గుముఖం పడతాయి.
- ముఖంపై ఉండే మచ్చలు, మొటిమలు తొలగిపోవాలంటే నువ్వుల నూనెతో మసాజ్ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది. ఈ నూనెలో విటమిన్లు, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి.

❄

---

## గుణపాఠం చెప్పాలి

**క్లాస్‌రూమ్, బస్సు, పార్క్, ఆఫీస్ ఇలా ఎక్కడ చూసినా మహిళలను వేధించేవారి సంఖ్య, వేధించడానికి అవకాశం కోసం ఎదురుచూసేవారి సంఖ్య ఎక్కువే ఉంది. ఏ ప్రదేశంలోనైనా సరే మహిళ ఒంటరిగా కనిపిస్తే చాలు అల్లరిచేసే వారికి తగిన గుణపాఠం చెప్పకపోతే.. వారి ఆగడాలు పెరిగి మహిళలు మళ్లీ వంటింటికే పరిమితం కావల్సిన పరిస్థితి వస్తుంది. సో.. అమ్మాయిలు.. మీరు ధైర్యంగా ముందడుగు వేస్తేనే.. మీ స్ఫూర్తితో మరికొంతమంది అమ్మాయిలు ధైర్యంగా ముందుకు సాగుతారు. ఈ వారం ఒంటరిగా కూర్చున్న మహిళపై చెయ్యివేసిన ప్రబుద్ధుడికి ఎలాంటి శాస్తి జరిగిందో చూడండి..!**

జాగింగ్ చేసి అలసిపోయిన యువతి కాసేపు రెస్ట్ తీసుకుందామని బెంచీపై కూర్చుంది. ఆమె ఒంటరిగా ఉండటం.. చుట్టూపక్కలా ఎవరూ లేకపోవడం గమనించిన ఒక వ్యక్తి ఆమెకు సమీపంగా వచ్చి.. ఆమెపై చెయ్యి వేశాడు.



తనపై చెయ్యివేసిన వ్యక్తి ఉద్దేశ్యం గ్రహించిన ఆమె వెంటనే అలర్ట్ అయ్యింది. దాడి చేయడానికే వచ్చాడని ఆమెకు అర్థం కావడంతో..తనపై వేయడానికి ముందుకు వచ్చిన చెయ్యిని తన కుడి చేత్తో గట్టిగా పట్టుకుని.. ఎడమచెయ్యి ఎలోబోతో అతని ఎడమచేతిపై అటాక్ చేసింది.





ఊహించని ఈ ఎదురుదాడితో ఆ వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేస్తాడు. అవకాశం ఇవ్వకుండా అతని చెయ్యిని గట్టిగా పట్టుకుని ఎడమచేతితో అతని మెడను గట్టిగా పట్టుకోవాలి. దాంతో అతడు కాస్త దూరం జరుగుతాడు.

ఆ వ్యక్తి కుడిచేతిని అలాగే గట్టిగా పట్టుకుని.. మీ ఎడమచేయితో గట్టిగా ముఖాన్ని అదిమిపట్టాలి. వెనక్కిబెండ్ అవుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్న ఆ వ్యక్తిని పట్టుతప్పి కిందపడిపోతాడు.



పిప్పల్ల వెంకటేశ్

ఆత్మవిశ్వాసంలో అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళలు తమను తాను రక్షించుకున్నప్పుడే దాడులను తిప్పికొట్టగలుగుతారు. అమ్మాయిలు అబలలు కాదు సబలలు అన్న విషయం మగవారికి అర్థం అయినప్పుడే ఈ దాడులు ఆగుతాయి.. అంతవరకు ప్రతి మహిళా తనను తాను రక్షించుకోవాడానికి ఎల్లవేళల సన్నద్ధమై ఉండాలి.



**ఎన్. లక్ష్మీ రవి,**
ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్,
రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్,
గాంధీనగర్, హైదరాబాద్.
9490239170,
9949039049

## వినూత్న ఆవిష్కరణలకు కేంద్రం

- మరో సిలికాన్ వ్యాలీగా విశాఖ : చంద్రబాబు



విశాఖలో జరుగుతున్న సీఐఐ సదస్సులో మాట్లాడుతున్న చంద్రబాబు

**విశాఖపట్నం:** సరికొత్త ఆవిష్కరణలకు విశాఖపట్నం కేంద్రం కానుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సిఐఐ సదస్సుకు విచ్చేసిన పెట్టుబడిదారులకు వివరించారు. విశాఖ మరో సిలికాన్ వ్యాలీగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఆదివారం ఉదయం విశాఖలోని సిఐఐ ప్లీనరీలో ఆయన రాష్ట్రంలో ఉన్న వనరులు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, టెక్నాలజీని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. టెక్నాలజీ వాడటం ద్వారా రాష్ట్ర ప్రజలకు ఉపాధి అవకాశాలను పెంచుతున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలోని ఒక్క సభ్యుడికైనా కంప్యూటర్‌పై అవగాహన ఉందన్నారు. సేవా రంగాలను ప్రయివేటుకు అప్పగించడం ద్వారా ఖర్చులు తగ్గుతున్నాయన్నారు. 40 లక్షల ఎల్ఇడి బల్బులను రూపాయి ఖర్చు లేకుండా ఏర్పాటు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజల నుంచి వినతుల స్వీకరణకూ సాంకేతికతను వాడుతున్నామన్నారు. 1100కి ఫోన్ చేసి సిఎం డ్యాష్ బోర్డుకు ఏ సమస్య గురించి చెప్పినా సిబ్బంది వెంటనే ఫిర్యాదు స్వీకరించి సంబంధిత శాఖ అధికారులకు ఆ సమస్యను సిఫార్సు చేసి 15 రోజుల్లో పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా స్టేజీపై ఓ ప్రతినిధితో 1100కి కాల్ చేయించి ఏ అంశాన్ని గురించి అయినా అడగాలని సూచించారు. అడవులు, పంటల గురించి సమాచారం అడగ్గా సిఎం డ్యాష్ బోర్డు నుంచి అందుకు సంబంధించిన సమాచారం చెప్పడం జరిగింది. అన్ని రంగాల్లోనూ టెక్నాలజీ వాడకంలో దేశంలోనే ఎపి ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మోడ్రేటర్‌గా అమెరికాకు చెందిన టెక్నాలజీ, సమా చార మేనేజ్‌మెంట్ కార్నల్ ఎస్‌సి జాన్సన్ కాలేజ్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ సౌమిత్ర దుత్త వ్యవహరించారు. సిఐఐ భారత అధ్యక్షులు కామినేని శోభన, ఇండియా, సార్క్ సిస్కో సిస్టమ్స్ ఇన్‌ఛార్జి సమీర్ గార్డే, లాక్‌హీడ్ మార్టిన్ ఇండియా ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఫిల్ షా పాల్గొన్నారు.

### చర్చనీయాంశమైన విందు

భాగస్వామ్య పెట్టుబడుల సదస్సు సందర్భంగా విశాఖలో అత్యంత రద్దీగా ఉండే వుడా పార్కు దగ్గర ఎంజిఎం పార్కులోపల శనివారం రాత్రి మందు, విందు ఏర్పాట్లు భారీగా జరిగాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి దగ్గరుండి ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అతిథులను ఆకట్టుకోవడానికి బాలీవుడ్ నుంచి నృత్యకారిణులు, పాప్ సింగర్‌లతో పాటు విలాసవంతమైన ఏర్పాట్లను చేపట్టారు. మందు, విందు ఇతర నృత్యాలను రుచిచూపించేందుకు చేసిన ప్రయత్నంలో భాగంగా ఇ-ఫాక్టర్ అనే సంస్థకు ఈవెంట్‌ను అప్పగించారు. ' స్వదేశీ, విదేశీ పెట్టుబడులు ఏ మేరకు వస్తాయో తెలియదుగానీ 'మందు, విందు'లతో మాత్రం ముంచెత్తడం విశాఖ నగరంలో ఆదివారమంతా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

### బందోబస్తు నిర్వహణలో హోంగార్డు మృతి

విశాఖపట్నంలో జరుగుతున్న పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు(సిఐఐ) బందోబస్తులో అపశ్రుతి చోటుచేసుకుంది. సదస్సులో భాగంగా రెండో రోజు ఆదివారం బందోబస్తు నిర్వహిస్తున్న హోంగార్డు సిహెచ్.రాజు(38) గుండెపోటుతో మృతి చెందాడు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో హార్బర్ పార్కు సమీపంలో రోడ్డుపై ట్రాఫిక్‌ను మళ్లిస్తున్న సమయంలో రాజుకు గుండె నొప్పి వచ్చి కుప్పకూలిపోయాడు. వెంటనే స్పందించిన తోటి పోలీసులు హుటాహుటినా కెజిహెచ్‌కు తరలించారు. అప్పటికే ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు.

## కులాంతర వివాహితులకు రూ.2లక్షలు చెల్లించాలి

- కేవీఎస్ఎస్ సమావేశంలో ప్రొఫెసర్ తిరుమలి


మాట్లాడుతున్న తిరుమలి

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**


కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు ప్రభుత్వం ప్రోత్సాహ కరంగా రూ.2లక్షలు. ఉద్యోగం ఇవ్వాలని కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం సమావేశంలో ప్రొఫెసర్ తిరుమలి డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీఎస్ఎస్ కార్యదర్శి ఎం దశరత్ అధ్యక్షతన కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిరుమలి మాట్లాడుతూ కుల, మతాంతర వివాహాలు చారిత్రక అవసరంగా భావించి ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా కులాంతర వివాహం చేసుకున్న దంపతుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి అనేక ఉత్తర్వులు ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రోత్సహకాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేవీఎస్ఎస్ గౌరవాధ్యక్షులు ఎస్ వినయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే ఎనమిది జిల్లాల్లో 14 కుల దురహంకార హత్యలు జరిగాయన్నారు. వీటిని అరికట్టడానికి కులాంతర వివాహితులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ శక్తులు ప్రేమికులపై దాడులకు ఉసిగొల్పుతున్నారని విమర్శించారు. వీటిని అభ్యుదయ శక్తులు అరికట్టాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి మార్చి 10 నుండి 31 వరకు అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు, రాష్ట్ర నాయకులు బాయిగడ్డ అనూష, జి చెన్నయ్య, కర్ణాకర్, రాజు, రాకేశ్, సురేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## లైంగిక దాడి బాధితుల్లో అత్యధికులు మైనర్లే

న్యూఢిల్లీ : దేశంలో జరుగుతున్న లైంగిక దాడుల కేసుల్లో అత్యధిక బాధితులు మైనర్లే అని తాజా అధ్యయనం వెల్లడించింది. లైంగిక దాడుల పరిశోధనలకు సంబంధించిన పూణెలోని ఒక కేంద్రంలో దాదాపు తొమ్మిది వందల కేసులను మెడికో లీగల్ ఎనాలిస్టులు విశ్లేషించారు. ఈ డేటా చాలా విచారకరమైన అంశాలను వెల్లడించింది. లైంగిక దాడుల బాధితుల్లో 60 శాతం మంది 18 సంవత్సరాల కన్నా తక్కువ వయస్సు గలవారేనని పేర్కొంది. పూణెలోని బీజే మెడికల్ కాలేజి అండ్ ససూన్ జనరల్ హాస్పటల్‌కు చెందిన ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టెక్సికాలజి విభాగం అధికారులు వెల్లడించిన డేటా మేరకు తాము పరిశోధించిన 890 లైంగిక దాడుల కేసుల్లో 534 కేసుల్లో బాధితులు పిల్లలు లేదా యుక్తవయస్సులో ఉన్న వారని తెలిపింది. నవంబరు 2015-సెప్టెంబరు 2017 మధ్య కాలంలో వీరిని చికిత్స నిమిత్తం ససూన్ ఆస్పత్రికి తీసుకు వచ్చినట్టు ఆ నివేదిక పేర్కొంది. లైంగిక దాడులకు సంబంధించి నమోదైన మొత్తం కేసుల్లో 60.23 శాతం మంది మైనర్లేనని తెలిపింది. ఇటువంటి కేసుల్లో అత్యధికులు బాలికలేనని, వీరి సంఖ్య 92.88 శాతంగా ఉందని, బాలుర సంఖ్య 7.12 శాతంగాఉందని ఆ నివేదిక వెల్లడించింది. అత్యధిక కేసుల్లో 62.55 శాతం మంది 15-18 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారేనని పేర్కొంది. అత్యధిక కేసు ల్లో అంటే దాదాపు 93.63 శాతం కేసుల్లో నింది తులు బాధితులకు తెలిసిన వారే కావడం విశేషం. చాలా కేసులలో దాదాపు39.51 శాతం కేసుల్లో బాధితుల బాయ్‌ఫ్రెండే నిందితుడవుతున్నాడని అధ్యయనం వెల్లడించింది. అత్యధిక కేసుల్లో అద్దెకు తీసుకున్న గదులలోనే దాడులు జరగు తున్నాయి. 26.40 శాతం కేసుల్లో దాడులు అద్దెకుతీసుకున్న గదుల్లో జరుగుతుంటే, 21.72 శాతం కేసుల్లో దుండగుల నివాసాల్లోనూ, 20.97 శాతం కేసుల్లో బాధితుల నివాసాల్లోనూ లైంగిక దాడులు జరుగు తున్నాయని అధ్యయనం వెల్లడించింది. లైంగిక దాడుల కేసుల్లో 92.88 శాతం మంది బాధితులు బాలికలు కాగా, 7.12 శాతం కేసుల్లో బాలురు బాధితులుగా ఉన్నారు.

# రాజ్యసభ ఆఫర్‌పై జేపీ సందిగ్ధం?

- ఎన్నికల షెడ్యూల్‌తో జోరందుకున్న చర్చలు
- ఆ ప్రతిపాదన సీఎందే: జనసేన
- కాదు పవన్‌దే : టీడీపీ


జయప్రకాశ్ కోర్టులో బాల్


**అమరావతి:** లోక్‌సత్తా వ్యవస్థాపకులు, మాజీ ఐఎఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ (జేపీ)కు అధికార తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన రాజ్యసభ సభ్యత్వ ఆఫర్‌పై అటు జేపీ ఇటు లోక్‌సత్తా పార్టీలో సంది గ్ధం నెలకొన్నట్లు సమాచారం. రాజ్యసభ ఆఫర్‌పై అత్యున్నతస్థాయిలో సమాలోచనలు సాగుతుండ గానే కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం ఎన్నికల షెడ్యూలు వెలువరించింది. మార్చి 5న నోటిఫి కేషన్, అదే నెల 12 నామినేషన్లకు తుది గడువుగా ప్రకటించింది. రాజ్యసభ ఆఫర్‌పై జేపీ తేల్చుకోడానికి గరిష్టంగా పక్షం రోజులు మాత్రమే సమయ ముంది. దాంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, జెపి తమ తమ కోణాల్లో సన్నిహితులతో చర్చలు సాగిస్తున్నట్లు తెలిసింది. జేపీకి రాజ్యసభ ఆఫర్ వచ్చిన మాట వాస్తవమేనని అయితే ఆయన ప్రస్తుతానికి ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నారని టీడీపీ, లోక్‌సత్తా వర్గాలు చెబుతున్నాయి. అయితే ఆఫర్ చంద్రబాబు తనకుతానుగా ఇచ్చారా లేక జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ ప్రతిపాదించారా అనే అంశాలపై ఎవ రికి తోచినవిధంగా వారు వాదనలు వినిపిస్తున్నారు.

ప్రత్యేక హోదా విషయంలో రాజకీయంగా టీడీపీకి జరిగిన నష్టాన్ని భర్తీ చేసేదాంట్లో భాగంగా ముఖ్యమంత్రే పవన్‌తో జేపీ చెంతకు రాజ్యసభ ప్రతిపాదన పంపారని జనసేన శ్రేణులు చెపుతుం డగా ఆ ప్రచారాన్ని టీడీపీ నాయకులు తప్పుబ డుతున్నారు. జేపీకి రాజ్యసభ ఇవ్వాలంటూ చంద్ర బాబు వద్ద పవన్ కళ్యాణే రాయబారం చేశారని వారంటున్నారు. టీడీపీ, జనసేన రెండు పార్టీలూ జేపీకి రాజ్యసభపై ప్రతిపాదించింది మీదు ముందం టే కాదు మీరేనని వాదులాడుకుంటున్న తరుణంలో అసలు జేపీ అంతరంగం ఏంటన్న విషయంపై రాజకీయవర్గాల్లో చర్చలు సాగుతు న్నాయి. జేపీని సంప్రదించకుండా చంద్రబాబు వద్దకు పవన్ ప్రతిపాదన తీసుకురారని కొందరం టుంటే, జేపీతో మాట్లాడకుండా పవన్ మద్దతును, అభిప్రాయాన్ని సీఎం తీసుకోరని మరికొందరంటు న్నారు. ప్రస్తుతం బాల్ జేపీ కోర్టులో ఉందని, తేల్చుకోవాల్సింది ఆయనేనని టీడీపీ, జనసేన వర్గాలు గట్టిగా విశ్వసి స్తున్నాయి.

### స్వతంత్ర అభ్యర్థిగా..

ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధనకు జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)ని నెలకొల్పేందుకు పవన్ ప్రయత్నించగా జేపీ పాల్గొ న్నారు. సరిగ్గా ఇప్పుడే జేపీకి రాజ్యసభ ఆఫరొ చ్చింది. దీనిపై జేపీ సందిగ్ధంలో ఉన్నట్లు సమా చారం. ఎలాగూ జేఏసీలోకి వచ్చాం కనుక రాబోయే ఎన్నికల్లో టీడీపీ, వైసీపీలను కాదని మూడోశక్తిగా జనసేన పోటీ చేస్తే ఆ పార్టీతో పొత్తు పెట్టుకుంటే రాజకీయంగా లోక్‌సత్తాకు లాభం ఉంటుందని జేపీ ఆలోచిస్తున్నట్లు తెలిసింది. జనసేన మూడోశక్తిగా పోటీ చేసే విషయంపై ఇప్పటి వరకు పవన్ నుంచి స్పష్టత రాలేదని లోక్‌సత్తా అంటోంది. పైగా రాజ్య సభ ఆఫర్‌ను పవన్ తీసుకురావడంపై జేపీ అంతర్మ దనంలో పడ్డట్లు సమాచారం. ఒకవేళ రాజ్యసభ తీసుకునేటట్లయితే టీడీపీ 'బి' ఫారంపై కాకుండా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి, అధికారపార్టీ మద్దతు పొందితే ఎలా ఉంటుం దనేదానిపై చర్చలు సాగుతున్నట్లు తెలిసింది. ఏ పార్టీకి చెందకుండా మేధావిగా రాజ్యసభకు వెళితే ఇబ్బందులుండవని ఆలోచన చేస్తున్నట్లు సమా చారం. ఇదిలా ఉండగా ఒకవేళ జేపీ రాజ్యసభకు వెళ్లదలిస్తే లోక్‌సత్తా పార్టీలో కూలంకుషంగా చర్చ జరుగుతుందని, తమ పార్టీలో ప్రజాస్వామ్యం ఉందని ఆ పార్టీ నేతలు కొందరంటున్నారు.

# బయట తెగడ్తలు-లోపల పొగడ్తలు




**అమరావతి :** విశాఖలో రెండురోజుల పాటు జరిగిన సీఐఐ సదస్సులో ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు అంశాలు ప్రస్తావనకే రాలేదు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించడం ముఖ్యఉద్దేశ్యమైనప్పటికీ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆందోళన జరుగుతున్న నేపథ్యంలో సదస్సు జరుగుతుండటం, కేంద్ర మంత్రులు హాజరు అవుతుండటంతో విభజన సమస్యలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం పరిశీలకుల్లో వ్యక్తమయ్యింది. శనివారం సమావేశం ప్రారంభం కావడానికి కొన్ని గంటల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టిడిపి అధ్యక్షుని హోదాలో పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో ప్రత్యేకహోదా అంశాన్ని ప్రస్తావించడమే దీనికి కారణం. రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ నేతలు పరస్పర విమర్శలు చేసుకుంటుండటం, ముఖ్యమంత్రి సైతం కేంద్ర వైఖరిపై తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ సదస్సులో ఎలా స్పందిస్తారన్న ఆసక్తి నెలకొంది. అయితే, బయట దుమ్మెత్తిపోసుకుంటున్న నేతలు సీఐఐ సమావేశంలో దానికి భిన్నంగా ప్రవర్తించారు. హోదా, విభజన హామీల అంశం నామమాత్రంగా కూడా ప్రస్తావనకు రాకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అదే సమయంలో పరస్పరం పొగుడుకోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో రైల్వేశాఖ మంత్రిగా వ్యవహరించి, వాణిజ్య, పారిశ్రామిక మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సురేష్ ప్రభు ఈ సమావేశానికి హాజరవడంతో విశాఖ రైల్వేజోన్ గురించి కొంత మేరకైనా స్పష్టత వస్తుందన్న ఆశలు అడియాశలయ్యాయి. ఆయన ఈ విషయాన్ని అసలు ప్రస్తావించకపోవడమే కాదు రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టే పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేకంగా ఇచ్చే రాయితీల ఊసు కూడా ఎత్తలేదు. చంద్రబాబు దార్శనికత గురించి చెప్పడానికే ఆయన సమయం కేటాయించారు. ముఖ్యమంత్రి కూడా ఇదే రీతిలో స్పందించారు. రాష్ట్ర విభజన సమయంలో కీలకపాత్ర పోషించుకునేటట్టుగా చెప్పుకునే ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు కూడా కేంద్ర పథకాలను రాష్ట్రం ఎలా వినియోగించుకోవాలో చెప్పడానికే పరిమితమయ్యారు. తెలుగుదేశం పార్టీకే చెందిన కేంద్ర మంత్రి అశోక్‌గజపతి రాజు కూడా ఇదే విధంగా స్పందించారు. మీడియా ప్రతినిధులు ఆయన్ను రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళన గురించి ప్రశ్నించినప్పటికీ ఆయన దాటవేత వైఖరిని అవలంభించారు. మొత్తం మీద ఉపరాష్ట్రపతి, కేంద్ర మంత్రుల ముందు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై తమ గళం వినిపించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్న అభిప్రాయాన్ని పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు. అదేసమయంలో టీడీపీ, బీజేపీల మధ్య మైత్రి బంధం ఏ మాత్రం సడలలేదని, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల కనుగుణంగా రెండు పార్టీల నాయకులు వ్యవహరిస్తున్నారన్న వాదన కూడా బలంగా వినిపిస్తోంది.



సీపీఎస్ విధానం రద్దుకు జగన్ మద్దతు

## అధికారంలోకి వస్తే సీపీఎస్ రద్దు

ప్రజాసంకల్పయాత్రలో జగన్ హామీ

**కనిగిరి :** తాను అధికారంలోకి రాగానే పెన్షన్‌కు సంబంధించి సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరిస్తానని వైఎస్ఆర్‌సిపి అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి హామీనిచ్చారు. ఆదివారం ప్రకాశం జిల్లా కనిగిరి నగర పంచాయతీ కాశిరెడ్డి కాలనీ సమీపం నుంచి ప్రారంభమైన ప్రజా సంకల్పయాత్ర చల్లగిరగల, నందనమారెళ్ళ, యడవల్లి క్రాస్‌రోడ్డు మీదుగా సాగింది. పాదయాత్రలో సీపీఎస్ రద్దు కోసం ఉద్యోగులు, యుటిఎఫ్ నాయకులు, వికలాంగులు జగన్‌ను కలిసి తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని కోరగా, జగన్ స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ వైసీపీ కనిగిరి యువజన విభాగం ఆధ్వర్యంలో స్థానిక పొగాకు బోర్డు ఎదురుగా జాతీయ రహదారిపై బైఠాయించి తెలిపిన నిరసనకు జగన్ మద్దతు తెలిపారు. అందరం కలిసి పోరాడి హోదాను సాధించుకుందామన్నారు. చల్లగిరగల గ్రామం వద్ద వైసీపీ జెండాను జగన్ ఎగుర వేశారు. నందన మారెళ్ల వద్ద 1301 కి.మీ.లు పాదయాత్ర పూర్తవుతుండటంతో జగన్ అభిమానులు రోడ్డుపై ఉప్పుకలిపిన రంగులతో అక్షరాలను సుందరంగా తీర్చిదిద్ది స్వాగతం పలికారు. ఇక్కడ జగన్ మొక్కను నాటి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పాదయాత్ర యడవల్లి క్రాస్‌రోడ్డు నుంచి మార్కాపురం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. జగన్ వెంట ఎంపి వైవి సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైసిపి రాష్ట్ర నాయకులు వేల్పుల వెంకటేశ్వరు, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## ఐటి కంపెనీలో అగ్నిప్రమాదం

కాలిబూడిదైన కంప్యూటర్లు, ఫర్నీచర్



**మంగళగిరి :** గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఓ ఐటి కంపెనీలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. గత నెల 17న రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించిన రెండు ఐటి కంపెనీలు అగ్నిప్రమాదానికి గురయ్యాయి. చారువికెంట్ ఐటిఎస్ ప్రైవేటు లిమిటెడ్, అద్వైత్ అల్గారిథం కంపెనీల్లో విద్యుదాఘాతానికి గురై ప్రమాదం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు అనుమానిస్తున్నారు. కంపెనీ నుండి ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు పొగలు వస్తుండడంతో గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అదించారు.

మొత్తం ఐదు ఫ్లోర్లలో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే అక్కడికి చేరుకున్న మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది దాదాపు గంటన్నరపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఆయా కంపెనీల్లో ఫర్నిచర్, కంప్యూటర్లు, ఇతర వస్తువులన్నీ పూర్తిగా కాలిపోయాయి. రూ.40 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉండొచ్చని అంచనా. ఘటనా స్థలిని అర్బన్ ఎస్‌పి విజయరావు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి మురళికృష్ణ, పట్టణ సిఐ బి.హరికృష్ణ సందర్శించారు. సిసి కెమెరాలు మొత్తం పరిశీలించి సమగ్ర విచారణ అనంతరం ప్రమాదం ఎలా వాటిల్లిందో నిర్ధారిస్తామని ఎస్‌పి ప్రకటించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఎలాంటి ప్రాణనష్టమూ జరగలేదు.

# రైతులవన్నీ..రాజకీయ హత్యలే

- ఆరు లక్షల మంది రైతులు చనిపోతే పార్లమెంట్‌లో ఎందుకు చర్చించలే..?:

రైతు ఆత్మహత్యల బాధితుల ఆత్మీయ సమ్మేళనంలో రామన్ మెగసెసే అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్, ప్రొఫెసర్ రమామెల్కొటే




**నవతెలంగాణ - సిటీబ్యూరో**

ప్రజాస్వామ్య దేశంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యలన్నీ రాజకీయ హత్యలేనని, వీటన్నింటికీ పాలకులే బాధ్యత వహించాలని రామన్ మెగసెసే అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్, సామాజిక వేత్త రమా మెల్కొటే అన్నారు. దేశంలో ఆరు లక్షల మంది రైతులు చనిపోతే పార్లమెంటులో ఒక్కరోజు కూడా ఎందుకు చర్చించలేదని నిలదీశారు. "రైతుల ఆత్మహత్యలు ఈ శతాబ్దపు ఘోర విషాదం-మన వ్యవసాయరంగ విధానలోపాలకి తార్కాణం-అన్నదాతలపై పాలకవర్గాల నిర్లక్ష్యానికి నిదర్శనం" అనే అంశంపై కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్ (సీసీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రైతు ఆత్మహత్యల బాధిత కుటుంబాలతో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సీసీసీ డైరెక్టర్ కె.సజయ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ టీవీ యాంకర్ ఝాన్సీ వ్యాఖ్యతగా వ్యవహరించారు. బెజ వాడ విల్సన్ మాట్లాడుతూ పాలకులు రైతులను కుట్ర పూరితంగానే నిస్సహాయ స్థితికి నెడుతూ.. పారిశ్రామికవేత్తలు వేల కోట్లు దోచుకుని దేశం వదిలి పారిపోయేలా సహకరిస్తున్నారని విమర్శించారు. ముంబయి నుంచి అహ్మదాబాద్‌కు బుల్లెట్ ట్రైన్, అమరావతికి ఎంత పెద్ద రాజధాని నిర్మాణం చేపట్టాలనే ఆలోచనలు మానేసి.. రైతు ఆత్మహత్య చేసుకుంటే బుల్లెట్ వేగంతో పాలకులు వచ్చి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు. బాధిత రైతు కుటుంబాలకు రూ.20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ రమామెల్కొటే మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని, అనుబంధ పరిశ్రమలను నెలకొల్పి నిధులను కేటాయిస్తేనే రైతులు బాగుపడతారన్నారు. మహిళా రైతులను గుర్తించి, వారి సహకార సంఘాలకు చేయూత ఇవ్వాలన్నారు. సీనియర్ సంపాదకులు పొత్తూరి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతు ఆత్మహత్యల అంశాన్ని ఎన్నికల ప్రణాళికలో నిర్దిష్టంగా చేర్చాలని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. నివారణ మార్గాలను కూడా పొందుపర్చాలన్నారు. మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ విద్యా, వైద్యాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడం కారణంగానే రైతాంగం అప్పుల పాలవుతున్నట్టు విశ్లేషించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు గురజాల రవీందర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నియోజకవర్గంలో 300 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. సెల్‌ఫోన్లు, కార్లకు, బండ్లకు లోన్లు ఇచ్చే బ్యాంకులు రైతులకు ఎందుకు రుణాలి వ్వట్లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఐ ఫర్ ఫార్మర్స్, సేఫ్ ద చైల్డ్ ఫౌండేషన్ సంస్థల ప్రతినిధులు శ్రీనివాస్, మల్లికార్జున్‌లు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రైతు ఆత్మహత్యల బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. బాధిత రైతు కుటుంబాలకు చెందిన పిల్లల చదువులు సక్రమంగా సాగేలా చర్యలు తీసుకుంటామనిరెయిన్‌బో హోం ప్రతినిధి ఇందిరా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కిరణ్ విస్సా (రైతు స్వరాజ్య వేదిక), భానుజా (ఆర్‌డీఎస్ఎస్), సీనియర్ జర్నలిస్ట్ భాషా(ఢిల్లీ), రిటైర్డు ఐఎఎస్ కేఆర్ వేణుగోపాల రావు, మానవ హక్కుల వేదిక అధ్యక్షులు జీవన్‌కుమార్, కొండల్‌రెడ్డి, ఆశాలత (సీసీసీ)లు పాల్గొని ప్రసంగించారు.

# బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్

**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో రెండేండ్లుగా బదిలీలు, పదోన్నతులు లేక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం వెంటనే బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలనీ టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం చెన్నుపాటి భవన్‌లో జరిగింది. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ రాములు మాట్లాడుతూ...సర్వీసురూల్స్ సమస్య కోర్టులో ఉన్నందున ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు. రాష్ట్రంలో ఉపవిద్యాధికారి, మండల విద్యాధికారి వంటి పర్యవేక్షణాధికారి పోస్టులు ఎక్కువ సంఖ్యలో ఖాళీగా ఉండడంతో విద్యారంగం కుంటుపడుతున్నదన్నారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జేఎల్ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్‌టీఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు నాగటి నారాయణ మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యామిషన్‌ను ప్రకటించాలని, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో తరగతికొక ఉపాధ్యాయుడు, గది, ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను, ఆంగ్లమాధ్యమాన్ని వచ్చే విద్యాసంవత్సరము నుండే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలానికి 5 నుంచి 8 ప్రాథమిక పాఠశాలలను ఎంచుకొని మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మరియు మిని గురుకులాలుగా మార్చాలని కోరారు. ఎస్‌టీఎఫ్ఐ ఉపాధ్యక్షురాలు ఎం సంయుక్త మాట్లాడుతూ... సీపీఎస్ విధానాన్ని రద్దు చేయడానికి ఎంఎల్‌ఏలతో ములాఖాత్ కార్యక్రమాన్ని కొనసాగించాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి




చావరవి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నాలుగేండ్లు గడుస్తున్న ఉపాధ్యాయ సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోలేదని అన్నారు. పండిత్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ ఇచ్చిన జీవోలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 2016 వేసవి సెలవులలో మధ్యాహ్నభోజన కార్యక్రమాన్ని నిర్వహించిన టీచర్లకు సంపాదిత సెలవులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. మోడల్ స్కూల్ టీచర్ల సర్వీసు రూల్స్ ప్రకటించి, బదిలీలు, ప్రమోషన్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. సోమశేఖర్, సీహెచ్. దుర్గాభవాని, కోశాధికారి ఎన్ కిష్టయ్య, ఐక్య ఉపాధ్యాయ సంపాదకులు పి.మాణిక్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఎ. నర్సిరెడ్డి, బి. నరసింహారావు, టి. లక్ష్మారెడ్డి, ఎం దేవదాసు, ఆంజనేయులు, రాజశేఖర్‌రెడ్డి, కె. జంగయ్య, బి. రాందాస్, వి. శాంతికుమారి, ఎంఎకే దత్త్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాల్గొన్నారు

## ఏసీబీని ముప్పు తిప్పలు పెడుతున్న బావా బావమరుదులు

**నవ తెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి**

తాము సంపాదించిన అక్రమార్జన గురించి సమాచారం ఇవ్వకుండా అవినీతి తిమింగలం ,హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ కట్టా పురుషోత్తంరెడ్డి, అతని బావమరిది శ్రీనివాస్‌రెడ్డిలు ఏసీబీ అధికారులను ముప్పు తిప్పలు పెడుతున్నారని తెలిసింది. మరో వైపు ఆదివారం కట్ట నివాసంలో ఏసీబీ జరిపిన సోదాల్లో మరో రూ.70 లక్షలకు పైగా బాంగరు నగలు, ఖరీదైన చీరలు, విదేశీ కరెన్సీ,విదేశీ మద్యం నగదు బట్టబయలైంది. ఏసీబీ డైరెక్టర్ జనరల్ జె.పూర్ణచంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం తమ కస్టడీలో ఉన్న కట్టాను మూడవ రోజు కూడా ఏసీబీ అధికారులు విచారించారు. ఇందులో భాగంగా తాజాగా బంజారాహిల్స్ లోని సాగర్‌సొసైటీలో గల కట్టా నివాసాన్ని ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో గత 45 రోజులుగా ఆ ఇంటికి రాని కట్టా భార్య విజయరెడ్డి కూడా తన భర్తతో పాటు ఉంది. దాదాపు ఐదు కోట్ల రూపాయల ఖరీదైనదిగా ఏసీబీ అధికారులు ఆ ఇంటి విలువ ఉంటుందని అంచనా వేస్తున్నారు. కాగా తాజాగా కట్టా నివాసంలో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులకు అప్పటికే ఆ ఇంటి నుంచి అత్యంత విలువైన భూమితో పాటు ఇతర డాక్యుమెంట్లు మాయం చేసినటుగా నిర్ధారణకు వచ్చారు.

ఈ సోదాల గురించి ముందుగానే ఉప్పందుకున్న కట్ట అండ్‌కో ఈ ఇంటి నుంచి కీలకమైన డాక్యుమెంట్లను అక్కడి నుంచి దాటి వేయించినట్టుగా అనుమానిస్తున్నారు. కాగా ఈ సోదాల్లో రూ.50 లక్షల విలువైన బంగారు నగలు, లక్షా ఐదు వేల రూపాయల నగదు, తొమ్మిది వేల రూపాయల పాత కరెన్సీ , 501 యూఎస్ డాలర్లు, 265 యూఏఈ కరెన్సీ లభించాయి. అలాగే రూ.20 లక్షల విలువైన ఖరీదైన చీరలు, రూ.70 వేల విదేశీ మద్యం సీసాలు కూడా కట్టా నివాసం నుంచి ఏసీబీ అధికారులు స్వాధీన పరుచుకున్నారు.

# చైతన్య ఉద్యమ స్వరూపిణి ఈశ్వరీబాయి




డా॥సోమేశ్వర్ బోనకుర్తి

జెట్టి ఈశ్వరీబాయి డిసెంబర్ 1, 1918లో సికింద్రాబాద్, చిలకలగూడలో ఒక సామాన్య దళిత కుటుంబానికి చెందిన బల్లెపు బలరామస్వామి – రాములమ్మ దంపతులకు జన్మించింది. 13వ ఏటనే పూనెలోని సంపన్న కుటుంబానికి చెందిన దంత వైద్యుడు జెట్టి నారాయణతో వివాహం జరిగింది. ఆమెకు లోకజ్ఞానం వచ్చేలోపు ఒక కూతురుకు జన్మనించింది. అనంతరం భర్తతో ఏర్పడిన విభేదాల వల్ల ఆమె పూనె నుంచి హైదరాబాద్‌కు చేరుకుంది. సొంతకాళ్ల మీద నిలవాలని పరోపకారిణీ అనే ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా వృత్తి జీవితం ప్రారంభించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రేషనింగ్ శాఖలో కొంత కాలం ఉద్యోగం చేసింది. ఈశ్వరీబాయికి తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్, మరాఠీ భాషల్లో ప్రావీణ్యం ఉంది. హైదరాబాద్‌లో ప్రజలందరితో కలిసి పని చేయాలన్నా, వారి ఆదరాభిమానాలు పొందాలన్నా ఆ రోజుల్లో బహుభాషా పరిజ్ఞానం ఒక ప్రత్యేక అర్హతగా ఉండేది. ఒక వైపు ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం చేస్తూనే ఇంకోవైపు సాంఘిక సేవలో పాల్గొనేది. అంబేద్కర్ ఉపన్యాసాలు, సిద్ధాంతాలు, ఆశయాలు, భావజాలం పట్ల ఆకర్షితురాలైంది. సమాజంలోని హెచ్చుతగ్గులు కటిక పేదరికం, అంధ విశ్వాసాలు, అమాయకత్వం, ఈర్ష్యా ద్వేషాలను నిశితంగా ఆలోచించినప్పుడు ఆమె మనసు కకావికలమయ్యేది. బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో ఈశ్వరీబాయి 1942 జూన్‌లో నాగపూర్‌లో జరిగిన అఖిల భారత ఎస్సీ కులాల సభకు హైదరాబాద్ రాష్ట్ర ప్రతినిధిగా ఈశ్వరీబాయి హాజరైంది. అదే సదస్సులో అఖిల భారత ఎస్సీ ఫెడరేషన్ అనే రాజకీయ సంస్థను స్థాపించారు. ఈసంస్థ కార్యకలపాలలో ఈశ్వరీబాయి క్రియాశీలకంగా పాల్గొనేది. ఎస్సీ ఫెడరేషన్ స్థానంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అనే రాజకీయ పార్టీని స్థాపించాలని డాక్టర్ అంబేద్కర్ తలపెట్టారు. కొత్త పార్టీకి మ్యానిఫెస్టోను కూడా ఆయన రూపొందించారు. అయితే ఆర్‌పీఐ ప్రారంభంకాక ముందే ఆయన అకాల మరణం చెందారు. అంబేద్కర్ స్ఫూర్తితో ఆయన అనునాయులు ఆ పార్టీని ముందుకు నడిపించారు. ఈ పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖకు ఈశ్వరీబాయి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. దరిమిలా అంచెలంచెలుగా ఎదిగి అఖిల భారత స్థాయిలో ఆ పార్టీకి ఆమె అధ్యక్షురాలుయ్యారు. 1951లో హైదరాబాద్ పురపాలక నగర పురపాలక సంఘానికి ప్రజాస్వామ్య రీతిలో తొలిసారిగా ఎన్నికలు జరిగిన సమయంలో ఆమె చిలకలగూడ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఎన్నికల రాజకీయాలలో ఈశ్వరీబాయికి ఇది తొలి మెట్టు. ఒక దళిత మహిళ అందున స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించడం హైదరాబాద్ నగర ప్రజలలో, ముఖ్యంగా రాజకీయ నాయకులలో పెద్ద చర్చనీయాంశమైంది. ఈశ్వరీబాయి తన బాల్యం నుంచి మనుషుల మధ్య ఈ వ్యత్యాసాలు ఏమిటి? స్త్రీ, పురుషుల మధ్య కులాలు, మతాల మధ్య ఈ అంతరాలేమిటి? ఒకరికి యాజమాని హోదా, మరొకరికి బానిస హోదా ఏమిటి? అని మదనపడేది. ఉద్యమించకుండా, పోరాడకుండా, ఆత్మగౌరవంతో సహ ప్రజలకు ఏదీ దక్కదని అర్థం చేసుకుని ప్రజలను అందుకు సన్నద్ధం చేసేది. చిన్న, సన్నకారు రైతుల సమస్యలు, రైతు కూలీల కనీస వేతనాలు, ఎస్సీ, ఎస్టీలకు బంజరు భూమితోపాటు ఇండ్ల స్థలాల కేటాయింపు. చేనేత, బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆర్‌పీఐ నాయకత్వంలో ఆమె అనేక ఉద్యమాలు నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 1956 అక్టోబర్ 14న నాగపూర్‌లో ఐదు లక్షల మంది అనునాయులతో బౌద్ద దమ్మ దీక్ష స్వీకారం కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈశ్వరీబాయి కీలక పాత్ర పోషించారు. 1967లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆమె నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి అంబేద్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పటి దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రిగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి టి.సదాలక్ష్మిపై ఆమె విజయం సాధించారు. ఆమె విద్యారంగంలో స్థానిక పరిపాలనాశాఖలో అనేక సంస్కరణలను తెచ్చారు. స్టాంపు డ్యూటి పెంపును అడ్డుకోవడంలో ప్రముఖ పాత్ర వహించారు. తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాలను ఎండగట్టడంలో చేనేత ఉత్పత్తుల పన్ను రద్దులో, ప్రభుత్వ సంస్థల పక్షపాత వైఖరులను వెలుగులోకి తేవడంలో వెన్నెముకగా నిలిచారు. 1972లో రాష్ట్ర శాసనసభకు రెండోసారి ఎన్నికయ్యారు. పదవులను పట్టుకుని వేలాడే నాయకులు అందలం ఎక్కుతున్న రోజుల్లో విలువల్ని పట్టుకుని ప్రజల కోసం పోరాడారు. దళితులపై జరిగే దుర్మార్గాలను ఆమె సహించేవారు కాదు. కృష్ణా జిల్లాలోని కంచికచర్లలో కోటేశం అనే దళితుడిని సజీవ దహనం చేసిన సంఘటనపై శాసన సభలో తీవ్ర చర్చ జరిగింది. మంత్రి తిమ్మారెడ్డి ఒక దశలో ఎస్సీలను కించపరిచే విధంగా అన్నారు. అప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర అగ్రహంతో ఉన్న ఈశ్వరీబాయి తిమ్మారెడ్డి వ్యాఖ్యాలతో అగ్రహావేశాలతో ఊగిపోతూ తన కాలి చెప్పుతీసి మంత్రి వైపు నిరసనగా చూపించారు. ఇది ఒక వ్యక్తికి వ్యతిరేకంగా ఉద్దేశించిన చర్య కాదు. తరతరాలుగా దళిత ప్రజలు అనుభవిస్తున్న భరించరాని ఆత్యాచారాలు, అన్యాయాలు, కుల దురహంకారంపై ఎత్తిన పిడికిలి అది. అయితే ఆమెకు ఎవ్వరి మీద ద్వేషభావం, శతృత్వం ఉండేది కాదు. కల్లాకపటం ఎరుగని మనసు ఆమెది. అందుకే అన్ని పార్టీల నాయకులు, సభ్యులు ఈశ్వరిబాయిని ఎంతగానో గౌరవించేవారు. 1951లో జగజ్జీవన్ రామ్ నాయకత్వంలోని దళిత లీగ్ శాఖను హైదరాబాద్‌లో స్థాపించారు. షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి పని చేసే నాలుగు సంస్థల్లోని యునైటెడ్ షెడ్యూల్డ్ కులాల ఫెడరేషన్, దళిత జాతీయ సమాఖ్య, దళిత వర్గాల లీగ్. 1957లో తెలంగాణ ఆంధ్ర ప్రాంతాల షెడ్యూల్డ్ కులాల సమాఖ్యలు విలీనమై ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల ఫెడరేషన్ ఏర్పడింది. అందులో ఈశ్వరీబాయి ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 1958లో సికింద్రాబాద్‌లో జరిగిన షెడ్యూల్డ్ కులాల కార్యకర్తలు, నాయకులు సభలో పాల్గొన్నారు. 1960లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సంస్థాగత ఎన్నికల్లో ఆమె ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వరద బాధితులకు సహాయం, మహిళా సంక్షేమం, శాంతి భద్రతలు వంటి అనేక అంశాలపై శాసన సభలో తన గొంతు వినిపించారు. ఆమె అధికార పక్షం కాకున్నా అన్ని పక్షాలు కలిసి ఆమె నిజాయితీకి గుర్తుగా ఆమెను మహిళా – శిశు సంక్షేమ బోర్డుకు అధ్యక్షురాలిగా ఎంపిక చేశారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని మహిళలు, పిల్లల కోసం ఆమె అనేక ప్రణాళికలను రచించారు. అంబేద్కర్ మార్గాన్ని విడనాడని ఈశ్వరీబాయి 24 ఫిబ్రవరి 1991న తుదిశ్వాస విడిచారు.

సెల్ : 9293762428

# బహుజనులే.... శ్రామిక జనులు



దయ్యపు రాధాకృష్ణ

దేశంలో గతంలో ఎన్నడూ లేనంతగా రాజకీయ, ఆర్థిక, సామాజిక సాంస్కృతిక రంగాలలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రాజ్యాధికారాన్ని చేపట్టిన పార్టీలు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలను విపరీతంగా ప్రభావితం చేస్తున్నాయి. అయితే ఈ మార్పు, ప్రభావం ప్రజల జీవితాలను మెరుగుపర్చే దిశలోనే ఉన్నదా, లేదా తిరగోమన దిశలో ప్రయాణిస్తున్నదా అనే విషయాలు గమనించాల్సిన అవసరమున్నది. గతంలో పాలకులు అవలంభించిన ఆర్థిక విధానాలు ప్రత్యక్షంగా ప్రజలకు నష్టం కల్గించేవి. ప్రజలు తమకు నష్టం కల్గించే అనేక విషయాలను ప్రతిఘటించేవారు. అందోళన చేసేవారు. ఉదాహరణ పెట్రోల్, డీజిల్ ధరలు 25 పైసలు పెరిగినా పెద్దఎత్తున నిరసనలు తెలియజేసేవారు. ఇప్పుడు దానికన్నా పెనుభారం మోపినా స్పందించక పోవడమో, సర్దుకుపోవడమో జరుగుతుంది. ఇది ప్రజలకు అత్యంత ప్రమాదకరం, పాలకులకు వరం.

ప్రజలు స్పందించకపోవడానికి, సర్దుకుపోవడానికి మనువాద పాలకులు సరికొత్త ఎత్తుగడలను ఉపయోగిస్తున్నారు. ప్రజల నిజ జీవిత సమస్యలకు కారణం ప్రజలే తప్ప, పాలకులు కాదని ప్రజల దృష్టిని మరలిస్తున్నారు. అందుకు ప్రజలపై పాలకవర్గాలే భావజాల యుద్ధం ప్రకటించారు. విభజించు పాలించు, మోదం–ఖేదం అనే సూత్రాన్ని అమలు చేస్తున్నారు. కులం, మతం ప్రాంతం, ఆహారం, భాష, విద్య వంటి అనేక విషయాలను ప్రజలపైకి వదిలారు. ప్రజలు తమలో తాము కలహించుకుంటుంటే ఆ విష భావజాలం మాటున కుభేరులు మరింత సంపన్నులుగా, కోటీశ్వరులు శత కోటీశ్వరులుగా పడగలెత్తడమే కాకుండా మనువాద పాలకులు తమ స్థానాలను పదిలం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. పాలకులు ఏ విధానాన్ని అమలు చేసినా అది ప్రత్యక్షంగా ప్రభావం చూపేది బహుజనులు, శ్రామికులు, అట్టడుగు వర్గాలపైనే. అధిపత్య కులాలలో అనేకమంది రాజకీయంగా, ఆర్థిక, సామాజికంగా అందనంత ఎత్తులో ముందున్నారు. వీరిచేతిలోనే రాజ్యాధికారం, భూమి, పరిశ్రమలు, సంపద ఉన్నవి. ఆస్థి, అధికారం, భూమి, భుక్తి , ఉద్యోగం, ఉపాధి లేక బహుజనులు తరతరాలుగా ఆర్థిక, సామాజిక అణచివేతకు, దోపిడీకి గురవుతున్నారు. సామాజిక, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా సమానత్వం కోసం కమ్యూనిస్టులు పనిచేస్తున్నారు. ఆర్థిక దోపిడీకి గురవుతున్న పేదలకూ, సామాజిక అణచివేతకు గురవుతున్న అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలంటే బహుజనులకు రాజ్యాధికారమే పరమావధిగా భావించి బహుజన రాజకీయ పోరాటం జరుగుతున్నది. ఈ రెండు పోరాటాలు దేశంలో వున్న 99శాతం శ్రామిక బహుజనుల జీవితాలకు సంబంధించినవే. కష్టాలను అనుభవిస్తున్నది, పోరాటాల బాటలో నడుస్తున్నది బహుజనులే. కానీ ఈ రెండు ఉద్యమాలు రైలు పట్టాల మాదిరి కలుసుకోకుండా ప్రయాణం కొనసాగుతున్నది. అందుకే చేరవల్సిన గమ్యానికి చాలా దూరంలో ఉన్నది. కారణం ఇరు ఉద్యమాలు తమ విధానాల అనుకూలతలను అర్థం చేసుకోకపోవడమే. అంబేద్కర్ తన "కుల నిర్మూలన"లో కుల–వర్గ సమాజాలను ఏ ఒక్కదాన్ని నిర్లక్ష్యం చేసినా, వదిలేసినా, సరైన దిశలో తీసుకెళ్లకపోయినా సామాజిక, ఆర్థిక సమానత్వం గల రాజ్యాన్ని స్థాపించలేమని అన్నారు. ఇది నేటి వరకు జరిగినది వాస్తవం. కమ్యూనిస్టులు బహుజనుల కోసం పోరాటాలు చేస్తున్నా వారి నాయత్వాన్ని ఆలస్యంగా అంగీకరించిన మాట కూడా వాస్తవమే. అంబేద్కర్‌కు కూడా కమ్యూనిస్టులపై పూర్తిగా వ్యతిరేకత లేదు. దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కమ్యూనిస్టులకు నేను దగ్గరే అని అంబేద్కర్ అంటారు. 1938 నవంబరు 7న మహారాష్ట్రలో పారిశ్రామిక వివాదాల బిల్లుకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మె విజయవంతంగా జరిగింది. ఇది స్వార్థపర శక్తులపై అంబేద్కర్ కమ్యూనిస్టుల సంయుక్త కార్యాచరణ విజయంగా భావించారు. అందేకాదు కమ్యూనిస్టు పాలన ఉంటే ఎలా ఉంటుందో ఫైనాన్స్ సమస్యలపై "ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రావిన్షియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా"పై రాజ్యాంగ పరిషత్‌లో అంబేద్కర్ ఇలా అంటారు. మనది కమ్యూనిస్టు దేశమై వుంటే మన ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయక జీవన విధానం ప్రభుత్వం స్వాధీనం చేసుకొని వుండేది. లేదా మనమంతా ఒకేస్థాయిలో వుండేవాళ్లం. పొదుపుతో సంబంధం లేకుండా ప్రజల సంక్షేమానికి, విద్యకు కమ్యూనిస్టు ప్రభుత్వమే సంపూర్ణ బాధ్యత తీసుకుంటుంది. (సెక్షన్ –3, పేజి నెం: 264 అంబేద్కర్ జీవిత విశ్లేణాత్మక అధ్యాయనం–కుబేర్), ప్రవేటు ఆస్థి రద్దు, భూమి, పరిశ్రమలు, బ్యాంకులు, ప్రభుత్వ రంగం ( స్టేట్ & మైనారిటీస్ – అంబేద్కర్) లాంటి అనేక ఆర్థిక, సామాజిక విధానాలు బహుజనులు కమ్యూనిస్టులు ఉద్యమాల్లో కలిసి పనిచేయడానికి ప్రేరణవంటివి.


బహుజన కమ్యూనిస్టు ఉద్యమాలకు అనుకూలతే కాదు అపోహలు, అవరోధాలు కూడా ఉన్నాయి. రాజ్యాధికారం, హింస, నాయకత్వంపై కొంతమంది బహుజన మేధావులలో అపోహలున్నాయి. దేశంలో మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికల నుండి నేటివరకు ఎన్నికలలో పోటీ చేయడం మూడు రాష్ట్రాలలో ఓటు ద్వారానే అధికారం చేపట్టడం జరిగింది. సాయుధ పోరాటం ద్వారానే అనే పంథా అనాటి పరిస్థితిది. నేడు ప్రపంచం మొత్తం కుగ్రామమైంది. శాస్త్ర సాంకేతికరంగం విప్లవాన్ని సృష్టిస్తున్నది. "హింస" అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. అంబేద్కర్ తన "బుద్ధుడు – బౌద్ద ధమ్మం" (పేజి నెం: 335) బుద్ధుడు ఉద్దేశ్యపూర్వకమైన హింసను మాత్రమే తప్పు పట్టాడు కానీ తప్పనిసరి పరిస్థితులలో హింస నేరం కాదన్నాడు. అపోహలను అధిగమించడం సులభమే కానీ బహుజన, కమ్యూనిస్టు ఉద్యమాలకు ప్రధాన అవరోధం అస్థిత్వ ఉద్యమాలు. ఐక్యం కావాల్సిన బహుజనుల మధ్య కులగోడలు నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నవి. బహుజనుల ఐక్యతకు, రాజ్యాధికార పోరుకు ఆటంకంగా తయారు అవుతున్నది. బహుజనుల బతుకుల సమస్యలు కాకుండా దోపిడీకి వ్యతిరేకంగా నిలబడకుండా పాలకవర్గాలకు పరోక్షంగా అస్థిత్వ ఉద్యమాలు ఉపయోగపడుతున్నాయి. ఇందుకు ఉదాహరణలుగా మహారాష్ట్రలో రామ్‌నాథ్ అతావలే, బీహార్‌లో రామ్ విలాస్ పాశ్వాన్ , జితేన్‌రాం మాంగీ, వంటి నాయకులను చెప్పుకోవచ్చు.

బహుజన కమ్యూనిస్టు ఉద్యమాలకు అనేక సవాళ్లు కూడా ఉన్నాయి. ముఖ్యంగా భారత రాజ్యాంగం పెను ప్రమాదంలో ఉన్నది. మనువాద పాలకులు, పరోక్షంగానే కాదు ప్రత్యక్షంగానూ మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే 'మనుధర్మమే' మా రాజ్యాంగం అంటున్నారు. దాడులు, హత్యలు పెరుగుతున్నాయి. అసహనం పరాకాష్టకు చేరుకుంటున్నది. అధికారం నియంతల పాలనవైపు పయనిస్తున్నది. సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా పరిశ్రమలు మూతపడుతున్నాయి. ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. నిరుద్యోగం పెరిగిపోతున్నది. పేద, ధనికుల మధ్య ఆర్థిక అంతరాలు అందుకోలేనంతగా వుంటున్నాయి. వీటన్నిటికీ బలవుతున్నది బహుజనులే. కులం, మతం, ఆర్థిక విధానాలే కాదు అస్థిత్వ, గుర్తింపు ఉద్యమాలు కూడా సవాళ్లుగానే ఉన్నది. ఈ ఉద్యమాల వల్ల ఐక్యం కావాల్సిన బహుజనులలో మాదే గొప్పకులం అనే ధోరణిలోకి వెళ్లి కులతత్వాన్ని సంతరించుకుంటున్నది, ఈ సవాళ్లను బహుజన కమ్యూనిస్టులు అర్థం చేసుకోవాల్సివుంది.

అందుకే అంబేద్కర్, పూలే, మార్క్స్, సైద్ధాంతిక సారూప్యతతో తెలంగాణ రాష్ట్రంలో బహుజనుల రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో సామాజిక న్యాయం కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో మహాజన పాదయాత్ర జరిగింది. సబ్బండ వర్గాల సకల సమస్యల పరిష్కారం కోసం సామాజిక ప్రజా వర్గ సంఘాలను ఐక్యం చేయడానికి టి–మాస్ ఏర్పడింది. బహుజనులే పునాదిగా, రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా నేడు బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవిర్భవించింది. అంబేద్కర్ చెప్పినట్టు గత చరిత్ర వర్తమానానికి వ్యర్థమైన అనుకరణ కారాదు. వర్తమాన భారతదేశ భౌతిక పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ఐక్యంగా ముందుకెళ్లాలి. అనుకూలతలే బలమైన ఆసరాగా, అపోహలను అవరోధాలను అధిగమించి, సవాళ్లను ఎదుర్కొని రాజ్యాధికారం దిశగా పయనించాలి. బహుజన రాజ్యాన్ని సాధించాలి.

సెల్ : 7730877841

# ప్రజలెందుకు ఇంగ్లీష్‌ను కోరుకుంటున్నారు?



డా॥ కాలువ మల్లయ్య

చికాగో ప్రజల పోరాట ఫలితంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం 'మేడే' వచ్చినట్టే బంగ్లాదేశ్ ప్రజల పోరాట ఫలితంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వచ్చింది. మేడే మానవీయమైన 8గంటల పనివిధానాన్ని ప్రపంచానికందిస్తే, ఫిబ్రవరి 21 ప్రపంచ వ్యాప్తంగా మాతృభాషలను రక్షించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. పెట్టుబడిదారీ వికృతరూపం, అమానవీయ లాభాపేక్ష 8 గంటల పని విధానాన్ని పూర్వపక్షం చేస్తున్నట్టే సామ్రాజ్యవాదుల, ఆధిపత్య భాషలు మాతృభాషలను మృత భాషలుగా మారుస్తున్నాయి. ప్రపంచీకరణ పేరు మీద లాభాల వేట పేరుతో గత పాతిక సంవత్సరాలుగా కార్మికవర్గం సామ్రాజ్యవాద విధానంతో యంత్రాలుగా మారినట్టే, ఆధిపత్య భాషల జోరుతో ప్రాంతీయ మాతృభాషలు మృత భాషలుగా మారుతున్నాయి. సంస్కృతం కంటే ఎంతో ముందు కాలం నుంచి ఈ దేశ ప్రాంతీయ భాషలు, ద్రవిడ భాషలుండగా సంస్కృతమే రాజభాషయింది. అందులోనే పుస్తకాలు వచ్చాయి. అసలు చదువుకునే అవకాశాలు శూద్రులకు లేకుండా చేసింది భారతీయ కుల వ్యవస్థ. దీంతో భారతీయ ప్రాంతీయ భాషలన్నీ మౌఖికంగానే ప్రజల నోళ్లలో జీవించాయి. సంస్కృతం రాజ భాషగా ప్రాంతీయ భాషలను అణగదొక్కింది. ఒక విధంగా సంస్కృతం బ్రాహ్మణుల, రాజుల రాజభాషే. అయితే సంస్కృతంలోని పదాలు, అక్షరాలు క్రమంగా ప్రాంతీయ భాషల్లోకి ప్రవేశించాయి. తెలుగులోకే సంస్కృత భాషా పదాలు విరివిగా చొరబడ్డాయి. కావ్యభాష పేరు మీద సంస్కృతం తెలుగు సాహిత్యంలో ప్రధాన స్థానమాక్రమించింది. అధికంగా చెప్పబడే నన్నయ్య మహా భారతాన్ని తెలుగులోకి అనువదించడం పేరు మీద తెలుగు లిపిలో సంస్కృత పదాలతో నింపివేశాడు. పాల్కురికి సోమనాథుడి లాంటివాళ్లు అచ్చతెలుగులో కావ్యాలు రాసినా ప్రాచీన సాహిత్యంలో సంస్కృతానిదే పెద్దపీట. తెలుగు పేరుమీద సంస్కృతమే తెలుగు సాహిత్యంలో వ్యాప్తి చెందింది.

అసలు సిసలైన తెలుగు భాష మౌఖికంగానూ, జానపద సాహిత్యంలోనూ తల దాచుకుంది. పండితుడంటే సంస్కృత పండితుడే. కవి అంటే సంస్కృత గ్రాంథిక భాషలో రాసే వాడే. ప్రజల భాషను గాసటబీసట భాషన్నారు. వేమన లాంటి ప్రజా కవిని కూడా గుర్తించడానికి నిరాకరించారు. పుస్తక భాషా అదే అయ్యింది. ఇంట్లో మాట్లాడుకునే తెలుగొకటైతే, పాఠశాలల్లో చదివే తెలుగు మరొకటిగా ఉండేది. గ్రాంథికం పేరు మీద, గ్రామ్యం పుస్తక భాషగా నిషిద్ధమని చిన్నయసూరి లాంటి పండితులు చేసిన సూత్రాలను పాఠశాల చదువుల్లో అనుసరించడం వల్ల తెలుగు కఠినమైన భాషగా, కొరుకుడు పడని భాషగా సాహిత్యానంతర చదువులకు వినిపించేది. ముఖ్యంగా మొదటితరం, రెండోతరం దళిత, బహుజన విద్యార్థులకు ఇది కూడా తెలుగు మాతృభాష కాదు అనేంతవరకు పోయింది. నిజానికి వారు తమ భాష కాదంటున్న తెలుగు పాఠ్యపుస్తకాల్లో ఉన్న సంస్కృత భాష తెలుగు. ప్రజలు వాడుకునే అతిసామాన్య భాష స్వాతంత్ర్యానంతరం పుస్తకాలకెక్కి ఉంటే పాఠ్యపుస్తక భాష అయ్యుంటే మేం చదివేది మా భాష కాదన్న భావం తెలుగు చదువరులకు వచ్చుండేది కాదు. ముస్లిం రాజులు, ఆంగ్లేయులు ఉర్దూ, ఇంగ్లీష్‌లను రాజ భాషలుగా చేసి ప్రాంతీయ భాషలను నిరాధరణకు గురి చేశారు. ఆంగ్లేయులు మెకాలే విద్య విధానాన్ని ప్రవేశపెడుతూ ఇంగ్లీష్ విద్యను భారతీయ విద్యగా మార్చే క్రమంలో చక్కని, శాస్త్రీయ పద్ధతిననుసరించారు. పాఠశాల విద్యవరకు ఆయా ప్రజల మాతృభాషలో విద్యబోధనతోపాటు ఒక సబ్జెక్టుగా ఇంగ్లీష్, పూర్తిస్థాయిలో బోధించడం, ఉన్నత విద్య ఇంగ్లీష్ మాధ్యమంలో చెప్పడం. దీనివల్ల పిన్నవయస్సులో ఇంట్లో మాట్లాడుకునే భాషలో చెప్పడం వల్ల విషయాన్ని సులభంగా గ్రహించగలిగే అవకాశం ఉంది. ఏ ఇతర భాష, ఇంగ్లీష్ కూడా బాగా రావాలంటే మాతృభాషలో ప్రావీణ్యం ఉండి తీరాలి. ఇది మంచి ఫలితాలనిచ్చింది. ఇంగ్లీషులోనూ నిష్ణాతులయ్యారు. బ్రిటీష్‌వారి పాలనా రంగానికి బాగా ఉపయోగపడ్డారు. అటు మాతృభాషలనూ రక్షించుకోగలిగారు. సృజనాత్మకత పెరిగింది. ఇలా చదివిన స్వాతంత్ర్యానంతర తరం వారు డాక్టర్లు, ఇంజనీర్లు, రచయితలు, నాయకులు, తత్వవేత్తలు, జర్నలిస్టులు అయ్యారు. జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి పొందారు. ఉన్నత విద్య సైన్స్, మ్యాథ్స్, సోషల్ సబ్జెక్టులు, సాంకేతిక పదకోశాలు కృత్రిమ తెలుగులోకి అనువాదమై పుస్తకాలు తయారయ్యాయి. మరికొంత కాలంలో విద్య ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి పోయి పాఠశాల విద్య కూడా ఇంగ్లీష్ మాధ్యమంలో ప్రారంభమైంది. ప్రపంచీకరణ విజృంభణతో ఇంగ్లీష్ మాధ్యమాలు గుణింతాలయ్యాయి. ప్రైవేటు విద్య ఇంగ్లీష్ మాధ్యమం, ప్రభుత్వ విద్య తెలుగు మాధ్యమంగా ప్రచారం జరిగింది. క్రమక్రమంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నాణ్యత తగ్గింది. అది తెలుగు మాధ్యమం వల్ల కాదు, ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేయడం వల్ల కాదు. తెలుగు మాధ్యమం వల్లనే ఆంగ్ల భాష వ్యాపించింది. ఉన్నవారికి ఇంగ్లీష్ మాధ్యమం, పేదవారికి తెలుగు మాధ్యమమా అన్న వాదం పెరిగింది. బహుజన, దళిత మేధావులు అందరికీ ఇంగ్లీష్ విద్య కావాలని కోరుకున్నారు. ఆర్థికంగా ఏ మాత్రం లేని వారు కూడా ఇంగ్లీష్ మాధ్యమాలకే పంపించారు. ఇంగ్లీష్ మాధ్యమాల్లో తమ పిల్లలను చదివించడానికి నానా యాతన పడుతున్నారు. అలా అయితేనే విదేశాలకెళ్లి బాగా డబ్బు సంపాదించవచ్చన్న భావం పెరిగింది. ఇంగ్లీష్‌లో చదవడమే ఆత్మగౌరవ చిహ్నమైంది. ప్రభుత్వాలు శాస్త్రీయ కారణాలను ఆలోచించకుండా నూటికి నూరు పాళ్లు ఇంగ్లీష్ మాధ్యమాలను చేద్దామంటున్నాయి. ప్రజలు కానీ, మేధావులు కానీ ఇంగ్లీష్ మాధ్యమాలను కోరుకోవడానికి కారణం ఉద్యోగాలు దొరకడం, విదేశాలకెళ్లగలిగే అవకాశాలు కలుగడం కారణాలే కావచ్చు. కానీ అవి మాత్రమే కావు. వాళ్లు గుర్తించని, గుర్తించినా ఇదని ఖచ్చితంగా చెప్పలేని కారణాలున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు నాణ్యత విషయంలో కార్పొరేట్ పాఠశాలలతో సరితూగవు. ప్రభుత్వ పాఠశాలల స్థాయిని, నాణ్యతను పెంచాలి. ప్రైవేటు విద్యను క్రమక్రమంగా తగ్గించి ప్రభుత్వ విద్యను పెంచాలి. పాఠశాల విద్యంతా ప్రభుత్వాధీనంలోనే ఉండాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికి (మాతృభాషలో) బోనస్ మార్కులుండాలి. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఒకే మాధ్యమం ఉండితీరాలి. అందరికీ చదువుకునే అవకాశాలూ సమానంగా ఉండాలి. ఇక రెండోదైనా అతి ముఖ్యమైన విషయం. మాధ్యమ భాష. ప్రాంతీయ భాషల్లో సాంప్రదాయ, సంస్కృత, దైవ సంబంధ, తాత్విక సంబంధ పదజాలం ఉంది తప్ప భౌతిక సంబంధ, వైజ్ఞానిక సంబంధ పదజాలం లేదు. మన పుస్తకాల్లో వాడే భాషలో గ్రాంథిక భాషలో సామాన్య జనం వాడుకలో వృత్తి సంబంధ కులాల వారి భాషలో ఉన్న ఇలాంటి పదాలు పుస్తకాలకెక్కలేదు. అక్షరాభ్యాస సమయం, ప్రాథమిక విద్య శిశువుపై శాశ్వత ప్రభావాన్ని చూపుతుంది. చేత వెన్నముద్ద, చందమామ రావే లాంటి అశాస్త్రీయ భావజాలాన్ని పిల్లల మెదళ్లలోకెక్కించడం వల్ల వాళ్లు భౌతికపరమైన, శాస్త్రీయ ఆలోచనకు దూరమవుతున్నారు. దేశంలో గుర్తించబడిన 22 భాషలతో పాటు 100 భాషలు వాడుకలో ఉన్నాయి. అందులోంచి 42 భాషలు త్వరలో మృతభాషలవుతున్నాయని పరిశోధనల్లో తేలింది. ప్రాంతీయ భాషలను రక్షించుకోవాలంటే పైన సూచించిన మార్పులు చేయాలి. కారణాలేవైనా ఇంగ్లీష్ అంతర్జాతీయ భాష. తనను తాను నవీకరించుకుంది. ప్రజాస్వామీకరించుకుంది. సాంకేతిక పదజాలాన్ని తనలో సంలీనం చేసుకుంది. పాఠశాల విద్య ఇంగ్లీష్ మీడియంలోనూ, తెలుగు మాధ్యమంలోనూ ఉండి తీరాలి. మీడియం ఏదైనా అటు ఇంగ్లీష్, ఇటు తెలుగు ఒక సబ్జెక్టుగా పూర్తి స్థాయిలో చదవాలి. ఇదే మాతృభాషలను రక్షించుకునే ఏకైక మార్గం.

సెల్ : 9849377575

# వృద్ధుల కోసం ఆశ్రమాలు మానవ సమాజంలో కళంకాలు!

రంగనాయకమ్మ

\- 1 -

'వృద్ధులు' అంటే, పెరిగిన పిల్లల తల్లిదండ్రులే. అత్త మామలే, తాతలూ, అమ్మమ్మా–నాయనమ్మలే కదా? 60 ఏళ్లు దాటితే చాలు, వాళ్లని 'వృద్ధులు' లెక్కలో వేసేసి, ఇక, వాళ్ల కోసం, 'ఆశ్రమాల్ని' వెతుకుతారు కన్న పిల్లలు! ఆ ఆశ్రమాలు పెట్టే వాళ్లలో, రెండు రకాల వాళ్లు వుంటారు. కొందరైతే, 'సంస్కరణల' దృష్టితోనే చేస్తారు. సమాజానికేవో సేవలు చెయ్యాలి అనుకుంటూ, ఈ ఆశ్రమాలు పెట్టాలని ప్రయత్నిస్తారు. తన వంటి సంస్కర్తలతో కలిసి, చిన్నదో పెద్దదో, ఆశ్రమం పెడతారు కూడా. కొందరైతే, ఈ ఆశ్రమాలు పెట్టే పని కేవలం 'బిజినెస్ దృష్టి'తోనే చేస్తారు. సమాజంలో ఒక 'చెడ్డ' కనపడ్డా, కనపడకపోయినా, ఆ చెడ్డని తామే ఊహించి, ఆశ్రమాల పని సాధిస్తారు. ఆ తర్వాత ప్రచారాలు! "ఈ 'ఆశ్రమం'లో చేరండి! మీ వృద్ధుల్ని చేర్పించండి! వారిని మేము కన్నబిడ్డల్లా చూస్తాం!" అంటూ సాగుతాయి ప్రచారాలు. వృద్ధుల్ని కన్నబిడ్డల్లా చూడడం అంటే, వాళ్లని మళ్లీ ఇంకో చోటుకి పంపెయ్యవలిసిందే కదా? కన్నబిడ్డలు చేసింది అదే కాబట్టి, అదే 'కన్న బిడ్డల్లా చూడడం' అవుతుంది కదా? ఆశ్రమాలు పెట్టే వాళ్లు, బిజినెస్ కోసమో, 'సంస్కరణ' కోసమో పెడితే, అంతకన్నా వింత విషయం ఒకటి వుంది! ఆశ్రమాలలో చేరే వాళ్ల ఆలోచనలు అవి! వాళ్లు మరింత ఎక్కువ బిజినెస్ దృష్టితోనో, కీర్తి దృష్టితోనో వుంటారు. కాస్త పెద్ద వయస్సు వాళ్లల్లో కొందరైతే, "మేం ఆశ్రమంలో చేరిపోతాం బాబూ! కొంపల్లో వుండలేం" అంటారు. ఆశ్రమంలో చేరడం, 'స్వతంత్రత' అనీ, 'స్వేచ్ఛ' అనీ, 'నాగరికత' అనీ, మాట్లాడతారు. వాళ్లకి ఏ నాడూ ఆ మాటలు నచ్చినవి కావు. కానీ, 'ఆశ్రమాల' గురించి విని, దాన్ని 'కొత్త నాగరికతే' అనుకుంటారు. ముఖ్యంగా ఆశ్రమంలో పడితే, అక్కడ ఏ పనీ చెయ్యక్కర లేదని! అక్కడ, ఇక్కడి చీపురు పుల్ల తీసి అక్కడ పెట్టక్కరలేదు! ఆ సుఖాల్ని బాగా వూహిస్తారు.

ఇక, అసలైన తెలివిపరులైతే, ఆశ్రమంలో చేరడాన్ని బిజినెస్ దృష్టితోనే ఖర్చుల్ని జమ కట్టుకుంటారు. నేను ఒక సారి టీవీలో విన్నాను. ఇద్దరు పెద్ద వయసు ఆడవాళ్లు, ఒక ఆశ్రమంలో చేరిన వాళ్లే, చిరునవ్వులతో గడగడా చెప్పారు. వాళ్లు చెప్పింది ఏమిటంటే ఆశ్రమంలో చేరితే ఎన్నో ఖర్చులు కలిసి వస్తాయట! ఆ ఇద్దరూ స్వంత ఇళ్లూ, కూతుళ్లూ వున్నవాళ్లే. పని మనుషుల్ని రోజంతా పెట్టకోగలవాళ్లే. వాళ్ల మాటలు వింటే, చాలా మందికి నచ్చుతుంది కాబోలు! వాళ్లు అన్నది "మన ఇళ్లు అద్దెలకి ఇచ్చేసుకోవచ్చు. మన ఇళ్లల్లో మనం వుండాలంటే, వంట మనిషి కావాలి, పని మనిషి కావాలి. అంతేనా? పోషణ సరుకులన్నీ తెప్పించుకోవాలి. తెచ్చే వాళ్లు ఎలా తెస్తారో ఎంత ఎగ్గొడతారో, మనకి తెలుస్తుందా? ఇంటి బిల్లూ, కరెంటు బిల్లూ, నీళ్ల బిల్లూ, ఈ బిల్లూ, ఆ బిల్లూ, ఎన్ని కట్టుకోవాలో! ఆ గోలంతా ఎందుకు? ఇంటిని అద్దెకి ఇచ్చేసి, 'ఆశ్రమం'లో చేరితే, కొంత డిపాజిట్టు కట్టి, నెలకి కొంత కడితే సరిపోతుంది. మన ఇల్లో, డబ్బో, మన పిల్లలకే వుంటాయి! ఇవీ మాటలు! – ఇలా చెప్పడానికి వాళ్లేమీ సిగ్గు పడలేదు. సిగ్గు పడే విషయంగా అది వాళ్లకి తోచలేదు. అంటే, వృద్ధుల ఆశ్రమాలు నడిపే వాళ్లు, బిజినెస్‌గా లాభాల కోసం నడుపుతారంటే, అందులోకి చేరేవాళ్లు కూడా లాభాల కోసమే చేరతారన్నమాట! ఆ చేరే వాళ్లని, పిల్లలే చేర్చినా, ఆ పిల్లల దృష్టి కూడా బిజినెస్ దృష్టే. "మీరు వున్న ఆశ్రమం ఎలా వుంది?" అని అక్కడ వున్న వాళ్లని అడిగితే, ఆ సుఖాలన్నీ వర్ణిస్తారు. 'అసలు, మనం ఏ పనీ చెయ్యక్కర్లేదు. (ఇలా చెప్పేవాళ్లు 60 ఏండ్లు దాటీ దాటని వాళ్లు, అంతే. ఏ పనీ చెయ్యరట!) ఆశ్రమంలో అయితే, పొద్దుపొద్దున్నే కాఫీలూ, టీలూ తర్వాత టిఫెన్లూ ఆ తర్వాత భోజనాలూ మధ్యాహ్నం విశ్రాంతులూ సాయంత్రం మళ్లీ టిఫిన్లూ, రాత్రికి భోజనాలూ ఈ మధ్యలో అంతా టీవీ సీరియళ్లూ, రాత్రికి నిద్రలూ – ఇదీ ఆశ్రమ జీవితం! ఈ జీవితంలో ఇంకో సుఖం వుంది. దాదాపు రోజూ కొత్త కొత్త స్వాములోర్లు వచ్చి, మత గ్రంథాలు చదివి వినిపిస్తూ, స్వర్గంలో సుఖాలు బోధిస్తారు.

'స్వర్గం' గురించి రోజూ వినడం వల్ల, వీళ్లందరికీ స్వర్గానికే పోతామని నమ్మకం! దేవుడితో మాట్లాడతామని! ఆ దేవుడు, భూమి మీదకే ఎందుకు రాడు? – అది ఆలోచించరు. ఇంకో తమాషా చూడండి! ఆశ్రమాల్లో చేరిన ధనిక స్త్రీ పురుషులైతే, పండగలకీ, పబ్బాలకీ కూతుళ్లు, మనవరాళ్ల పుట్టిన రోజులకీ, అలాగే అప్పుడప్పుడూ కూతుళ్ల ఇండ్లకి పోతారు. అక్కడ కావలిసిన కూరలూ అవీ మర్నాటి సాయంత్రం దాకా తింటూ, ఆ రెండో రోజే ఆశ్రమంలో వాలిపోతారు. వీళ్లని, కూతుళ్లు, "ఇక్కడే వుండండి!" అనరు. వాళ్లు అన్నా, వీళ్లకి భయం. అక్కడే వుంటే, ఏదైనా పని చేయాల్సి వస్తుందని. బియ్యంలో రాళ్లు ఏరాలేమో! ఎండిన బట్టలు మడతలు పెట్టాలేమో! ఎప్పుడన్నా పని మనిషి రాకపోతే గిన్నెలు కడగాలేమో, గదులు ఊడ్చాలేమో! ఈ పనుల గోలలెందుకు? ఆశ్రమంలో అయితే ఒక్క పని అయినా ముట్టుకోనక్కరలేదు. కాబట్టి, మళ్లీ ఆశ్రమానికే పరిగెత్తుకొస్తారు. అసలు, 'ఇల్లు' అంటే ఏమిటి? అది, ఎవరెవరి కోసం? పెద్ద వయసు వాళ్లకి 'ఇంటి'లో వుండే హక్కు వుండదా? 'ఇల్లు' అంటే, యవ్వనవంతులకేనా? 'ఇల్లు' అనే నీడలో, పసి పిల్లల పరుగులూ అమ్మమ్మల, నాయనమ్మల, తాతయ్యల నిదానపు నడకలూ మధ్య వయసు భార్యాభర్తల పని పాటలూ, ఇరుగు పొరుగుల రాకపోకలూ, బంధువుల సమాచారాలూ, స్నేహితుల పలకరింపులూ – ఎన్నెన్నో జరుగుతూ వుంటాయి! కానీ, 'ఆశ్రమం' అంటే, అది 'ఇల్లా?' పెద్ద వయసు తల్లిదండ్రులకు 'ఇల్లు' అనేది పోయిందంటే, ఇక ఆ తల్లిదండ్రులు, మృత్యువు వైపు నడవడమే కదా? 'ఆశ్రమం' అంటే, అది ఇల్లా? – కాదు. పెద్ద వయసుల వారికి ఇంటిలో తిరిగే అర్హతే వుండదా? ఆ అర్హత పోతుందా? 'ఆశ్రమం' అంటే ఏమిటి? ఇక, ఇంటి జీవితం ముగిసిపోయి, 'కాటి' వైపు చూస్తూ, కాటిలో కాళ్లు పెట్టుకుని కూర్చునే మజిలీయే కదా ఆశ్రమం? ఇంటిలో తిరిగేటప్పుడైతే, 'చావు' మాట గుర్తు రాదు. "రేపే పోతాం" అనే దృష్టి వుండదు. "ఇక, జీవితంలో ఏం వుంది? చావే కదా?" అనే ఆలోచనే వుండదు.

( తరువాయి భాగం గురువారం సంచికలో)

# బీజేపీ, టీఆర్ఎస్ పాలనలో దళితులపై పెరుగుతున్న దాడులు



టి. స్కైలాబ్ బాబు

బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి దళితులపై 20శాతం దాడులు దౌర్జన్యాలు పెరిగాయి. ఏ తిండి తినాలో, ఏ బట్టకట్టాలో, ఏమి మాట్లాడాలో నిర్ణయాలు చేస్తున్నది. పశువులు మనుషులలాగా, మనుషులను పశువులలాగా చూస్తున్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో దళిత స్కాలర్ రోహిత్ వేముల బీజేపీ నేతల వల్ల మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. జేఎన్‌యూలో కన్నయ్యకుమార్‌పై రాజద్రోహం కేసు పెట్టారు. గుజరాత్ రాష్ట్రం ఊనా పట్టణంలో ఆవు చర్మాన్ని వలుస్తున్నారనే నెపంతో ఐదుగురు ఎస్సీ యువకులను ఆర్ఎస్ఎస్ గోగుండాలు చెట్టుకు కట్టేసి కొట్టి, కారుకు కట్టి అమానుషంగా రోడ్డుపై ఈడ్చుకెళ్లారు. యూపీ రాష్ట్రం దాద్రీలో మహ్మద్ అఖ్లాక్ (58) ఇంట్లో ఆవు మాంసం ఉందనే నెపంతో అతని ఇంటిపై దాడి చేసి విపరీతంగా కొట్టి చంపేశారు. నల్లగొండ జిల్లా చండూరులో ఆవును కోయడానికి ప్రయత్నిస్తున్నారని ఆర్ఎస్ఎస్, బీజేపీ, గోగుండాలు ఎస్సీ కాలనీలోని వృద్ధులు, మహిళలని చూడకుండా దాడిచేసి గాయపర్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా చిన్నకందుకూరులో ఆవు చర్మాన్ని వలుస్తున్నారనే నెపంతో ఎస్సీ కాలనీపై దాడి చేశారు. దళితులు వేలాది సంవత్సరాలుగా తమ ఇష్టపూర్తిగా భుజించే ఆహారంపై ఆంక్షలు పెడుతూ దాడులు, దౌర్జన్యాలతో ఆర్ఎస్ఎస్, బీజేపీ హింసను సృష్టించింది. మతోన్మాదాన్ని, మూఢ విశ్వాసాలను వ్యతిరేకించినందుకు రచయితలు, మేధావులైన అరవింద్ ఫన్సారే, నరేంద్ర దబోల్కర్, కల్బుర్గి, జర్నలిస్టు గౌరి లంకేశ్‌లను కాల్చి చంపారు. మరోవైపు దళితుల గుండెగా ఉన్న రాజ్యాంగాన్ని సవరించటానికి, రిజర్వేషన్లు రద్దు చేయడానికి కుట్రలు చేస్తున్నారు. హర్యానాలో జాట్‌లు, గుజరాత్‌లో పటేళ్లు, ఆంధ్రాలో కాపులు తమకు రిజర్వేషన్లు కావాలని, లేదంటే ఎస్సీ, ఎస్టీలకు ఇప్పుడిస్తున్న రిజర్వేషన్లు రద్దుచేయాలని అనేక హింసాత్మక ఉద్యమాలు చేపట్టారు.

రాష్ట్రంలో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి నాలుగేండ్లు కావొస్తుంది. ఈ కాలంలో 14 కుల దురహంకార హత్యలు జరిగాయి. దాడులు, దౌర్జన్యాలు రెట్టింపయ్యాయి. నిజామాబాద్ జిల్లా అమ్రాద్ గ్రామంలో రోజా (రెడ్డి) యువతి సాయికుమార్ అనే ఎస్సీ యువకుడిని ప్రేమించి పెండ్లి చేసుకున్నందుకు, రోజాను కన్నతల్లిదండ్రులే కిరోసిన్ పోసి నిప్పంటించి సజీవ దహనం చేశారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఖానాపురం గ్రామానికి చెందిన ఎస్సీ యువకుడు మధుకర్ మున్నూరు కాపు కులానికి చెందిన శిరీష అనే యువతిని ప్రేమించడమే నేరమైనట్టుగా, మధుకర్ మర్మావయాలు కోసి చంపి చేనుగట్లల్లో పడేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా పల్లెర్ల గ్రామానికి చెందిన రజక యువకుడు అంబోజీ నరేష్ పక్క గ్రామం లింగరాజుపల్లిలో తుమ్మల స్వాతి (రెడ్డి) యువతిని ప్రేమించి బొంబాయిలో పెండ్లి చేసుకోగా, వాళ్లిద్దర్ని నమ్మించి మోసం చేసిన స్వాతి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి నరేష్‌ను కిడ్నాప్‌చేసి చంపి తన బిడ్డను బాత్‌రూమ్‌లో ఉరివేసి చంపాడు. వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపెల్లిగూడెం గ్రామ ఎస్సీ యువకుడు ఇనుగాల రాజేష్ అదే గ్రామానికి చెందిన బీసీ యువతిని ప్రేమించినందుకు రాజేష్‌ను బాగా కొట్టి 25కిలోల బండరాయిని నడుమకు కట్టి రైల్వే ట్రాక్ పక్కగల బావిలో పడేశారు. నల్లగొండ జిల్లా పి.ఎ.పల్లి మండలంలో దళిత యువకుడు వేలాద్రి అగ్రకులం యువతిని ప్రేమించాడని కిరాతకంగా చంపేశారు. వీటితోపాటు హోంమంత్రిత్వశాఖ నుండి సమాచార హక్కు చట్టం ప్రకారం సేకరించిన వివరాలు ప్రకారం .... మొత్తం హత్యలు, అత్యాచారాలు, గాపర్చడం, ఇతర ఐపీసీ, గృహ దహనం, పీసీఆర్ యాక్ట్ ఎస్సీ, ఎస్టీ, అత్యాచార నిరోధక చట్టం కేసులు కలిపి 2014లో 1597 జరుగగా, 2015లో 1689 నమోదయ్యాయి. 2016లో 1904 నమోదు కాగా 2017లో 1951 నమోదయ్యాయి.

నేరెళ్లలో ఇసుక మాఫియాను నిర్వహిస్తున్న దుండుగులు పోలీసులచే ఎస్సీలపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి పాశవికంగా, క్రూరంగా కొట్టడం, మత్తు పదార్థాలు, ఇంజక్షన్లు ఇవ్వడం, కరెంట్ షాక్ పెట్టడం వంటి దుర్మార్గ ఘటనలకు పాల్పడ్డారు. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం అంభగపట్నంలో ఇద్దరు ఎస్సీ యువకులను బీజేపీ జిల్లా కార్యదర్శి భరత్‌రెడ్డి ముక్కునేలకు రాయించి మురికినీటిలో ఉంచి 18 రోజులు కిడ్నాప్‌చేసిన సంఘటన తెలిసిందే. వనపర్తి జిల్లా పాతపల్లి గ్రామంలో దళితుల ఇండ్ల స్థలాల భూమిలో అగ్రకులాలు శవాలను పాతిపెట్టగా అడ్డుకున్నందుకు దళితులపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం మంథని గ్రామంలో రామాలయ నిర్మాణానికి స్థలం ఇవ్వనందుకు 150 ఎస్సీ కుటుంబాలను అగ్రకులాలు సాంఘిక బహిష్కరణ చేశాయి. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం కుస్తాపూర్ గ్రామంలో నీరుటికాండ్లుగా పనిచేస్తున్న ఎస్సీలు తమకు భుక్తం పెంచమన్నందుకు వీడీసీలు 100 ఎస్సీ కుటుంబాలను 2 నెలలు సాంఘిక బహిష్కరణ చేశాయి. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో హనుమాన్ దేవాలయంలోకి వెళ్లి గర్భగుడిని ముట్టారని సాంఘిక బహిష్కరణ చేశారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఎల్లారం గ్రామంలో ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు దళితులు వెళ్లేదారికి అడ్డంగా కంచే వేశారు. దానిపై దళలవారి ఉద్యమం నిర్వహించి కంచె తొలగించుకున్నాం. అగ్రవర్ణ ఈఈ రవీందర్‌రెడ్డి మానసిక వేధింపులకు తాళలేక ఎస్సీ పీఆర్ ఏఈ శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రభుత్వం దళితులకు 3 ఎకరాల భూ పంపిణీలో జరిగిన వైఫల్యాలవల్ల సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గూడెం గ్రామం ఎస్సీ యువకుడు మహంకాళి శ్రీనివాస్ కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకొని హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. జగిత్యాల జిల్లా దొంతాపూర్ దళిత ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రయ్యను అగ్రకులానికి చెందిన ఎంపీపీ భర్త కిషోర్‌రావు ఇంట్లో కట్టేసి చితకబాదాడు. వికారాబాద్ జిల్లా యాలాల మండలం రాష్ణం గ్రామంలో ఎస్సీలకు క్షౌరం చేశాడని సెలూన్‌షాపును బుల్డోజర్‌తో అగ్రకులాలు తొలగించాయి. కొమరంభీం జిల్లా బెజ్జూరు మండలం, మర్తిడి గ్రామంలో దుర్గం సేవంతిభాయి అనే దళిత మహిళ అప్పు ఇచ్చి అడిగినందుకు టీఆర్ఎస్ నేతలు కిరోసిన్ పోసి నిప్పంటించి సజీవ దహనం చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల కేంద్రంలో ఎస్సీ మహిళ మల్లాపురం గంగా అనారోగ్యంతో మరణిస్తే, కనీసం శవాన్ని పూడ్చుకోనివ్వకుండా తహశీల్దారు, రెవెన్యూ సిబ్బంది అడ్డగించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండలం పాలంపేట గ్రామంలో ఎస్సీల డబుల్ బెడ్‌రూం ఇండ్లకు జిల్లా కలెక్టర్ స్థలం కేటాయించగా, ఆ భూమి గ్రామం మధ్యలో ఎస్సీల ఇండ్లు ఉండొద్దని అగ్రకుల పెత్తందారులు ఆందోళనకు దిగారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో ఎస్సీలను బతుకమ్మ ఆడనీయకుండా అగ్రకులస్థులు అడ్డుకున్నారు. వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలం గర్మిళ్లపల్లిలో దళితులను బతుకమ్మ అందరితో కలిసి ఆడుకొనియ్యలేదు. ఇలా దళితులపై దాడులు, దౌర్జన్యాలు, కుల దురహంకార హత్యలు నిత్యకృత్యంగా జరుగుతున్నా, ప్రభుత్వం వీటిని అరికట్టాలనే చిత్తశుద్ధితో లేదు. పైగా కులదురహంకార హత్యలకు పాల్పడిన నిందితుల పక్షాన ప్రభుత్వం నిలిచింది. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పెద్దమండవ గ్రామంలో ఎస్సీ మహిళ శవాన్ని శ్మశాన స్థలంలో పూడ్చనీయకుండా ఆ గ్రామ కుల పెత్తందారులు అడ్డుకున్నారు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు అరికట్టడానికి రాజ్యాంగబద్ధంగా ఉన్న దళిత చట్టాలను పకడ్బంధీగా అమలుచేయాలి. మనం తినే ఆహారంపైన హక్కును కాపాడుకోవాలి. దాడులు, దౌర్జన్యాలను ఐక్యంగా తిప్పికొట్టాలి. దళితుల అభివృద్ధికి వాగ్దానాలు కాదు, ప్రత్యామ్నాయ విధానాలు కావాలి. అంబేద్కర్ చెప్పిన ప్రకారం అడుక్కుంటే వచ్చేది బిక్ష... పోరాడితే వచ్చేది హక్కు ఫలితం, అందుకు ఐక్య ఉద్యమాల ద్వారా హక్కులు, అభివృద్ధి సాధించాలి.

సెల్ : 9177549646

## ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

\- ఎడిటర్

### మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

# చీకటి మింగిన వెలుగు రేఖ

నవచిత్రం

**అతిలోకసుందరిని తలపించే అందం, అత్యద్భుత నటన, అత్యద్భుతమైన వ్యక్తిత్వం శ్రీదేవి సొంతం. ఏ పాత్ర చేసినా అందులో ఒదిగిపోయి యావత్ భారతీయ ప్రేక్షకులతో శభాష్ అనిపించుకున్న లేడీ సూపర్‌స్టార్. తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో ఆమె నటించని స్టార్ హీరో లేరంటే అతిశయోక్తి లేదు. బాలనటిగా వెండితెరంగేట్రం చేసి స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన చరిత్ర శ్రీదేవిదే కావడం విశేషం. దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా వెండితెర ప్రేక్షకులతోపాటు బుల్లితెర ప్రేక్షకులను అలరించిన మహానటి. తన నట విశ్వరూపంతో ప్రేక్షకుల మదిలో సుస్థిర స్థానం సొంతం చేసుకుని దివికేగిన శ్రీదేవి జీవిత ప్రస్థానం గురించి..**

వెండితెరపై చెరగని సంతకం..


శ్రీదేవి

- తమిళనాడులోని శివకాశిలో ఆగస్ట్ 13, 1963లో అయ్యప్పన్, రాజేశ్వరి దంపతులకు (శ్రీ అమ్మయ్యంగార్ అయ్యప్పన్ అసలు పేరు) శ్రీదేవి జన్మించారు. 1971లోనే బాలనటిగా 'పూమ్‌బట్టా' చిత్రంతోనే ఉత్తమ బాలనటిగా కేరళ స్టేట్ అవార్డు సొంతం చేసుకున్నారు. 'జూలీ' చిత్రంతో (1975)లో బాలీవుడ్ ఎంట్రీ. తమిళం, హిందీ, తెలుగు, కన్నడ, మాలయాళ భాషల్లో సైతం బాలనటిగా నటించి మెప్పించారు. తెలుగులో బాలనటిగా దాదాపు 10 చిత్రాల్లో నటించారు. తమిళంలో కె.బాలచందర్ దర్శకత్వంలో రూపొందిన 'మూండ్రు ముదిచు' చిత్రంతో తొలిసారి శ్రీదేవి లీడ్‌రోల్‌లో నటించారు. ఆ తర్వాత బాలచందర్ దర్శకత్వంలో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించారు. ఆయన చిత్రాలతో కమల్‌హాసన్, శ్రీదేవి హిట్‌పెయిర్‌గా పేరొందారు. దాదాపు 260కి పైగా చిత్రాల్లో శ్రీదేవి నటించారు.
- భారతీయ సినీ చరిత్రలో హీరోయిన్‌కు స్టార్‌డమ్ తీసుకొచ్చిన ఘనత ఒక్క శ్రీదేవికే దక్కుతుందనటంలో ఏ మాత్రం సందేహం లేదు. తెలుగు (85), తమిళం (72), హిందీ (71), మలయాళ (26) భాషలతో పాటు కన్నడలో కూడా పలు చిత్రాల్లో నటించారు. కె.బాలచందర్, భారతీరాజా, దాసరి, కె.రాఘవేంద్రరావులతోపాటు మిగిలిన భాషల్లో సైతం స్టార్ దర్శకులు రూపొందించిన చిత్రాల్లో శ్రీదేవి నటించారు. వీటిల్లో చాలా చిత్రాలు బ్లాక్‌బస్టర్ హిట్స్‌గా సినీ చరిత్రలో నిలిచాయి. 1977-1983 వరకు తమిళ నాట హిట్ పెయిర్‌గా శ్రీదేవి, కమల్‌హాసన్ నిలవగా, 1983-1988 వరకు బాలీవుడ్‌లో జితేంద్ర, శ్రీదేవి హిట్ పెయిర్‌గా నిలిచారు. ఆ తర్వాత తెలుగునాట ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు తదితర అగ్రహీరోల సరసన పలు తెలుగు చిత్రాల్లోనూ, విష్ణువర్ధన్‌తో పలు కన్నడ చిత్రాల్లోనూ నటించి మెప్పించారు. 1996 నుండి బాలీవుడ్‌లో శ్రీదేవి, అనిల్‌కపూర్ హిట్ పెయిర్‌గా పలు విజయవంతమైన చిత్రాల్లో నటించారు. అమితాబ్ సరసనా నటించారు. అలాగే చిరంజీవి, నాగార్జున, వెంకటేష్ వంటి అగ్రహీరోలతో కూడా నటించి ప్రేక్షకుల్ని అలరించారు. తన ప్రతిభతో లేడీ సూపర్‌స్టార్‌గా ఎదిగారు. (1980-90) దశాబ్ద కాలం శ్రీదేవికి స్వర్ణయుగం అని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.
- పలు వ్యాపార ప్రకటనలతోపాటు 'మాలినీ అయ్యర్' సీరియల్‌తో బుల్లితెర ప్రేక్షకులను సైతం అలరించారు. 'కబూమ్' టీవీ షో జడ్జ్‌గా, ఏషియన్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్‌కు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించారు.
- శ్రీదేవి కోసం బాలీవుడ్ సినీ ప్రముఖుల నుండి లెక్కలేనన్ని పెళ్ళి ప్రపోజల్స్ వచ్చాయి. ఈ ప్రపోజల్ చేసిన వాళ్ళ పేర్లలో హాలీవుడ్ నిర్మాత అశోక్ అమృత్‌రాజ్ పేరు బాగా వినిపించింది. బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తితో శ్రీదేవి ప్రేమాయణం సాగించారని, అంతేకాకుండా వీళ్ళిద్దరూ రహస్యంగా పెళ్ళి కూడా చేసుకున్నారని అప్పట్లో మీడియాలో ప్రత్యేక కథనాలు వచ్చాయి. ఒకానొక దశలో మీడియా సమావేశంలో మిథున్ చక్రవర్తి ఈ పెళ్ళి గురించి ఖండించినప్పటికీ అదే సమయంలో ఓ సినీ వార పత్రిక శ్రీదేవి, మిథున్ చక్రవర్తికి పెళ్ళయినట్టు ధృవీకరించే మ్యారేజ్ సర్టిఫికెట్‌తో సహా ప్రచురించింది. శ్రీదేవి, మిథున్ చక్రవర్తి ప్రేమ, పెళ్ళి విషయాలు అప్పట్లో పెద్ద దుమారమే రేపాయి. 1996, జూన్ 2న బోనీకపూర్‌ని వివాహం చేసుకున్నారు. 1967-2007వరకు నటించిన శ్రీదేవి ఇద్దరు కూతుళ్ళు జాహ్నవి, ఖుషీల బాధ్యతలతో కుటుంబ జీవితానికే పరిమితమైపోయారు. జాహ్నవి ప్రస్తుతం 'ధడక్' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. మారాఠీలో సంచలన విజయం సాధించిన 'సైరత్' చిత్రానికి ఇది రీమేక్.
- 1980 టైమ్‌లో టాప్ పొజిషన్‌లో ఉన్న శ్రీదేవి, జయప్రదల మధ్య ప్రొఫెషనల్ రైవలరీ ఉండేది. తర్వాత తర్వాత వీళ్ళిద్దరూ స్నేహానికి ప్రతీకగా నిలిచారు. 'జురాసిక్ పార్క్' చిత్రంలో నటించమని శ్రీదేవిని స్టీవెన్ స్పీల్‌బర్గ్ రిక్వెస్ట్ చేశారు. అప్పటికే బాలీవుడ్ టాప్‌స్టార్ హీరోయిన్‌గా రాణిస్తున్న శ్రీదేవి అందులో నటించేందుకు నిరాకరించారు.
- 1993లో విలన్‌గా షారూఖ్‌ఖాన్ నటించిన 'బాజీగర్'లో తొలుత శ్రీదేవితో ద్విపాత్రాభినయం చేయిద్దామని దర్శకుడు అభిప్రాయ పడ్డారు. శ్రీదేవిని షారూఖ్ చంపేయడమనేది ప్రేక్షకులు జీర్ణించుకోలేరని దర్శకుడు శ్రీదేవికి బదులు శిల్పాశెట్టి, కాజల్‌ని తీసుకున్నారు.
- బాలీవుడ్‌లో అత్యధిక పారితోషికం తీసుకున్న తొలి బాలీవుడ్ నటి శ్రీదేవి. బాలీవుడ్‌లో ప్రవేశించే నాటికి శ్రీదేవికి హిందీ మాట్లాడ్డం రాదు. 1989లో విడుదలైన 'చాందిని' చిత్రంతో హిందీలో సైతం తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పడం ప్రారంభించారు. దీంతో వృత్తిపట్ల తన అంకిత భావాన్ని చాటారు.
- అసిస్టెంట్ డైరెక్టర్‌గా కె.రాఘవేంద్రరావు బాలనటి శ్రీదేవితో రోడ్డు దాటే సన్నివేశం తీస్తున్నప్పుడు అనుకోకుండా ఓ కారొచ్చి శ్రీదేవిని ఢీ కొట్టింది. కొద్దిగా గాయపడ్డ శ్రీదేవిని స్వయంగా కె.రాఘవేంద్రరావు హాస్పిటల్లో జాయిన్ చేశారు. అదే శ్రీదేవితో ఆయన దర్శకుడిగా 1978లో 'పదహారేళ్ళ వయసు' చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమా టాలీవుడ్‌ని షేక్ చేసింది.
- శ్రీదేవి సినీ ప్రస్థానంలో మైలురాళ్ళుగా నిలిచిన 'నాగిని' (1986), 'చాందిని' (1989) చిత్రాల్లో తొలుత శ్రీదేవికి బదులు జయప్రద, రేఖలను సదరు దర్శక, నిర్మాతలు తీసుకుందామనుకున్నారు. మిస్టర్ ఇండియా చిత్రానికి శ్రీదేవి వాళ్ళ అమ్మ 10 లక్షల రూపాయల పారితోషికాన్ని డిమాండ్ చేశారు. ఆ చిత్రం కోసం శ్రీదేవికి 11 లక్షల రూపాయల పారితోషికాన్ని బోనీకపూర్ ఇచ్చారు.
- 1989లో రూపొందిన 'చాల్‌బాజ్' చిత్రంలోని 'నా జానే కహా సే ఆయీ హై' పాట షూటింగ్ చేస్తున్న టైంలో 103 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నా శ్రీదేవి డాన్స్ చేశారు. 1986లో నిర్మితమైన 'భగవాన్ దాదా' చిత్రంలో శ్రీదేవితో బాలనటుడిగా హృతిక్‌రోషన్ నటించారు.
- 1991లో 'లమ్హే' చిత్రం షూటింగ్ లండన్‌లో జరుగుతున్న సమయంలో శ్రీదేవి నాన్న చనిపోయారు. నాన్న మరణంతో కృంగిపోయిన శ్రీదేవి తదుపరి షెడ్యూల్‌లో అనుపమ్‌ఖేర్‌తో ఓ కామెడీ సన్నివేశంలో తొలుత నటించారు. తండ్రి చనిపోయాక.. తన తల్లితోపాటు సవతి తల్లి, ఆమె కూతురు, కొడుకుల బాధ్యతల్ని శ్రీదేవి తీసుకున్నారు.
- 'బడిపంతులు' చిత్రంలో ఎన్టీఆర్‌కి మనవరాలిగా నటించిన శ్రీదేవి ఆ తర్వాత ఆయన సరసన కథానాయిక నటించడం ఓ విశేషమైతే, 'మూండ్రు ముదిచు' చిత్రంలో రజనీకాంత్‌కు సవతితల్లి పాత్రలో నటించడం మరో విశేషం. పాత్ర ఏదైనా సరే ఆ పాత్రకు న్యాయం చేయటంలో శ్రీదేవి తనకు తానే సాటి అని నిరూపించుకున్న సందర్భాలెన్నో ఉన్నాయి. అందం, అభినయం, నృత్యం అన్నింటికంటే మించి అత్యద్భుతమైన వ్యక్తిత్వం శ్రీదేవికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అశేష అభిమానగణాన్ని సొంతం చేసుకునేలా చేసింది.
- దాదాపు 15 ఫిల్మ్‌ఫేర్ అవార్డులతోపాటు లెక్కలేనని పురస్కారాల్ని సొంతం చేసుకున్న శ్రీదేవి నిజాయితీగా ఉండటమే తనని ఈ స్థాయికి తీసుకొచ్చిందని పలు సందర్భాల్లో చెప్పారు. ఓ లక్ష్యంతో ముందుకెళ్తున్న టైంలో పెళ్ళి చేసుకున్న తర్వాత చాలామంది మహిళలు రిలాక్స్ అవుతున్నారు. రిలాక్స్ అవ్వకుండా కుటుంబ జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తే విజయం తథ్యమంటారు శ్రీదేవి. పాజిటివ్‌గా ఆలోచించడం, పాజిటివ్ దృక్పథంతో ఉండటమే తాను అందంగా ఉండటానికి కారణమని ఆమె చెప్పారు.
- 2013లో కేంద్రప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సముచితంగా గౌరవించింది. ప్రస్తుత సినిమా ధోరణి చాలా మారిందని, అప్పట్లో ఓ సినిమా విడుదలవుతోందనే విషయం సినిమా మ్యాగజైన్లలో చూస్తేనే తెలిసేదని, అలాంటిదిప్పుడు సినిమా ప్రారంభం నుంచి విడుదల వరకు, విడుదలైన తర్వాత కూడా ప్రమోషన్ చేయటం హర్షించదగ్గ పరిణామమని శ్రీదేవి కితాబిచ్చారు. 2012లో బాలీవుడ్ చిత్రం 'ఇంగ్లీష్ వింగ్లీష్' చిత్రంతో రీ ఎంట్రీ ఇచ్చారు. రీ ఎంట్రీ విషయాన్ని శ్రీదేవి ఖండించారు. ఓ నటికి రీ ఎంట్రీ అనేది ఎప్పుడూ ఉండదు. నా ఉద్దేశ్యంలో ఇది రీ ఎంట్రీ కాదు.. ఆరంభం మాత్రమే అని చాలా స్ట్రాంగ్‌గా చెప్పారు. విజయ్ నటించిన 'పులి' చిత్రంలో శ్రీదేవి ఓ కీలక పాత్రలో నటించారు. ఆ తర్వాత 'మామ్' చిత్రంలో మరోసారి తన నట విశ్వరూపాన్ని చూపించారు. షారూఖ్‌ఖాన్ హీరోగా త్వరలో విడుదలకానున్న 'జీరో' చిత్రంలో శ్రీదేవి అతిథి పాత్ర పోషించారు. ఇదే ఆమె చివరి చిత్రం.



చిన్ననాటి శ్రీదేవి


తనయలు జాహ్నవి, ఖుషీలతో శ్రీదేవి

## విశేష ఆదరణ పొందిన తెలుగు చిత్రాలు

**తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో అత్యధిక చిత్రాల్లో శ్రీదేవి నటించింది. తన నటనతో ఆయా భాషా ప్రేక్షకుల మనసుకు దగ్గరైంది. ముఖ్యంగా తెలుగులో నటించిన చిత్రాలు ఆమె కెరీర్‌లో మైలురాళ్లుగా నిలిచాయి. 'పదహారేళ్ళ వయసు', 'బుర్రిపాలెం బుల్లోడు', 'కార్తీక దీపం', 'వేటగాడు', 'చుట్టాలొస్తున్నారు జాగ్రత్త', 'రౌడీ రాముడు కొంటె కృష్ణుడు', 'సర్దార్ పాపారాయుడు', 'గజదొంగ', 'మోసగాడు', 'ఆకలి రాజ్యం', 'గడసరి అత్త సొగసరి కోడలు', 'గురుశిష్యులు', 'కొండవీటి సింహం', 'ప్రేమాభిషేకం', 'రాణి కాసుల రంగమ్మ', 'ఇల్లాలు', 'సత్యం శివం', 'త్రిశూలం', 'అనురాగ దేవత', 'బొబ్బిలి పులి', 'జస్టిస్ చౌదరి', 'కలవారి సంసారం', 'కృష్ణార్జునులు', 'కృష్ణవతారం', 'వయ్యాల భామలు వగలమారి భర్తలు', 'అడవి సింహాలు', 'కిరాయి కోటిగాడు', 'ముందడుగు', 'రామరాజ్యంలో భీమరాజు', 'రాముడు కాదు కృష్ణుడు', 'శ్రీరంగనీతులు', 'ఊరంతా సంక్రాంతి', 'తేనే మనసులు' 'కంచు కాగడ', 'పచ్చని కాపురం', 'వజ్రాయుధం', 'ఒక రాధ ఇద్దరు కృష్ణులు', 'జయం మనదే', 'ఆఖరి పోరాటం', 'జగదేక వీరుడు అతిలోక సుందరి', 'క్షణక్షణం', 'గోవిందా గోవిందా' వంటి తదితర చిత్రాలు శ్రీదేవి నట విశ్వరూపానికి ప్రతీకగా నిలిచాయి.**

## ప్రముఖుల సంతాపాలు..

విశేష అభిమానగణాన్ని సొంతం చేసుకున్న శ్రీదేవి మరణం పట్ల పలు చిత్ర పరిశ్రమ ప్రముఖులు తెలిపిన సంతాపాలు.

చిన్నప్పట్నుంచి శ్రీదేవి నాకు తెలుసు. తెలుగులో అత్యధికంగా 31 చిత్రాల్లో మేమిద్దరం కలిసి నటించాం. చిన్న వయసులోనే ఆమె మరణించడం చాలా బాధగా ఉంది. గొప్ప నటిని మనమంతా కోల్పోయాం - **కృష్ణ**

ఇగో లేని వ్యక్తి శ్రీదేవి, ఎంతో సోషల్‌గా, స్పోర్టీవ్‌గా ఉండేది. షూటింగ్ సమయంలో అందరితోనూ ఎంతో సరదాగా ఉండేది. ఇప్పుడిప్పుడే ఆమె పిల్లలు పైకొస్తున్నారు. తన పిల్లల భవిష్యత్ చూడకుండానే శ్రీదేవి చనిపోవడం చాలా బాధాకరం - **కృష్ణంరాజు**

శ్రీదేవి చనిపోయారని తెలిసి చాలా షాకయ్యాను. ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. ఓ మంచి స్నేహితురాలిని కోల్పోయాను. యావత్ చిత్ర పరిశ్రమ గొప్ప నటిని కోల్పోయింది. శ్రీదేవి కుటుంబం ఎంత బాధపడుతుందో నేనూ అంతే బాధపడుతున్నాను. - **రజనీకాంత్**

టీనేజ్ నుంచి గొప్ప నటిగా ఎదిగిన శ్రీదేవిని నేను ప్రత్యక్షంగా చూశాను. స్టార్‌డమ్‌కు ఆమె అర్హురాలు. ఆమె చనిపోయిందని తెలియగానే ఆఖరిసారి నేను శ్రీదేవిని కలిసిన జ్ఞాపకాలన్నీ ఒక్కసారిగా నా కళ్ళు ముందు మెదిలాయి. 'సద్మా' చిత్రంలోని శ్రీదేవి పాడిన లాలిపాట ఇంకా వినపడుతూనే ఉంది. మనం శ్రీదేవిని చాలా మిస్సవుతున్నాం - **కమల్‌హాసన్**

యావత్ భారతదేశం ఓ గొప్ప లెంజెడ్‌ని కోల్పోయింది. ఓ మంచి స్నేహితురాలిని కోల్పోయినందుకు నా మనసెంతో బాధగా ఉంది - **అమితాబ్ బచ్చన్**

అందం, అభినయం కలబోసిన అత్యద్భుత నటి శ్రీదేవి. ఇలాంటి నటి ఇంతవరకు లేదు. ఇకమీద వస్తారని కూడా నేను అనుకోవడం లేదు. నటనపై తన అంకిత భావాన్ని తెరమీద చూపింది. ఆమె అంకిత భావాన్ని చూసి నేనెంతో నేర్చుకున్నాను. మా ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన అత్యద్భుత దృశ్యకావ్యం 'జగదేక వీరుడు అతిలోక సుందరి'. మా చివరి సినిమా 'ఎస్.పి.పరశురాం'. కోట్ల మంది ప్రేక్షకుల హృదయాలను తన నటనతో ఆకట్టుకున్న శ్రీదేవి చనిపోయిందని నేను అనుకోవట్లేదు. ఎప్పటికీ ప్రేక్షకుల హృదయాల్లో శ్రీదేవి చిరస్థాయిగా జీవించే ఉంటారు. ఈ సినిమా ప్రపంచం ఉన్నంత వరకు శ్రీదేవి జీవించే ఉంటుంది - **చిరంజీవి**

నాన్నగారు (ఎన్టీఆర్)తో శ్రీదేవిగారు చాలా సినిమాల్లో నటించారు. ఎలాంటి భావాన్నైనా కళ్ళతోనే పలికించగల మహానటి ఆమె - **బాలకృష్ణ**

శ్రీదేవి ఇకలేరనే వార్త విని షాకయ్యాను. చిన్న వయసులోనే ఆమె ఎంతో సాధించింది. చిత్ర పరిశ్రమలో భాగమవుదాం అనుకునే ప్రతి ఒక్కరికీ ఆమె స్ఫూర్తిగా నిలుస్తుంది. 'క్షణ క్షణం' చిత్రంలో ఆమెతో కలిసి నటించాను. ఆమె ప్రతి ఎక్స్‌ప్రెషన్‌ని ఇప్పటికీ మరవలేను - **వెంకటేష్**

శ్రీదేవి మరణ వార్తను ఓ చెడ్డ కలగా భావిస్తున్నాను. ఆమె జ్ఞాపకాలెప్పటికీ పదిలంగానే ఉంటాయి. ఎలా స్పందించాలో తెలియని పరిస్థితిలో ఉన్నా - **నాగార్జున**

శ్రీదేవి లేరనే మాట నమ్మలేనిది. కానీ ఆమె వెండితెరపై పోషించిన భిన్నమైన పాత్రలన్నీ చిరస్మరణీయాలే. బాలనటిగా, కథానాయికగా దక్షిణ భారత సినీ రంగంలో అద్భుత విజయాలు అందుకున్న శ్రీదేవి అదే స్థాయిలో బాలీవుడ్ ప్రేక్షకుల అభిమానాన్ని పొందారు. 'బడి పంతులు' సినిమాలో బాలనటిగా 'బూచాడమ్మ బూచాడు' అనే పాటలో కళ్ళతో అటూ ఇటూ తిప్పుతూ పలికించిన హావభావాల్ని ప్రేక్షకులు మరచిపోలేరు. అన్నయ్యతో 'జగదేక వీరుడు అతిలోక సుందరి'లో దేవకన్య ఇంద్రజగా కనిపించిన తీరు, 'మానవా..' అంటూ చెప్పే సంభాషణలు కూడా అందరూ గుర్తు చేసుకునేవే. అమాయకత్వంతో పలికించే నటన మరచిపోలేనిది. చివరిగా నటించిన 'ఇంగ్లీష్ వింగ్లీష్', 'మామ్' చిత్రాల్లో తన శైలిని ఈ తరానికి చూపించారు. పెద్దకుమార్తెని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్న తరుణంలో ఆమె ఈ లోకాన్ని వీడటం చాలా బాధాకరం - **పవన్‌కళ్యాణ్**

శ్రీదేవి మృతి నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆమె నటనకు, స్వభావానికి నేను పెద్ద అభిమానిని. లక్షలాది మంది అభిమానుల్లో ఒకడిగా నేను నివాళ్ళర్పిస్తున్నాను. ప్రేమ, గౌరవంతో మిమ్మల్ని ఎప్పుడూ గుర్తు పెట్టుకునే ఉంటాం మామ్ - **అమీర్‌ఖాన్**

ప్రపంచ వ్యాప్తంగా కొన్ని కోట్ల మంది అభిమానులను సంపాదించుకున్న ఏకైక నటి శ్రీదేవి. ఎంతమంది సూపర్‌స్టార్స్ పక్కన నటించినా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం ఒక్క శ్రీదేవికే చెల్లింది. అమెలా బాలనటిగా వచ్చి, ఇంత స్థాయికి ఎవరూ ఎదగలేదు. భర్త బోనీకపూర్‌కు ఇతనే నా తొలి హీరో (పదహారేళ్ళ వయసు) అని పరిచయం చేసింది. నేను ఆమె పక్కన నటించినందుకు గర్వపడేవాడిని - **చంద్రమోహన్**

శ్రీదేవి చనిపోయారని తెలిసి షాకయ్యాను. అస్సలు ఊహించలేదు. ఆమె నటనతో చాలా మందిని ప్రభావింతం చేశారు. అద్భుతమైన నటి. చిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది - **హేమామాలిని**

శ్రీదేవి మరణించారనే వార్తతో నేను చాలా డిస్టబ్ అయ్యాను. ఒక అద్భుత నటితోపాటు గొప్ప వ్యక్తిత్వం ఉన్న మహిళను కోల్పోయాం. నా ఫేవరేట్ నటి ఇంత త్వరగా దివికేగుతుందని ఊహించలేదు - **మహేష్**

అత్యద్భుతమైన గొప్ప నటి శ్రీదేవి. శ్రీదేవి మ్యాజికల్ శకం ఎప్పటికీ చిరస్థాయిగా గుర్తుండిపోతుంది - **ప్రభాస్**

వచ్చారు. చూశారు. గెలిచారు. స్వర్గం నుంచి వచ్చారు. అక్కడికే తిరిగి వెళ్ళిపోయారు - **ఎన్టీఆర్**

ఓ గొప్ప ఐకానిక్ నటిని కోల్పోయాం. శ్రీదేవి ఇక లేరనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను - **అల్లు అర్జున్**

శ్రీదేవితో కలిసి చాలా సినిమాల్లో నటించాను. భారతీయ చిత్ర పరిశ్రమ మంచి నటిని మాత్రమే కాదు ఓ ఉన్నతమైన వ్యక్తిని కూడా కోల్పోయింది. అద్భుత నటనతో ప్రేక్షకుల మనసుపై చెరగని ముద్ర వేసింది - **మోహన్‌బాబు**

బాలనటి నుంచి మహానటి వరకు నాతో ప్రయాణం చేసిన శ్రీదేవి హఠాన్మరణం అత్యంత బాధాకరం. జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు శ్రీదేవి అధిరోహించని మైలు రాయి లేదంటే అతిశయోక్తి లేదు. ఆమె మరణం భారతీయ చిత్ర పరిశ్రమకు తీరని లోటు - **కె.రాఘవేంద్రరావు**

నమ్మలేకపోతున్నాను. దాదాపుగా నాలుగు దశాబ్దాలుగా మా కుటుంబానికి ఎంతో సన్నిహితురాలు. ఆమె మరణం భారతీయ చలన పరిశ్రమకు తీరని లోటు. బాలీవుడ్‌లో యశ్‌చోప్రా రూపొందించిన 'చాందిని', 'లమ్హే' చిత్రాలు శ్రీదేవి నట జీవితానికి ఎంతో వన్నె తెచ్చాయి. ఆమె కీర్తిని దశ, దిశలా చాటాయి - **టి.సుబ్బరామిరెడ్డి**



# టీఆర్టీ రెండోరోజు ప్రశాంతం

## ఎస్జీటీకి పలు కేంద్రాల్లో వందశాతం హాజరు

- ఉదయం, మధ్యాహ్నం 97 శాతం నుంచి 99 శాతం హాజరు
- గడియారాల్లేక పలు కేంద్రాల్లో అభ్యర్థుల అవస్థలు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తెలంగాణలో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) రాతపరీక్షలు రెండోరోజు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. రికార్డు స్థాయిలో పలు కేంద్రాల్లో అభ్యర్థులు వందశాతం హాజరుకావడం విశేషం. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఆవిర్భవించిన తర్వాత అభ్యర్థులు వందశాతం పరీక్షలు రాయడం మంచి పరిణామం. జాగృతి డిగ్రీ కాలేజీ, ఎంఏఎం ప్రభుత్వ మోడల్ జూనియర్ కాలేజీ, సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ, ఎవిఎన్ ఇన్‌స్టిట్యూట్, స్ఫూర్తి ఇంజినీరింగ్ కాలేజీ, వివేకానంద ఇన్‌స్టిట్యూట్ వంటి కేంద్రాల్లో వందశాతం హాజరు నమోదైంది. సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) పరీక్ష ఆఫ్‌లైన్‌లో ఓఎంఆర్ ఆధారంగా ఆదివారం జరిగింది. ఆదివారం హెచ్ఎండీఏ పరిధిలో 86 పరీక్షా కేంద్రాల్లో ఎస్జీటీ (తెలుగు మీడియం) రాతపరీక్ష నిర్వహించారు. ఉదయం 55,974 మంది దరఖాస్తు చేయగా, 53,435 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఉదయం పరీక్షకు 97 శాతం, మధ్యాహ్నం రాతపరీక్షకు 99 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో 20,145 మంది దరఖాస్తు చేస్తే, 18,497 (91.9 శాతం) మంది, రంగారెడ్డి జిల్లాలో 17,128 మంది దరఖాస్తు చేయగా, 16,738 (97.8 శాతం) మంది, మేడ్చల్ జిల్లా పరిధిలో 18,701 మంది దరఖాస్తు చేస్తే, 18,200 (97.4 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం ఎస్జీటీ (ఇంగ్లీష్ మీడియం) రాతపరీక్ష హెచ్ఎండీఏ పరిధిలో 38 కేంద్రాల్లో జరిగిందని తెలిపారు. హైదరాబాద్‌లో 10,932 మంది దరఖాస్తు చేస్తే, 10,668 (97.18 శాతం) మంది, రంగారెడ్డి జిల్లాలో 8,703 మంది దరఖాస్తు చేయగా, 8,630 (99.16 శాతం) మంది, మేడ్చల్ పరిధిలో 9,571 మంది దరఖాస్తు చేస్తే, 9,321 (97.38 శాతం) మంది హాజరయ్యారని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీలో కమాండ్ కంట్రోల్ ద్వారా పరీక్షలను పర్యవేక్షించామని తెలిపారు.

**సమయం తెలియక సతమతం**

ఆఫ్‌లైన్‌లో నిర్వహించిన ఎస్జీటీ రాతపరీక్షల్లో కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. కొన్ని పరీక్షా కేంద్రాల్లో గడియారాలు అందుబాటులో లేకపోవడంతో అభ్యర్థులు అవస్థలు పడ్డారు. సమయం తెలియకపోవడంతో సతమతమయ్యారు. చేతిగడియారాలతో పరీక్షా కేంద్రాల్లోకి రావడానికి అభ్యర్థులకు అనుమతి లేదు. కానీ పరీక్షా కేంద్రాల్లో ఉన్న అన్ని రూముల్లోనూ గోడ గడియారాలుండేలా చర్యలు తీసుకోవడంలో టీఎస్‌పీఎస్సీ విఫలమైందన్న ఆరోపణలు అభ్యర్థుల నుంచి వినిపిస్తున్నాయి. కొన్ని పరీక్షా కేంద్రాల్లో చివరిగా 30నిమిషాల సమయం ఉన్నా కేవలం 10నిమిషాలే ఉందని ఇన్విజిలేటర్లు ప్రకటించడంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. ప్రశ్నలు చదవకుండానే జవాబులు నింపాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇన్విజిలేటర్లకు సరైన శిక్షణ ఇవ్వలేదని పలువురు అభ్యర్థులు ఆరోపణలు చేశారు. ఇన్విజిలేటర్ల తప్పిదాలకు తాము నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం జరిగిన ఎస్జీటీ తెలుగు ప్రశ్నాపత్రంలో, మధ్యాహ్నం జరిగిన ఎస్జీటీ ఇంగ్లీష్ ప్రశ్నాపత్రంలోనూ పది నుంచి 15 వరకు ప్రశ్నలు ఒకటే రావడం పట్ల అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంకోవైపు సైకాలజీకి సంబంధించి 40ప్రశ్నలు రావాల్సిన ఉన్నా 12వరకే వచ్చాయని అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. ప్రశ్నాపత్రంలో సైకాలజీ, ఇతర సిలబస్ ప్రశ్నలు వరుస క్రమంలో కాకుండా జంబ్లింగ్‌గా రావడం పట్ల ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. గజిబిజిగా ప్రశ్నలు ఇవ్వడం వల్ల గందరగోళానికి గురయ్యామని కొందరు అభ్యర్థులు వాపోయారు.

**నేడు ఆన్‌లైన్‌లో స్కూల్ అసిస్టెంట్**

టీఆర్టీలో భాగంగా సోమవారం ఆన్‌లైన్‌లో స్కూల్ అసిస్టెంట్ రాతపరీక్షలు జరుగుతాయని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ తెలిపారు. సోమవారం ఉదయం స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్ సబ్జెక్టు) పరీక్ష హెచ్ఎండీఏ పరిధిలో 6,985 మంది అభ్యర్థులు హాజరవుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్, సోషల్ స్టడీస్) ఇంగ్లీష్ మీడియం పరీక్షకు 4,912 మంది రాస్తారని తెలిపారు. ఇందులో మ్యాథ్స్‌కు 2,519 మంది, సోషల్ స్టడీస్‌కు 2,393 మంది హాజరవుతారని పేర్కొన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు హెచ్ఎండీఏ పరిధిలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆన్‌లైన్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక స్క్వాడ్‌లు, పరిశీలకులను నియమించామని పేర్కొన్నారు.

## కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై సీఎం మాట్లాడాలి

- సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

సింగరేణిలో ఈనెల 27న పర్యటిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ అక్కడ పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై మాట్లాడాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (ఎస్‌సికెఎస్) కోరింది. ఈ మేరకు ఎస్‌సికెఎస్ అధ్యక్షులు ఎం సాయిబాబు, ప్రధాన కార్యదర్శి బి మధు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. బోనస్, కొలిండియా వేతనాలు అమలు చేయాలని తెలిపారు. క్యాటగిరీ ఆధారంగా వేతనాలు, ఖాళీ క్వార్టర్ల కేటాయింపు, సెలవులు వంటి కార్మిక చట్టాల అమలుకు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న రోడ్స్ అండ్ బిల్డింగ్ కనీస వేతనాలు జీవో (నెలకు రూ.13,630) విడుదల చేయాలని కోరారు.

సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల్లేరని సీఎం ప్రకటించడం అవాస్తవమని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనకు వస్తున్న కేసీఆర్ వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. సింగరేణిలో వివిధ విభాగాల్లో సుమారు 7 వేల మంది, ఓబి రిమూవల్, కోల్ ట్రాన్స్‌పోర్టులో మరో 10 వేల మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారని సమాచార హక్కు చట్టం కింద సింగరేణి యాజమానం ప్రకటించిందని పేర్కొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు పదేండ్లుగా బోనస్ చెల్లించడం లేదని తెలిపారు. కార్మికులు రూ.60 కోట్లు నష్టపోయారని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ పర్యటన సందర్భంగా సీఎం కేసీఆర్ స్పందించి కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కరించాలని, ఈ దిశగా యాజమాన్యానికి ఆదేశాలివ్వాలని కోరారు.

## ప్రజాస్వామ్య మూలసూత్రాలకు విరుద్ధం

- రైతు సమన్వయ కమిటీల ఏర్పాటుపై సీపీఐ విమర్శ



**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రైతు సమన్వయ కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య మూలసూత్రాలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. టీఆర్ఎస్ కార్యకర్తలే రైతు సమన్వయ నాయకులుగా చెలామణి కాబోతున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయంపట్ల అనుభవం లేని అంగన్‌వాడీ టీచర్లు, ఇతర వృత్తులలో ఉన్న వారిని జిల్లా రైతు సమన్వయ కమిటీ చైర్మెన్లు నియమించటం సిగ్గుచేటన్నారు. అధికారాన్ని రుద్దడానికి టీఆర్ఎస్ బరితెగింపునకు సమన్వయ కమిటీలే నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా గెలిచిన గుత్తా సుఖేందర్‌రెడ్డిని రైతు సమన్వయ కమిటీ అధ్యక్షునిగా ఎన్నిక చేయడం పార్టీ ఫిరాయింపులకు పరాకాష్ట అన్నారు. రైతులకు నాలుగు విడతలలో లక్ష రూపాయల రుణమాఫీ చేసిన ప్రభుత్వం, ఇప్పటి వరకు వడ్డీ చెల్లించకపోవడమంటే రైతులను మోసం చేసినట్టు కాదా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఒంటెద్దు పోకడలు మాని, ప్రజాస్వామ్యబద్ధంగా పని చేయాలని సూచించారు.

# ఎస్సీ వర్గీకరణ కోసం మార్చి 13న తెలంగాణ బంద్

**నవతెలంగాణ-సిద్దిపేట రూరల్**

ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మార్చి 13న తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చినట్టు ఎమ్ఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చెప్పారు. ఆదివారం సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా ఎంఆర్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. అనంతరం విలేకర్లతో మాట్లాడు తూ..డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ లలో 15శాతం పొందాల్సిన మాదిగ, మాదిగ ఉప కులాలకు మూడు శాతం రిజర్వేషన్లు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. ఇప్పటికీ చదువుల్లో, ఉద్యోగాల్లో వారికి అన్యాయం జరుగుతోందన్నారు. సీంఎ కేసీఆర్ అసెంబ్లీలో వర్గీకరణకు తీర్మానం చేసి, వర్గీకరణ చేయాలని ప్రధాని మోడీని కలిసి చెప్పి రెండడుగులు ముందుకు వేశారన్నారు. అఖిలపక్షం నాయకులతో ఢిల్లీకి వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు మాదిగల ఓట్లు దండుకుని నమ్మక ద్రోహం చేశారని ఆరోపించారు. మార్చి 13న జరిగే రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు జెరిపోతుల లత, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి జంగయ్య, జాతీయ నాయకులు పెద్దమాతరి బాబుమాదిగ, మాసాయి పేట యాదగిరి, కష్ణంరాజు, విద్యార్థి సంఘం నాయకులు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యను పరిష్కరించాలి : సీపీఐ(ఎం)

ఎస్సీ వర్గీకరణ కోసం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీస్ ఇచ్చిన మార్చి 13 తెలంగాణ రాష్ట్ర బంద్‌కు సీపీఐ(ఎం) మద్దతు ప్రకటించింది. ఆదివారం ఈమేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్గీకరణ కోసం రాష్ట్ర అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ నేతలు హామీ ఇచ్చారన్నారు.

కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళతామని ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు స్వయంగా ప్రకటించి సంవత్సరం గడుస్తున్నా అమలు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు.



**బంద్‌కు మద్దతివ్వండి : తమ్మినేనికి మందకృష్ణ విజ్ఞప్తి**

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మార్చి 13న నిర్వహించతలపెట్టిన తెలంగాణ బంద్‌కు మద్దతివ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తమ్మినేనిని కలిసి లేఖ అందజేశారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో బీజేపీ ప్రభుత్వం మాదిగలకు నమ్మక ద్రోహం చేసిందన్నారు. పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టకుండా బీజేపీ ప్రభుత్వం దోపిడీదారులకు వత్తాసు పలుకుతున్నదని విమర్శించారు. మద్దతుపై తమ్మినేని సానుకూలంగా స్పందించారని మంద కృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# బుద్ధి తెచ్చుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

చేకూరే విధంగా చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. అన్ని రంగాలకు 24 గంటల కరెంటు అందుబాటులో ఉండి తీరుతుందని పునరుద్ఘాటించారు. ఇక నుంచి ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించే బాధ్యత రైతు సమన్వయ సమితులు తీసుకోవాలని కోరారు. రైతులు పండించిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర అందకపోతే రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. రైతు సమన్వయ సమితులు నేరుగా కొనుగోలు చేస్తాయని చెప్పారు. సుమారు రూ. 6 నుంచి 7వ వేల కోట్లు రైతు సమన్వయ సమితులకు బడ్జెట్‌లో కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రైతు సమన్వయ సమితుల ఏర్పాటుతో స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ప్రతిపక్షాలు చెప్పడంలో వాస్తవం లేదన్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి సమితుల సభ్యులకు అంచెలంచెలుగా శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, కోట్ల రూపాయలు ఖర్చయినా ఫర్వాలేదు, వారిని ఇజ్రాయిల్‌కు పంపిస్తామని, అక్కడి వ్యవసాయ పరిస్థితులపై అవగాహణ కల్పిస్తామని చెప్పారు.

వాచ్‌డాగ్‌లా పని చేయాలి

రైతు సమన్వయ సమితుల సభ్యులు 1.61వేల మంది ఉన్నారని, వీరందరూ రైతుల సంక్షేమం కోసం వాచ్‌డాగ్‌లా పని చేయాలని సీఎం కేసీఆర్ కోరారు. పైరవీలకు తావుండదని, రాజకీయ పోస్టు కాదు గనుక పవిత్ర పాత్ర పోషిస్తున్నట్టు ఫీలవ్వాలన్నారు. నకిలీ విత్తనాల, ఎరువులు, పురుగు మందులను అరికట్టాలని, రైతులను సమన్వయపర్చే బాధ్యత రైతు సమన్వయ సమితులదేనని అన్నారు.

తేమ చూసే పరికరాలు కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధాన్యం ఒకేసారి మార్కెట్‌కు రాకుండా చూడాలన్నారు. భవిష్యత్తులో వ్యవసాయ కూలీలు దొరకరని, వ్యవసాయ యంత్ర పరికరాల వివరాలు సేకరించాలని, అవసరమైతే కొత్త పరికరాలు కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు లంచాలు తీసుకోకుండా పని చేసేలా చూడాలన్నారు. రైతు చనిపోతే వెంటనే అతని పేరు మీదున్న భూమి వివరాలు తక్షణమే అతని భార్య పేరుమీద మార్పిడి జరగాలన్నారు. రిజిస్ట్రేషన్ అధికారులు, ఎమ్మార్వోలు నిర్లక్ష్యం వహిస్తే రోజుకు రూ. 1000 చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. సమితుల ఏర్పాటుకు స్థలాలు, విరాళాలు ప్రకటించిన పలువురికి సీఎం సన్మానం చేశారు.

రైతు సమన్వయ సమితి అధ్యక్షులుగా గుత్తా సుఖేందర్‌రెడ్డి

రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షులుగా గుత్తా సుఖేందర్‌రెడ్డిని నియమిస్తున్నట్టు మ సీఎం కేసీఆర్ ప్రకటించారు. అనుభవం కలిగిన ఆయన సేవలు రైతు సంఘానికి ఉపయోగపడతాయని చెప్పారు. మదర్ డెయిరీ నిర్వహణలో అపారమైన అనుభవం ఉందని, స్వయంగా వ్యవసాయం చేసే రైతు కనుక ఈ బాధ్యతలు అప్పగించామన్నారు. వారం రోజుల్లో కార్యాలయం, సిబ్బందితోపాటు ఐఏఎస్ అధికారి ఎండీగా ఉంటారని చెప్పారు. త్వరలో కాల్‌సెంటర్ నెంబరు కూడా ప్రకటిస్తారని తెలిపారు. ఈ సదస్సులో వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శి సి. పార్థసారధి, కమిషనర్ ఎం. జగన్‌మోహన్‌తోపాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మెన్లు, రైతులు, రైతు సమన్వయ సమితుల సభ్యులు పాల్గొన్నారు.

# బహుజనుల రాజ్యమొచ్చేదాక ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

బీఎల్ఎఫ్ ప్రధాన ఎజెండా అన్నారు. రెండు పడకల గదులకు స్థలాలు, దళితులకు మూడెకరాల పంపిణీ కోసం భూములు లేవంటున్న పాలకులు పారిశ్రామిక వేత్తలకు వందలెకరాలు ఎలా కట్టబెడు తున్నారని ప్రశ్నించారు. బీఎల్ఎఫ్ అధికారంలోకి వస్తే కేసీఆర్ హామీనిచ్చిన రెండుపడకల గదులు, మూడెకరాల సాగుభూమి పంపిణీ చేసి చూపెడతామన్నారు. అందరికీ ఉచిత విద్య, ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడుతామన్నారు. కుటుంబ వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేస్తున్న మద్యం ఊసే లేకుండా చేస్తామని హామీనిచ్చారు. కేరళ వామపక్ష ప్రభుత్వమే బీఎల్ఎఫ్‌కు ఆదర్శమన్నారు.

రాష్ట్ర కన్వీనర్ తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ నలుగురి చేతిలో తెలంగాణ బందీగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను గద్దె దించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణలోని 3కోట్ల 65లక్షల మంది బాగుపడితేనే నిజమైన అభివృద్ధి అని అన్నారు. ఉండడానికి ఇల్లు, సాగుకు భూమి, మెరుగైన వైద్యం, నాణ్యమైన విద్య ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అందకుండా సామాజిక న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఉద్యమ నేపథ్యమున్న సీఎం కేసీఆర్ ఉద్యమాలంటేనే దడుసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలన వల్లే నేడు దేశానికి, రాష్ట్రానికి ఈ దుస్థితి పట్టిందన్నారు. ప్రాజెక్టుల పేరుతో కోట్ల రూపాయలు దండుకున్న విషయం, టూజీ, త్రీజీ వంటి కుంభకోణాలు చేసి అవినీతికి కాంగ్రెస్ మారుపేరుగా నిలిచిందన్నారు. వచ్చే ఎన్నికల్లో 119సీట్లకు పోటీ చేసి బహుజన తెలంగాణ సాధించేందుకు బాటలు వేస్తామన్నారు. తాము అధికారంలోకి వస్తే ముఖ్యంగా విద్య, వైద్య రంగాలను కార్పొరేట్ చేతుల్లో నుంచి సర్కారులోకి తీసుకొస్తామని హామీనిచ్చారు. రైతులకు కంటితుడుపుగా పెట్టుబడి కోసం రూ.4వేలు ఇవ్వడం బాగానే ఉన్నా..గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తా మన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగం, మార్కెట్‌లో మధ్యదళారి వ్యవస్థను పూర్తిగా అరికడుతామన్నారు. వ్యవ సాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారానే నిరు ద్యోగుల సమస్య తీరుతుందన్నారు. రాష్ట్ర వైస్ చైర్మెన్ జలజం సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడకముందే సామాజిక తెలంగాణ కావాలని ఆనాడే కోరామని, ముందే ఈ ఎజెండా పెడితే తెలంగాణ ఏర్పాటు ఆలస్యమవుతుందని చెప్పడంతో కాస్తా వెనక్కితగ్గినట్టు చెప్పారు. ఇప్పటికీ నాలుగేండ్లయినా సామాజిక న్యాయం గురించి కేసీఆర్ మాట్లాడకపోవడంతో బీఎల్ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో ఫ్రంట్ కన్వీనర్ మజిదుల్లా ఖాన్, వైస్ చైర్మెన్ పటేల్ వనజ, నాయకులు శ్రీనివాస్ బహదూర్, జయప్రకాశ్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మెన్ రవికుమార్, మహబూబ్‌నగర్ క్లబ్ కార్యదర్శి జయరాములు, విజ్ఞానవంతుల ఫోరం కార్యదర్శి గులాంగౌస్, జోగిని వ్యతిరేక సంఘం నాయకులు హాజమ్మ, నాయకులు జి రాములు, కిల్లె గోపాల్, జాన్‌వెస్లీ, సాగర్, వెంకట్రాములు, ధర్మానాయక్, జెబి.రాజు, ఎ.రాములు, జబ్బార్, పర్వతాలు, వెంకటస్వామి, అశోక్, రాయికంటి రాందాస్‌తో పాటు 30 ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రోజుకు 8 గంటలు వారానికి 48 గంటలు

(మొదటిపేజీ తరువాయి)

రెండేండ్ల వరకే పరిమితం. ఆతర్వాత ఈ కార్మికులంతా వారానికి 35గంటల పని విధానానికి వెళ్తారు. జర్మనీలో ప్రస్తుతం అన్ని రాష్ట్రాల్లోనూ 35 గంటల పని అమలులో ఉన్నది. జర్మనీలోని అన్ని రంగాల కార్మికులకు భారత్‌లో వలె వారానికి ఓ రోజు సెలవుతోపాటు జాతీయ సెలవు దినాలు అమలులో ఉన్నాయి. పని గంటల తగ్గింపు ద్వారా కుటుంబంతో ఎక్కువ సమయం గడిపేందుకు కార్మికులు ఆసక్తి చూపుతున్నారు. అందుకోసం వారు తమ వేతనాల్లో కోత విధించుకునేందుకూ సిద్ధమయ్యారు. ఒప్పందం కుదుర్చుకున్న కార్మికులకు వేతనం పెరుగుదలలో 6.8 శాతం కోత పడనున్నది. గతేడాది జర్మనీ ఆర్థిక వృద్ధిరేట్ అనూహ్యంగా పెరగడం, నిరుద్యోగిత తగ్గడంతో కార్మికుల డిమాండ్ పట్ల సానుకూలత వ్యక్తమైంది. మరోవైపు కార్మికులకు పని గంటలు తగ్గించినమేరకు ఆయా కంపెనీలు నిరుద్యోగులను ఒప్పంద కార్మికులుగా నియమించుకొని తమ ఉత్పత్తులను యథాతథంగా కొనసాగించుకునే వీలు కల్పించారు.

ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే భారత్‌లో కార్మికుల పని గంటలు అత్యధికంగా ఉండటం గమనార్హం. ఇండియాలో వారానికి 48 గంటల పని విధానం అమలులో ఉన్నా సగటున 52 గంటలు పని చేస్తున్నారని, చైనాలో 48 గంటలు, బ్రిటన్,ఆస్ట్రేలియాల్లో 41 గంటలు, అమెరికాలో 40 గంటలు, యూరప్ దేశాల్లో 35 గంటలు పని చేస్తున్నారని మేన్‌పవర్ గ్రూప్ సర్వే వెల్లడించింది. ఇండియాలోని(ప్రయివేట్) వేతన జీవుల్లో ఎక్కువ గంటలు పని చేయడం ద్వారా ఎక్కువ సంపద, సౌఖ్యాలకు అవకాశముంటుందన్న భావన ఉన్నట్టుగా పరిశీలకులు చెబుతున్నారు. పని గంటల తగ్గింపు కోసం ఉద్యమాలు చేయగల చైతన్యం ఇండియాలో ఇంకా వేళ్లూనుకోలేదని వారు విశ్లేషిస్తున్నారు. ఎక్కువ పని గంటల ద్వారా ఉత్పత్తిని పెంచుకోవచ్చునన్న పారిశ్రామికవేత్తల అభిప్రాయం కూడా తప్పని నిపుణులు చెబుతున్నారు. 35 గంటల పని అమలులో ఉన్న జర్మనీలో ఉత్పత్తి రేట్ 40 గంటల పని అమలులో ఉన్న అమెరికా కన్నా అధికంగా ఉండటాన్ని వారు గుర్తు చేశారు. పని గంటలను తగ్గించి కుటుంబ, సామాజిక కార్యక్రమాల కోసం అవకాశం కల్పించినపుడు కార్మికులు ఆరోగ్యంగా ఉండి ఉత్సాహంగా పని చేస్తారని పలు అధ్యయనాల్లో వెల్లడైంది.

ఓ శతాబ్దం క్రితం అమెరికా ఆరోగ్యశాఖ నిర్వహించిన సర్వేలో పని గంటలు అధికంగా ఉన్న సందర్భాల్లోనే ప్రమాదాలు ఎక్కువగా జరిగాయని తేలింది. ఆరో గంట నుంచి 10వ గంట పని మధ్యనే ఆయా పరిశ్రమల్లో ప్రమాదాలు అధికంగా జరిగినట్టు ఆ సర్వేలో వెల్లడైంది. 1920లో అమెరికాలోని పరిశ్రమల్లో 76,000 ప్రమాదాలు జరగగా 20 లక్షలమంది చనిపోయారు. సాంకేతికంగా అభివృద్ధి చెందిన దశలో సృజనాత్మక పని విధానంలో భాగంగా పని గంటల తగ్గింపుపై పునరాలోచన చేయడం సరైందేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# బోనాల సొమ్ము బొక్కేశారు!

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే నిధుల పంపిణీ జరగాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయా దేవాలయాలకు రంగులు వేయడం, ఫ్లోరింగ్, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం, ఇతర చిన్న చిన్న మరమ్మతుల కోసం ఈ నిధుల్ని ఆయా ఆలయ కమిటీలకు ఇవ్వాలని పేర్కొన్నారు. ఇక్కడే ఓ మంత్రిగారి బంధువైన కార్పొరేటర్ అతి చొరవను ప్రదర్శించి, చక్రం తిప్పి, నిధుల్ని గోల్‌మాల్ చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. గతంలో రూ.5వేలు ఇచ్చిన ఆలయాలకు ఆయన ఆధ్వర్యంలో రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఇష్టం వచ్చినట్టు చెక్కుల్ని ఇచ్చేశారు. చిన్న చిన్న దేవాలయాల స్థానంలో ఇతర పెద్ద దేవాలయాల ఫోటోలను పెట్టి ఈ నిధుల్ని కొల్లగొట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయి పరిశీలన చేసి, వాస్తవానికి ఎంత సొమ్ము అవసరమౌతుందో లెక్క తేల్చాల్సిన దేవాదాయశాఖ అధికారులు సదరు ప్రజాప్రతినిధితో కలిసి వాటాలు పంచేసుకున్నట్టు తెలిసింది. అప్పటి వరకు ఉనికిలో కూడా లేని అనేక చిన్న ఆలయాల పేరుతో భారీగా నిధులను డ్రా చేసినట్టు సమాచారం. ఆలయ కమిటీల్లో సదరు ప్రజాప్రతినిధి బినామీలే ఎక్కువగా ఉన్నట్టు తెలిసింది. ఓ ఆలయ కమిటీలో అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి, మరో ఆలయ కమిటీలో ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, మరొకచోట ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఒకే వ్యక్తి పలు కమిటీల్లో ఉన్నట్టు తేలిందని సమాచారం. బాగ్‌లింగంపల్లి బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై అప్పటివరకు ఉనికిలోనే లేని ఓ చిన్న దేవాలయానికి రెండేండ్లుగా రంగులు వేయడం, ఆలయం సైజును పెంచి నిర్మాణాలు చేపట్టి, బ్రిడ్జిపై ఫుట్‌పాత్‌ను పూర్తిగా ఆక్రమించారు. హఠాత్తుగా ఇక్కడ ఆలయం ఏర్పడటం చూసిన కొందరు స్థానికులు విషయాన్ని ఆరా తీస్తే..ఈ ఆలయం పేరుపై మూడేండ్లలో రూ.1.50 లక్షలు డ్రా చేసినట్టు తెలిసింది. ఈ తరహాలో అసలు ఉనికిలోనే లేని అనేక ఆలయాల పేర్లపై బినామీ కమిటీలను ఏర్పాటు చేసి నిధుల్ని గోల్‌మాల్ చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితారాణాకు ఉప్పందటంతో 2017 బోనాల నిర్వహణకోసం పెట్టిన ఖర్చులపై యుటిలిటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని దేవాదాయ శాఖ అధికారులకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడిన సదరు ప్రజాప్రతినిధి, దేవాదాయశాఖ అధికారులు తాజాగా ఐదు రోజుల క్రితం ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసి...2015, 2016, 2017లో ఇచ్చిన చెక్కుల మొత్తాన్ని దేనికి వినియోగించారో లెక్కలు ఇవ్వమని ఆలయ కమిటీలను కోరారు. కలెక్టర్ 2017 సంవత్సర లెక్కలు మాత్రమే అడిగితే...దేవాదాయశాఖ అధికారులు అంతకుముందు రెండేండ్ల లెక్కల్ని కూడా ఇవ్వమని అడగడం గమనార్హం. ఇప్పుడు కొందరు అధికారులు, సదరు ప్రజాప్రతినిధికి చెందిన వ్యక్తులు బోగస్ బిల్లుల్ని సృష్టించే పనిలో బిజీగా ఉన్నట్టు తెలుస్తోంది. ఏవో ఒక లెక్కలు రాసివ్వండి అని సదరు దేవాదాయ శాఖ అధికారులే ఆలయ కమిటీలను కోరడం పలు అనుమానాలకు తావిస్తోంది. 2017లో ప్రభుత్వం బోనాలు నిర్వహణకు రూ.10 కోట్ల నిధుల్ని కేటాయిస్తే...కలెక్టర్ రూ.7 కోట్ల వరకే మంజూరీలు ఇచ్చినట్టు సమాచారం. మిగిలిన రూ.3 కోట్లకు కూడా ఆలయ కమిటీల పేరుతో ఇచ్చిన జాబితాపై అనుమానంతో ఆమె వాటిని నిలుపుదల చేసినట్టు తెలిసింది.

ఆ జాబితాలో దాదాపు 150 ఆలయ కమిటీల పేర్లు ఉన్నట్టు సమాచారం. లేని దేవాలయాల పేరుపై కూడా నిధుల్ని డ్రా చేసినట్టు దేవాదాయశాఖలో దుమారం రేగుతోంది. 2015, 2016ల్లో ప్రభుత్వం ఆలయాలకు ఇచ్చిన రూ.8.15 కోట్ల నిధులకు ఎలాంటి లెక్కలు లేవు. వాటిని ఎవరికి ఇచ్చారు..ఎందుకోసం ఖర్చు చేశారో కూడా వివరణ లేదు. 2017లో రూ.10 కోట్లు కేటాయించినా కలెక్టర్ యోగితారాణా కేవలం రూ.7 కోట్ల వరకే మంజూరీలు ఇచ్చి, ఇప్పుడు యుటిలిటీ సర్టిఫికెట్లు ఇవ్వమని కోరడంతో ఈ బండారం బయటపడింది.

**అక్రమాలు జరిగితే మా దృష్టికి తీసుకురండి**
**ఎమ్ రామకృష్ణారావు, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్**

బోనాల నిర్వహణ నిధుల విడుదల విషయంలో ఎక్కడైనా అక్రమాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎమ్ రామకృష్ణారావు కోరారు. పై అంశాలపై 'నవతెలంగాణ' ఆయన వివరణను కోరింది. కలెక్టర్ షోకాజ్ నోటీసు ఇచ్చిన మాట వాస్తవమేనని చెప్పారు. ఇది రొటీన్‌గా జరిగేదే తప్ప ఎలాంటి ప్రత్యేకత లేదని అన్నారు.

**ముందుచూపుతోనే మూండేండ్ల యూసీలు అడిగాం**
**ఏ బాలాజీ, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ (హైదరాబాద్)**

కలెక్టర్ 2017 సంవత్సర యుటిలిటీ సర్టిఫికెట్లు మాత్రమే అడిగిన మాట వాస్తవం. షోకాజ్ నోటీసులో అదే పేర్కొన్నారు. అయితే భవిష్యత్‌లో 2015, 2016 లెక్కల్ని కూడా ఎవరైనా అడుగుతారేమోనని, వాటిని కూడా ఇమ్మని ఆలయ కమిటీలను కోరాం. నిధుల కేటాయింపులో కొంతమేర ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు ఉన్నమాట వాస్తవం. అయితే ఎక్కడా అక్రమాలు జరిగినట్టు మా దృష్టికి రాలేదు. మా పరిధిలో ముగ్గురు ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నారు. వారు క్షేత్రస్థాయి పరిశీలన చేసి, సర్టిఫై చేశాకే...మేం చెక్కులు ఇచ్చాం.

## శ్రీదేవి కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

ఆమె నివాసం వద్దకు చేరుకున్నారు. సోమవారం సందర్శకుల కోసం ఆమె నివాసంలోనే ఉంచుతారు. ఆ తర్వాత అంత్యక్రియలు జరుపుతారు.

**సినీ పరిశ్రమ ప్రముఖ నటిని కోల్పోయింది: ప్రధాని మోడీ**

ప్రముఖ నటి శ్రీదేవి మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. తన సంతాప సందేశాన్ని ట్వీట్ చేశారు. "శ్రీదేవి అకాల మృతి విచారాన్ని కలిగిస్తోంది. సినీ పరిశ్రమ ఒక ప్రముఖ నటిని కోల్పోయి ంది. సినీ నటిగా ఆమె సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విభిన్నమైన పాత్రలు పోషించి, అద్భుతమైన నటనా తీరును ప్రదర్శించారు. ఎన్నో గుర్తుండుపోయే పాత్రలలో జీవించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను" అని మోడీ ట్వీట్ చేశారు.

**దిగ్భ్రాంతికి గురయ్యా.రాహుల్ గాంధీ**

కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ తన సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శ్రీదేవి మృతి వార్త దిగ్భ్రాంతికి గురిచేసింది. శ్రీదేవి అద్భుత ప్రతిభావంతురాలైన బహుముఖ నటి అని పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలన్నారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఒక తరానికి చెందిన అత్యంత ప్రజాదరణ కలిగిన నటి శ్రీదేవి అకాల మృతి విచారంగా ఉంది. ఆమె కుటుంబానికి, పరిశ్రమలోని సహచరులకు, అభిమానులకు సంతాప సానుభూతి అని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి స్మృతి ఇరానీ సంతాప సందేశాన్ని ట్వీట్ చేశారు. నటనకు ఆమె గొప్ప నిర్వచనమని, ఆమె ఆకస్మిక మృతి కలచి వేసిందని పేర్కొన్నారు. ఆమె మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**సినీ పరిశ్రమకు వెలితి: సీఎం కేసీఆర్ విచారం**

ప్రముఖ సినీ నటి శ్రీదేవి మరణం పట్ల ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు విచారం వ్యక్తం చేశారు. ఆమె మరణం భారతీయ సినీ పరిశ్రమకు, తెలుగు సినిమా అభిమానులకు ఎంతో వెలితిని మిగిలిస్తుందన్నారు. పలు సినిమాల్లో ఆమె పోషించిన అద్భుతమైన పాత్రలు శ్రీదేవిని చిరస్మరణీయంగా ఉంచు తాయని తెలిపారు. తెలుగు, హిందీతో పాటు పలు భారతీయ భాషల సినిమాల్లో నటించిన శ్రీదేవి తన అందం, నటన, నృత్యాలతో ఎందరో అభిమానులను సంపాదిం చుకున్నారని కొనియాడారు. ఇంకా సినిమాల్లో నటిస్తూనే తక్కువ వయస్సులోనే ఆమె మరణించడం బాధాకరమన్నారు. శ్రీదేవి కుటుంబ సభ్యులకు సీఎం తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీ బండారు దత్తాత్రేయ, టీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణ సంతాపం తెలిపారు.

## చేతబడి నెపంతో దాడి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న బూడిదను తీసుకెళ్లేందుకు మంచిర్యాలకు చెందిన ముగ్గురు మహిళలు ఆటోలో వచ్చారు. బూడిద సంచిలో వేసుకుని వెళ్తుండగా మృతురాలు లక్ష్మి కుటుంబ సభ్యులు వారిని అడ్డుకున్నారు. ఇంకా కర్మఖాండలకు సంబంధించి కార్యక్రమాలేవీ చేయలేదని, అప్పుడే బూడిద ఎలా తీసుకెళ్తున్నారని ప్రశ్నించారు. చేతబడి చేసేందుకే బూడిద తీసుకెళ్తున్నారని అనుమానించి ముగ్గురు మహిళలతో పాటు ఆటో డ్రైవర్‌పై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కలిసి దాడిచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. వారు తమది మంచిర్యాల అని, బతుకుదెరువుకోసం ఈ పనిచేస్తామని తెలిపినట్టు పోలీసులు చెప్పారు. తమకు మంత్రాలు, చేతబడులేవీ రావని, ఎంత చెప్పినా వినకుండా తమపై దాడిచేశారని వారు వాపోయారు.

## రుస్తుం-2 డ్రోన్ పరీక్ష విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

సైంటిస్టుల ఆధ్వర్యంలో దీనిని ప్రయోగించారు. అత్యధిక ఇంజిన్ పవర్ అమరిక కల్గిన మొదటి వాహనం కావడంతో రుస్తూం-2 ప్రాముఖ్యత సంతరించుకుందని, రుస్తూం పరీక్ష విజయవంతమైందని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఇది సింథటిక్ అపేర్చర్ రాడర్, ఎలక్ట్రానిక్ ఇంటలిజెన్స్ సిస్టమ్ వంటి పేలోడ్లను మోసుకెళ్లే సామర్థ్యాన్ని కలిగివుందని అధికారులు తెలిపారు. త్రివిధ దళాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని 1500 కోట్ల రూపాయలతో మానవరహిత వైమానిక వాహన(యూఏవీ) ప్రాజెక్టును ప్రారంభించారు. డీఆర్‌డీవో విభాగం ఏడీఈ, హిందుస్థాన్ ఏరోనాటిక్ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌లు సంయుక్తంగా ఈ ప్రాజెక్టును రూపొందించి అభివృద్ధి చేశాయి.

## పాఠశాలల మూసివేత వద్దు: ఎస్‌టీయూ

**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలను మూసివేస్తే చూస్తూ ఊరుకోబోమని ఎస్‌టీయూటీఎస్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. మూసివేత ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేసింది. ఆదివారం హైదరాబాద్‌లో ఎస్‌టీయూ రాష్ట్ర కమిటీ సమావేశం ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భుజంగరావు, జి సదానందంగౌడ్ మాట్లాడుతూ...వేసవి సెలవుల్లో బదిలీ, పదోన్నతులు షెడ్యూల్ పూర్తి చేయాలని, లేకపోతే ఆందోళన బాట తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల వార్షికోత్సవాలు నిర్వహించాలని మొక్కుబడి ఉత్తర్వులిస్తే సరిపోదనీ, డిప్యూటీసీఎం కడియం శ్రీహరి హామీ మేరకు పాఠశాలలకు సరిపడ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| సెన్సెక్స్ ▲322 34,142 | నిఫ్టీ ▲108 10,491 | డాలరుకు రూపాయి విలువ 64.71 | బంగారం(10.గ్రా) రూ. 31,240 | వెండి (కేజీ) రూ. 41,600 | కోడిగుడ్లు |

శుక్రవారం మార్కెట్లు ముగింపు నాటికి

| కోడిగుడ్లు | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 368 | విజయవాడ | 374 |
| ఒక్కగుడ్డుకు | 4.30 | చెన్నై | 397 |
| వరంగల్ | 370 | ముంబయి | 410 |

## కేంద్రం పై సుప్రీంలో పెరిగిన కేసులు

- నోట్లరద్దు, జీఎస్టీ తదితర అంశాల పై..
- గతేడాదిలో 4,229 కేసులు
- కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ వెల్లడి



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వాన్ని కక్షిదారుగా చేస్తూ సుప్రీంకోర్టులో గతేడాది చాలా కేసులు నమోదయ్యాయని కేంద్రన్యాయమంత్రిత్వ శాఖ వెల్లడించింది. నోట్లరద్దు, జీఎస్టీ అమలు, పన్ను సమస్యల పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఇలాంటి కేసులు ఎక్కువగా నమోదయ్యాయని న్యాయమంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు. గతేడాది జనవరి1 నుంచి డిసెంబర్ 31 మధ్య కేంద్రం పై 4,229 కేసులు సుప్రీంలో నమోదయ్యాయని న్యాయమంత్రిత్వ శాఖ పేర్కొంది. 2016లో కేంద్రం పై నమోదైన కేసుల సంఖ్య 3,497గా ఉండగా, 2015లో 3,909గా ఉంది. ఈ ఏడాది జనవరి1 నుంచి ఫిబ్రవరి 22 మధ్య కేంద్రం పై 859 కేసులు భారత అత్యున్నత న్యాయస్థానంలో నమోదయ్యాయి. 2012లో కేంద్రం పై నమోదైన కేసుల సంఖ్య 4,149, కాగా 2013లో 4,772 గా ఉంది.

అయితే సుప్రీంకోర్టులో కేసులు పేరుకుపోవడానికి న్యాయాధికారుల కొరతే ప్రధాన కారణమని అధికారవర్గాలు అంటున్నాయి. ఓ వైపు కేసుల సంఖ్య పెరుగుతుండగా, సుప్రీంలో కేంద్రానికి ప్రాతినిధ్యం వహించే న్యాయాధికారుల సంఖ్య తగ్గిపోయింది. వచ్చే వారానికి ఈ సంఖ్య 10కి చేరనుంది. అయినప్పటికీ తదుపరి సొలిసిటర్ జనరల్ ఎవరనేది తేలలేదు. అయితే అదనపు సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ)గా అమన్ లేఖి, మాధ్వి దివాన్, సందీప్ సేథీ, బిక్రంజిత్ బెనర్జీ పేర్లను సిఫారసు చేస్తూ న్యాయమంత్రిత్వ శాఖ పంపిన ఫైలు ప్రధాని కార్యాలయాన్ని చేరింది. ఎంపికలో తుది నిర్ణయాన్ని మాత్రం అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ క్యాబినెట్ తీసుకోనుంది. గతేడాది అక్టోబర్‌లో సొలిసిటర్ జనరల్ పదవికి రంజిత్ కుమార్ రాజీనామా చేసిన తర్వాత ఆ స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలన్న దానిపై న్యాయమంత్రిత్వ శాఖ వద్ద సమాధానం లేదు. గతేడాది జులైలో పదవీ విరమణానంతరం పీఎస్ పట్వాలి, ఎన్‌కె కౌల్‌లు రెండోసారి ఏఎస్‌జీగా పదవి చేపట్టారు. సుప్రీంకోర్టులో ప్రస్తుతం అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్‌తో పాటు ఐదుగురు ఏఎస్‌జీలు కేంద్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తగిన సంఖ్యలో న్యాయాధికారులు లేనందున సున్నితమైన కేసులను న్యాయమంత్రిత్వ శాఖ ప్యానెల్‌లో ఉండే సీనియర్ న్యాయవాదులకు అప్పగించాలని న్యాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

# పదివేలకోట్లకు ప్రతిష్టంభన..!

## నిలిచిన 70 శాతం మేర ఐజీఎస్టీ రిఫండ్ నిధులు • క్లెయిమ్ చేయటంతో తప్పిదాలు : సీబీఈసీ



**న్యూఢిల్లీ:** కొత్త పథకాలను ప్రవేశపెట్టి అన్నివర్గాలను మోడీ సర్కారు గందరగోళంలోకి నెట్టి కోట్లు వెనకేసుకుంటున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పథకాలపై అవగాహన లోపాలను ఆసరాగాచేసుకుని ఖజానా నుంచి కాసులు విదిల్చటంలేదు.తాజాగా ఇంటిగ్రేటెడ్‌గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్(ఐజీఎస్టీ)పై ఎగుమతిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల కారణంగా.. కేంద్రం వద్ద 70 శాతం నిధులు నిలిచిపోయాయి.ఈ నిధులు పదివేల కోట్ల మేర ఉన్నట్టు సమాచారం. రిఫండ్ క్లెయిమ్ చేసుకోవటంలో అవగాహన లేకపోవటం వల్ల.. ఈ ప్రతిష్టంభన ఏర్పడిందనట్టు సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సీబీఈసీ) అధికారవర్గాలు అంటున్నాయి. వచ్చే నెలలో ఫైనల్ రిటర్న్ పూర్తి వివరాలు సమర్పిస్తే..మార్చినాటికి ఆ నిధులు పొందటానికి వీలవుతుందని కేంద్రం అంటున్నది.

సీబీఈసీ వివరాల ప్రకారం.అక్టోబర్ నుంచి నాలుగునెలల వ్యవధిలో 4వేల కోట్లు మేర రిఫండ్‌కు మంజూరు చేసింది. ఇప్పటికీ సుమారు పదివేల కోట్ల మేర నిధులను ఎక్స్‌పోర్టర్లు క్లెయిమ్ చేసుకోలేదన్న విషయాన్ని వెల్లడించింది.

జీఎస్టీఆర్ 1 ఫైలింగ్,టేబుల్ 6ఏ,జీఎస్టీఆర్3 బీ ఫారాలను నింపి కస్టమ్స్ విభాగాలకు ఎక్స్‌పోర్టర్లు సమర్పించారు.వీటితోపాటు షాపింగ్ బిల్లులను కూడా జతపర్చారు. అయితే శాఖాపరమైన జీఎస్టీ మార్పుల కారణంగా..ఎక్స్‌పోర్టర్లు పూర్తి వివరాలు అందించలేకపోతున్నారు. ఫలితంగా వారు రిఫండ్ నిధులను సకాలంలో.. క్లెయిమ్ చేసుకోలేకపోయారు.

**ఈమెయిల్‌లో ఎక్స్‌పోర్టర్ల విన్నపం**

2017 అక్టోబర్ తర్వాత క్లెయిమ్ డేటా ఎనాలిసిస్ ప్రకారం..రిటర్న్ ఫైలింగ్ జరిగే పొరపాట్లు తగ్గుముఖం పట్టాయని కేంద్రం చెబుతున్నది. అయినా పెద్దసంఖ్యలో ఎక్స్‌పోర్టర్లు జీఎస్టీఆర్1,టేబుల్ 6 ఏ బిల్లులను సమర్పిస్తున్నారని సమాచారం.వీటిలో షాపింగ్ బిల్లు నంబరు,ఆయా పోర్టుల నుంచి ఎగుమతి అయిన తేదీలు ఉండటంలేదు..ఈ విధమైన అభ్యంతరాలతో ఆయా నెలల్లో జీఎస్టీఆర్ 1,టేబుల్ 9లో పూర్తి వివరాలు ఉండటంలేదు. ఇలా అసంపూర్తిగా ఉన్న ఫైల్స్ వల్ల కస్టమ్స్ శాఖ ప్రాసెస్ విధానంలో అడ్డుపడుతున్నాయని ఎక్స్‌పోర్టర్లు ఈ మెయిల్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారు.

### 2017 అక్టోబర్ నుంచి ఐజీఎస్టీ రిఫండ్..


ఉత్పత్తి చేసిన సామాన్లపై చెల్లించే ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ(ఐజీఎస్టీ)రిఫండ్‌ను చెల్లింపులను 2017 అక్టోబర్ నెల నుంచి సీబీఈసీ మొదలుపెట్టింది.రిఫండ్ క్లెయిమ్ చేయాలంటే షాపింగ్ బిల్లు ఆధారంగా టేబుల్6ఏ ఫారాన్ని నింపాల్సి ఉంటుంది.దాంతో జీరో రేటెడ్ సప్లయ్‌నా..లేక ఇన్‌పుట్ క్రెడిట్‌నా అనేది ఫారం ఆర్‌ఎఫ్‌డీ..01ఏ నింపాలి.

### జీఎస్టీకన్నా అధికంగా క్లెయిమ్‌లు...

జీఎస్టీఎన్ డేటా ఎనాలిసిస్ ప్రకారం..ఎక్స్‌పోర్టర్లు రిఫండ్ క్లెయిమ్ చేసుకోవటంలో..చెల్లించిన జీఎస్టీ కన్నా ఎక్కువ ఉన్నట్టు గుర్తించామని అధికారులు అంటున్నారు. వీటితోపాటు ఎక్స్‌పోర్టర్లు ఫైల్‌చేసిన వాటిలో జీఎస్టీఎన్ నుంచి కస్టమ్స్ విభాగానికి పంపటంలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్స్‌పోర్టర్లు ఈ మెయిల్ పంపి రికార్డులు సరిచేయమని కోరుతున్న సంఖ్యపెరుగు తున్నదని అధికారులు చెబుతున్నారు.

## స్టీవ్‌జాబ్స్ ఉద్యోగ దరఖాస్తు వేలం

- తప్పులతడకగా ఉన్న సీవీకి 32లక్షలు వస్తాయని అంచనా




**వాషింగ్టన్ :** పెద్ద పెద్ద కంపెనీలకు బాస్‌లుగా పనిచేసే వారంతా..నిష్ణాతులా.! వారు దరఖాస్తులోనూ తప్పులతడకగా ఉంటుందా..అంటే అవుననే చెప్పవచ్చు.యాపిల్ సంస్థ సహ వ్యవస్థాపకులు స్టీవ్ జాబ్స్ చిన్నప్పుడు ఓ ఉద్యోగం కోసం పెట్టుకున్న దరఖాస్తు(సీవీ) ఇప్పుడు వేలానికి వచ్చింది. తప్పుల తడకగా ఉన్న ఈ సీవీ.. వేలంలో దాదాపు 50వేల అమెరికన్ డాలర్లు(సుమారు రూ.32లక్షలు) తెచ్చిపెడుతుందని నిర్వాహకులు అంచనా.1973లో స్టీవ్ జాబ్స్ ఈ సీవీని రూపొందించారు. టెక్నాలజీ రంగంలో పనిచేయడం తన అభిలాష అని అందులో ప్రస్తావించారు. కేవలం ఒక్క పేజీ ఉన్న ఈ సీవీలో అక్షర దోషాలు ఉన్నాయి. ఇందులో స్టివెన్ జాబ్స్'గా ఆయన పేరు ఉంది. ఇక అడ్రస్.. రీడ్ కాలేజ్‌గా పేర్కొన్నారు. ఆయన 18ఏండ్ల వయసులో ఉన్నప్పుడు ఈ సీవీని పంపించారట. అయితే ఏ స్థాయి ఉద్యోగం కోసం తాను దరఖాస్తు చేసేది ఇందులో ప్రస్తావించలేదు.

బోస్టన్‌కు చెందిన ఆర్‌ఆర్ యాక్షన్ హౌస్‌లో వచ్చే నెలలో దీని వేలం వేయనున్నారు. మార్చి 8 నుంచి బిడ్డింగ్‌లను ఆహ్వానించనున్నారు. ఈ దరఖాస్తు పంపిన మూడేండ్ల తర్వాత(1976) జాబ్స్.. స్టీవ్ ఓజనైక్‌తో కలిసి యాపిల్ సంస్థను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ కంపెనీ ప్రపంచంలోనే అత్యంత విలువైన సంస్థగా అగ్రస్థానంలో ఉంది. క్యాన్సర్ కారణంగా జాబ్స్ 56వ ఏట(2011) కన్నుమూసిన విషయం విదితమే.

## బ్యాంకుల ప్రయివేటీకరణ..కుదరదు

### రాజకీయ సంఘర్షణతో కూడిన వ్యవహారం :అరుణ్‌జైట్లీ



**న్యూఢిల్లీ :** బ్యాంకుల ప్రయివేటీకరణ సాధ్యపడదని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. వివిధ రాజకీయ కారణాల రీత్యా అలా కుదరదని వ్యాఖ్యానించారు. గ్లోబల్ బిజినెస్ సమిట్‌లో ఆయన మాట్లాడుతూ. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం తర్వాత.. చాలామంది బ్యాంకుల ప్రయివేటీకరణ గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. దీని కోసం బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టాలను సవరించాల్సి ఉంటుందని వివరించారు. 'నా ఉద్దేశం ప్రకారం ఈ విషయంలో రాజకీయ ఏకాభిప్రాయం సాధ్యపడదు. ఇది చాలా కష్టతరమైన నిర్ణయమ'ని అన్నారు.ఫిక్కి అధ్యక్షుడు రాకేశ్ షా,అసోచామ్ పారిశ్రామిక వర్గాలు ప్రభుత్వరంగ బ్యాంకుల్ని 50 శాతానికి కుదిస్తే స్టాక్ హెూల్టర్స్,డిపాజిట్‌దారులకు పారదర్శకత పెరుగుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన విషయం విదితమే.

## ప్రజల్లోకి వెళ్లినప్పుడే శాశ్వత గుర్తింపు

### తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మెన్ నందిని సిధారెడ్డి



**నవతెలంగాణ-కంఠేశ్వర్**

అవార్డులు గుర్తింపు కాదని, ప్రజల్లోకి వెళ్లినప్పుడే శాశ్వత గుర్తింపు వస్తుందని తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మెన్ నందిని సిధారెడ్డి అన్నారు. నిజామాబాద్ పట్టణంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో ఉన్న ఉమెన్స్ కాలేజీలో ఆదివారం ఇందూరు అపురూప అవార్డ్స్ 2017-18 ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిధారెడ్డి మాట్లాడుతూ అపురూప అవార్డుల పేరుతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అవార్డు తెచ్చుకోవడానికి చాలా ప్రయత్నాలు చేస్తున్నా అవి కేవలం కొయ్య బొమ్మలా గోడకు వేలాడుతుందని, రచనలతో నిజంగా అవార్డులను సంపాదిస్తే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. రచయిత్రి అమత లత మాట్లాడుతూ సాహిత్యానికి ఇతర లలిత కళలకు దూరమవుతున్న యువతరానికి వాటి పట్ల ఆసక్తి, అనురక్తి కలిగించాలని, వివిధ రంగాల్లో విశేష కషి చేసిన వారిని గౌరవించాలన్న ఉద్దేశంతో ఇందూరు అపురూప అవార్డులను నెలకొల్పినట్టు తెలిపారు. అనంతరం రైతుల పరిచయాలతో కూడిన అభినందన పుస్తకాన్ని నందిని సిధారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యుడు నారాయణ్‌రెడ్డి, రమాదేవి, కిరణ్, బాల, విజయలక్ష్మి, విజయ్ స్కూల్ కరెస్పాండెంట్ ప్రభాదేవి, ప్రిన్సిపాల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

- మత చందసవాదంపై ఐక్య పోరాటం
- జేవీవీ సదస్సులో ప్రొఫెసర్ కె నాగేశ్వర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె నాగేశ్వర్

**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

" రాజ్యాంగంపై విలువలేని వారు నేడు పాలకులుగా ఉన్నారు. లోపాలున్నాయనే పేరుతో రాజ్యాంగాన్నే మార్చాలని కుట్ర చేస్తున్నారు. ఇలాంటి వాదనలను ఐక్యంగా తిప్పికొట్టాలి..." అని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె నాగేశ్వర్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆవిర్భవించి 30వసంతాలు పూర్తి అయిన సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'స్పిరిట్ ఆఫ్ ఇంక్వైరీ-అప్‌హోల్డ్ క్వశ్చనింగ్' అనే అంశంపై ఆదివారం రెండో రోజు జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కె నాగేశ్వర్ మాట్లాడుతూ...వాజ్‌పేయ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఓ సందర్భంలో రాజ్యాంగం విఫలమైందని వ్యాఖ్యనిస్తే..రాజ్యాంగం విఫలం కాలేదనీ, దాన్ని అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని నాటి రాష్ట్రపతి కేఆర్ నారాయణ ధీటుగా సమాధానమిచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుత కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సైతం ఇటీవల ఇలాంటి వ్యాఖ్యలే చేశారని, సెక్యూలరిజం అనేది రాజ్యాంగంలో ముందు లేదని, 42వ సవరణ ద్వారా చేర్చామని చెబుతున్నారని తెలిపారు. కాబట్టి దానికి గౌరవం ఇవ్వాల్సిన అవసరం లేదన్నట్టుగా ఇప్పటి పాలకులు వ్యవహరిస్తున్నారని చెప్పారు. దీనిలో భాగంగా పత్రికల్లో ఇచ్చిన ప్రకటనల్లో ఆ పదం లేకుండా ఇచ్చారని అన్నారు. శాస్త్రీయ ఆలోచనలకు అడ్డుగా ఉన్న రాజ్యాంగాన్ని మార్చాలనే ప్రయత్నం జరుగుతుందన్నారు. అంబేద్కర్ 'లౌకికతత్వం' వాడొద్దని చెప్పారనే అసత్య ప్రచారం కూడా చేస్తున్నారని చెప్పారు. మన పోరాటం మతంపై కాదనీ, మత చాందసవాదంపై అని చెప్పారు. ఆదివాసీల ఆత్మగౌరవ పోరాట చిహ్నంగా ఉన్న సమ్మక్క, సారలమ్మలను పాలకులు దేవతలుగా మార్చారని చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం ప్రతి హాస్పిటల్స్‌లో జ్యోతిష్యుడిని నియమించారని, ఇలా ప్రజల్ని ఇంకా మూఢనమ్మకాల వైపు తీసుకుపోతున్నారని తెలిపారు. ప్రజల విశ్వాసాలకు రాజ్యాంగం అడ్డొస్తుందని ఇప్పటికీ కొందరు వాదిస్తున్నారని అన్నారు. అయితే చాలా మంది హిందుమతోన్మాదాన్ని వ్యతిరేకించినంతగా ఇస్లాం మతోన్మాదాన్ని వ్యతిరేకించడం లేదనీ ఈ రెండూ ప్రమాదమేని చెప్పారు. నడిరోడ్డుపై దేవుని ఆరాధన స్థలం నిర్మించడం వారిని అవమానిచడమేనని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందనీ, అయినా నేటికీ రోడ్లపైనే అనేక నిర్మాణాలు ఉన్నాయని అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద సోషల్‌మీడియా టీం మన ప్రధాని మోడీకి ఉందనీ, రాజ్యాంగం పట్ల విలువలను, మూఢవిశ్వాసాలకు వ్యతిరేక ప్రచారాన్ని సోషల్‌మీడియాలో జేవీవీ కార్యకర్తలు చేయాలని పిలుపునిచ్చారు. న్యూస్‌క్లిక్ చీఫ్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ మాట్లాడుతూ...ప్రపంచంలో ఎనర్జీ అవసరాలు వేగంగా పెరుగుతున్నాయనీ, ఫలితంగా కాలుష్యం పెరిగిపోతుందని అన్నారు. దీని ప్రత్యామ్నాయం ఏర్పాటు కోసం పారిస్ అగ్రిమెంట్‌లో చేసుకున్న ఒప్పందాన్ని అమెరికా తోసిపుచ్చిందని అన్నారు. నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హరతీ వాగేశన్ మాట్లాడుతూ...దేశంలో చరిత్ర వక్రీకరణ ఒక పద్ధతి ప్రకారం జరుగుతుందని అన్నారు. దీన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రొఫెసర్ రామ్‌కుమార్ 'వ్యవసాయం' అనే అంశంపై మాట్లాడారు.ఈ సదస్సులో జేవీవీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ ఆదినారాయణ, టి శ్రీనాథ్, నాయకులు డాక్టర్ అందె సత్యం, ప్రొఫెసర్ బీఎన్‌రెడ్డి, సర్వేశ్వర్‌రావు, కోయ వెంకటేశ్వర్‌రావు, రాజా, మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా " మూఢ విశ్వాసాల నిర్మూలనచట్టం తెలంగాణ ప్రభుత్వం చేయాలి" అనే నినాదంతో ఉన్న పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు.

## విద్యుత్ కొనుగోలులో రూ.కోట్ల స్కాం

- ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో రూ.వేల కోట్లు దుర్వినియోగం
- నిధుల దుర్వినియోగంపై బహిరంగ చర్చకు సిద్ధమా? : గద్వాల ఎమ్మెల్యే డికె.అరుణ



**నవతెలంగాణ-వీపనగండ్ల**

విద్యుత్ కొనుగోలులో రూ.కోట్ల స్కాం జరిగిందని గద్వాల ఎమ్మెల్యే డికె.అరుణ ఆరోపించారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించే కల్యాణ మండపం నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో అరుణ ప్రసంగించారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రూ.16500 కోట్ల మిగులు బడ్జెట్ ఉంటే రాష్ట్రం ఏర్పడ్డాక అప్పుల తెలంగాణగా మారిందని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి, కేఎల్‌ఐ ప్రాజెక్టుల్లో భారీగా అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో రూ.వేల కోట్లు దుర్వినియోగం చేశారని అన్నారు. వీటిపై చర్చించేందుకు మంత్రులు హరీశ్‌రావు, జూపల్లి కృష్ణారావు బహిరంగ చర్చకు సిద్ధమా ? అని సవాల్ విసిరారు. అబద్ధాలు చెప్పటంలో కేసీఆర్, హరీశ్‌రావులకు ఆస్కార్ అవార్డులు దక్కుతాయని అన్నారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సభలో కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బీరం హర్ష వర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ బీరయ్య, ఎంపీటీసీ మహేశ్వరమ్మ పాల్గొన్నారు.

# తీగలాగితే..

- రూ.1.14 కోట్ల స్వాహా వెలుగులోకి
- వయోజన విద్యాశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చేతివాటం
- వరంగల్‌లో దర్యాప్తుతో అవినీతి వెలుగులోకి..

**నవతెలంగాణ - సంగారెడ్డి ప్రతినిధి**

వరంగల్‌లో తీగలాగితే..మెదక్ జిల్లాలో సాక్షర భారత మిషన్‌లో 1.14 కోట్ల రూపాయల నిధుల స్వాహా విషయం వెలుగులోకి వచ్చింది. సాక్షర భారత్ విలేజ్ కోఆర్డినేటర్ల వేతనాల పేరుతో ఉమ్మడి మెదక్ జిల్లా వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ మరో ఇద్దరు అధికారులతో కలిసి చేతివాటం ప్రదర్శించి నిధులను కాజేసినట్టు తేలింది. ఈ విషయంలో ఇద్దరు అధికారులు, ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిపై సంగారెడ్డి పీఎస్‌లో కేసు నమోదైంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో నిరక్షరాస్యులైన వయోజనులకు అక్షర జ్ఞానం కలిగించేందుకు సాక్షర్ భారత్ మిషన్ కింద 2,388 మంది విలేజ్ కో ఆర్డినేటర్ల(వీసీఓ)ను నియమించారు. ఒకరికి నెలకు రూ.2వేల చొప్పున రూ.47.76లక్షలు వేతనంగా చెల్లించాలి. ప్రభుత్వం ఈ నిధులను ఐదారు నెలలకోసారి విడుదల చేసేది. 2014 ఏప్రిల్ నుంచి 2016 సెప్టెంబర్ వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో రూ.14.32కోట్లు విడుదలయ్యాయి. కోఆర్డినేటర్ల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా వేతనాన్ని వేసేవారు. అప్పటి అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి ఉమ(ప్రస్తుతం రిటైర్డ్ అయ్యారు), అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సహాయంతో ఖాళీగా ఉన్న వీసీఓల స్థానాల్లో పరిచయస్తుల ఖాతా వివరాలను డిప్యూటీ డైరెక్టర్ ఉషామార్త స్వర్ణలత నమోదు చేయించారు. వీసీఓలు సెలవుల్లో ఉన్న రోజులవి, అధ్యయన పర్యటనలు..ఇలా పలు రకాలుగా రికార్డులు సృష్టించారు. ఇలా రూ.కోటీ14లక్షలను తమ బంధువులు, స్నేహితుల వ్యక్తిగత ఖాతాల్లో వేయించుకుని స్వాహా చేశారు. కొందరి వీసీఓలకు ఒకే నెలకు రెండేసి సార్లు గౌరవ వేతనం జమచేసినట్టు సమాచారం.

**వరంగల్‌లో చేపట్టిన విచారణతో వెలుగులోకి...**

ఉషామార్త స్వర్ణలత ఉమ్మడి మెదక్ జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కాలంలోనే వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. అక్కడ కూడా అసలు వీసీఓలకు కాకుండా ఇతరుల పేర్లతో డబ్బులు డ్రా చేయడం ప్రారంభించారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న రాష్ట్ర అధికారులు జిల్లా కార్యాలయంలోని అధికారిని బాధ్యుడిని చేస్తూ విధుల నుంచి తొలగించారు. దీంతో ఆయన డీడీ స్వర్ణలత వ్యవహారంపై ఫిర్యాదు చేస్తూ కమిషనరేట్‌కు లేఖ రాశారు. దీనిపై స్పందించిన కమిషనర్ వరంగల్‌లో నిధుల దుర్వినియోగంలో డీడీ కీలక సూత్రధారిగా గుర్తించి సస్పెండ్ చేశారు. మెదక్ జిల్లాలోనూ దర్యాప్తు చేయించాలని కలెక్టర్‌కు లేఖ రాశారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు రూ.కోటీ 14 లక్షలు దుర్వినియోగం చేసినట్టు ఆడిట్‌లో తేల్చారు. ఈ సమయంలో రూ.21.8లక్షలను రికవరీ చేశారు. జిల్లాలో డబుల్ పేమెంట్ జరిగిన కొందరు వీసీఓలు కూడా అధికంగా వచ్చిన వేతనాలను తిరిగి జమ చేయిస్తున్నట్టు తెలుస్తోంది.

**సంగారెడ్డిలో కేసు నమోదు**

సాక్షర్ భారత్ నిధుల దుర్వినియోగం వాస్తవమేనని తేలడంతో కలెక్టర్ మాణిక్యరాజ్ కణ్ణన్ బాధ్యులపై కేసు నమోదు చేయాలని విద్యాశాఖ అధికారులకు ఫిబ్రవరి 21న లేఖ రాశారు.

లేఖకు స్పందిస్తూ వయోజన విద్యా శాఖ డీడీ రామేశ్వర్ 23న సంగారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు మేరకు ముగ్గురు అధికారులపై సెక్షన్ 420, 409 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల్లో ప్రధాన సూత్రధారి ఉషామార్త స్వర్ణలత వరంగల్ కేసులో గతేడాది సెప్టెంబర్12న సస్పెండ్ అయ్యారు. ఏపీఓ ఉమ ఈ ఏడాది జనవరి 31న ఉద్యోగ విరమణ పొందారు. ఆమె పెన్షన్ చెల్లింపులను ప్రస్తుతం నిలిపేశారు. అకౌంట్ విభాగంలో పనిచేసిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని ఈ విషయం వెలుగులోకి వచ్చిన నాటి నుంచి విధుల్లోకి రావడం లేదు.

## కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

### సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు


(ఫైల్)

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

వైద్య ఆరోగ్య రంగంలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. సాయిబాబు డిమాండ్ చేశారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం రాష్ట్ర అధ్యక్షులు కె. యాదానాయక్ అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ద్వారా 2001 నుంచి ఉద్యోగులు పని చేస్తున్నారని చెప్పారు. వీరందరినీ రెగ్యులర్ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యోగులకు గతంలో పిఆర్‌సి ప్రకారం వేతనాలు పెంచేదని, ఈ ప్రభుత్వం మాత్రమే పెంచకపోవడం సిగ్గుచేటన్నారు. 11వ పిఆర్‌సి ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.బలరామ్, ఉపాధ్యక్షులు భూపాల్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యదర్శి జె. వెంకటేశ్, యూనియన్ రాష్ట్ర నేతలు ఎండి ఫసియుద్దీన్, జె. సుధాకర్, కె. కవిత, సుగుణ, శ్రీనివాస్, వేణుగోపాల్, వైకుంఠం, ప్రమీల తదితరులున్నారు.



వదిలించుకునేందుకు నేడు దేశంలో భార్యలను కడతే రుస్తున్న ఘోరాలు చూస్తున్నాం. ఎంతోమంది అబలలు అదనపు కట్నం కోసం, అక్రమ సంబంధాలతో భర్త చేతిలో బలవుతున్న వార్తలు గుండెలు పిండేస్తున్నాయి. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేయాలి. ఇవన్నీ బీజేపీకి కానరావడం లేదు. రాజకీయ, మత కళ్లద్దాలు పెట్టుకొని తలాక్ సమస్యతో రాజకీయ లబ్ది పొందాలని చూస్తోంది. ము మ్మారు తలాక్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదిం చింది. ఒకే సిట్టింగులో ముమ్మారు తలాక్ చెప్పి భార్యను వదిలే యడం చట్ట విరుద్ధమని ఈ బిల్లు సూచిస్తుంది. ఈ బిల్లు ప్రకా రం అకస్మాత్తుగా భార్యకు ముమ్మారు తలాక్ చెప్పే పురుషులకు మూడేండ్ల జైలు శిక్ష, జరిమానా విధించనుంది. గతంలో ట్రిబుల్ తలాక్ అంశంపై సుప్రీం కోర్టు ముమ్మారు తలాక్‌ను కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించింది. మతపరమైన అంశాల్లో జోక్యం చేసుకునే ముందు ఆ మతానికి చెందిన పండితులతో, పెద్దలతో చర్చించి ఉండాల్సింది.

# తెగదెంపులైతేనే 'తలాక్'

ముహమ్మద్ ముజాహిద్

ప్రభుత్వాలు ప్రజారంజక పాలన అందించడంలో ఎందుకు విఫలమవుతాయో తెలుసా? ఆ రాజ్యంలోని, ఆ రాష్ట్రంలోని, ఆ దేశంలోని ప్రజా సమస్యలను పరిష్కరించ కుండా, అసలు సమస్యేగాని వాటిని తెరపైకి తీసుకొచ్చి పరిష్కా రం పేరుతో కాలయాపన చేయడం, ప్రజల దష్టిని మరల్చడం చేసినప్పుడు. సరిగ్గా దేశ పగ్గాలను చేపట్టిన నరేంద్రమోడీ ప్రభు త్వం ఇప్పుడు ఆ పనే చేస్తోంది. ప్రధానిగా తమ శక్తి సామర్థ్యాల ను ఇక్కడి ప్రజా సంక్షేమం, దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడం, నిరుద్యోగ సమస్యను పారదోలడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువచేయడం లాంటివాటి ఊసెత్తకుండా తలాక్ అస్త్రాన్ని తన రాజకీయ లబ్దికోసం వాడు కుంటోంది. నిరుద్యోగ సమస్య అంతకంతకూ పెరిగిపోతోంది. దేశ సంపద కేవలం కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమై ఉంది. బడా బాబులు బ్యాంకుల నుంచి కోట్లకు కోట్లు తీసుకుని విదేశాలకు పారిపోతు న్నారు. ఎన్నో కార్పొరేట్ కంపెనీలు తమ పన్నులను ఎగ్గొడుతు న్నాయి. వీటన్నింటినీ ప్రభుత్వం చాలా తేలిగ్గా కొట్టిపారేస్తోంది. అవి సమస్యలే కాదన్నట్టు చూస్తోంది. మతవిద్వేషాలను రెచ్చగొట్టి తమ ఓటు బ్యాంకును పదిలపర్చుకోవడంలోనే తల మునకలై ఉంటే ఈ ప్రభుత్వానికి ప్రజల సమస్యలు, బాగోగు లతో పనేముంది. నిత్యం అనవసర వివాదాలు సష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించి తను అనుకున్నది సాధించుకుంటున్నది. ఆ కోవలోనిదే 'ముస్లిం మహిళల రక్షణ' పేరుతో తెరపైకి తీసుకొచ్చిన తలాక్ బిల్లు.




వదిలించుకునేందుకు నేడు దేశంలో భార్యలను కడతే రుస్తున్న ఘోరాలు చూస్తున్నాం. ఎంతోమంది అబలలు అదనపు కట్నం కోసం, అక్రమ సంబంధాలతో భర్త చేతిలో బలవుతున్న వార్తలు గుండెలు పిండేస్తున్నాయి. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేయాలి. ఇవన్నీ బీజేపీకి కానరావడం లేదు. రాజకీయ, మత కళ్లద్దాలు పెట్టుకొని తలాక్ సమస్యతో రాజకీయ లబ్ది పొందాలని చూస్తోంది. ము మ్మారు తలాక్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదిం చింది. ఒకే సిట్టింగులో ముమ్మారు తలాక్ చెప్పి భార్యను వదిలే యడం చట్ట విరుద్ధమని ఈ బిల్లు సూచిస్తుంది. ఈ బిల్లు ప్రకా రం అకస్మాత్తుగా భార్యకు ముమ్మారు తలాక్ చెప్పే పురుషులకు మూడేండ్ల జైలు శిక్ష, జరిమానా విధించనుంది. గతంలో ట్రిబుల్ తలాక్ అంశంపై సుప్రీం కోర్టు ముమ్మారు తలాక్‌ను కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించింది. మతప రమైన అంశాల్లో జోక్యం చేసుకునే ముందు ఆ మతానికి చెందిన పండితులతో, పెద్దలతో చర్చించి ఉండాల్సింది. కానీ చర్చలు, సంప్రదింపులేమీ చేయకుండానే ట్రిబుల్ తలాక్ వ్యతిరేక బిల్లును సానబెట్టి లోక్ సభలో పాస్ చేసింది. ముమ్మారు తలాక్ ఏ రూపంలో ఉన్నా (మౌకి కంగా, రా తపూర్వకంగా, ఈమెయిల్, ఎస్ఎంఎస్, వాట్సాప్) చట్టవిరుద్ధం గానే పరిగణిస్తూ బిల్లును రూపొందించారు. ఈ బిల్లును ముస్లిం పర్సనల్ లా బోర్డు, ముస్లిం ఉలమాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా రు. న్యాయ నిపుణులు కూడా ఈ బిల్లును తీవ్రంగా ఖండి స్తున్నారు. వైవాహిక బంధమనేది అన్యోన్యంగా సాగేది. ఇష్టం లేని సంసారం చేయడం కన్నా విడిపోయి ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోవడం మంచిది. భార్యాభర్తలను బలవంతంగా కలిపి ఉంచడం ఎంతవరకు సమంజసం. తలాక్ వల్ల మహిళలు ఇష్టం లేని భర్తనుంచి విముక్తి పొందవచ్చు. వేరే పెండ్లి చేసుకుని హాయిగా సంసారం చేసుకోవచ్చు. పెండ్లి అనేది పవిత్రమైన బంధం. ఈ బంధంలో భార్యాభర్తలు ఒకరి కోసం ఒకరు బతకాలే కానీ ఒకరికి భారంగా మరొకరు బతకరాదు. ప్రభుత్వం రూపొందించిన చట్టం ప్రకారం తలాక్ ఇచ్చే పురుషుడికి మూడేండ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. ఇచ్చిన తలాక్ చెల్లదు. ప్రభుత్వం చెప్పినట్టు చెల్లదు అనుకోండి. మూడేండ్ల పాటు భర్త జైల్లో ఉంటే పెండ్లాం, పిల్లలు, తల్లదండ్రుల పోషణ ఎవరు చూసుకోవాలి. ఒక్కసారి తలాక్ ఇస్తే ఖురాన్ ప్రకారం ఆ ఇద్దరి బంధం విడిపోయినట్టే.

**ముస్లిమ్ పర్సనల్ లా చారిత్రక నేపథ్యం..**

మనదేశంలో స్వాతంత్ర్యం తరువాత నుంచే ముస్లిం కుటుంబ చట్టాలకు (ముస్లిం పర్సనల్‌లా)కు వ్యతిరేకంగా నిరసన గళాలు వినిపిం చడం మొదలయ్యాయి. షరియత్ చట్టాలను రద్దుచేసేందుకు కుట్రలు, కుతంత్రాలు అప్పటి నుంచే జరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో ఈ కుట్రలు చట్టరూపం దాల్చాయి. ముస్లింలు పాటించే కౌటుంబిక చట్టాలు ఖురాన్‌లోని అంతర్భాగమే. ముస్లిం షరీఅత్ చట్టాలను అల్లాహ్ ప్రసాదించిన చట్టాలుగా భావిస్తారు. ఇది వారి మత విశ్వాసం. భారతదేశంలో ముస్లింల పరిపానలో ఇస్లామ్ చట్టాలు పూర్తిగా అమలులో ఉండేవి. ముస్లింలు ఈ చట్టాలకనుగుణంగా నడు చుకునేవారు. దేశ పాలన ఆంగ్లేయుల చేతిలోకి వెళ్లిపోయాక చాపకింద నీరులా ఇస్లామ్ చట్టాల స్థానంలో బ్రిటీషు చట్టాలు అమల్లోకి వచ్చాయి. కుటుంబ చట్టాలో మార్పులు చేర్పులు చేసేందుకు కుట్రలు ప్రారంభించారు. ఈ విషయంలో ముస్లిం ఉలమాలు అప్రమత్తమయ్యారు. దీనికి వ్యతిరేకంగా గళం విప్పారు. వీరి ఈ కషి ఫలితమే 1937లో 'షరీఅత్ అప్లికేషన్ యాక్ట్' మంజూరైంది. ముస్లిం పర్సనల్‌లాలో ఉన్న 'షరీఅత్ యాక్ట్ ఏం చెబుతోందంటే కక్షిదారు ముస్లింలైన పక్షంలో నికాహ్, మహర్, తలాఖ్, ఖులా, మనోవర్తి, నికాహ్ రద్దు, విలాయత్, హిబా, విరాసత్, తదితర విషయాన్నింటిలో నిర్ణాయక శాసనం షరీఅత్ చట్టం ప్రకారమే ఉంటుంది. వారి ఆచార వ్యవహారాలు ఏమైనా కావచ్చు. షరీఅత్ చట్టం వారి ఆచార వ్యవహారాలపై పూర్తి అధికారం, ఆధికృత హక్కు కలిగి ఉంటుంది. మొత్తం వ్యవస్థ అంతా దీని పరిధిలోకే వచ్చేస్తుంది. దీనినే ప్రస్తుతం ముస్లిం పర్సనల్‌లాగా గుర్తిస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజ్యాంగం రూపొందించబడింది. రాజ్యాంగంలోని "ప్రాథమిక హక్కు'లో దేశ పౌరుందరికీ సమానంగా భావప్రకటనా స్వేచ్ఛ ఉంటుంది. తమకు నచ్చిన మతాన్ని స్వేచ్ఛగా స్వీకరించే, దాన్ని ప్రచారం చేసుకునే హక్కు వారికి ఉంటుంది. ఈ చట్టం ముస్లిం పర్సనల్ లాను పరిరక్షించే హామీని ఇస్తుంది. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లోని 44వ అధికరణ ప్రకారం ప్రభుత్వం కామన్ సివిల్ కోడ్‌ను అమలుపరిచే కషిచేస్తుంది' అనే విషయం విచారించదగ్గది. ఈ రెండు విషయాలు పరస్పరం విరుద్ధమైనవి, విభిన్నమైనవి. అందుకోసమే రాజ్యాంగ నిర్మాణంలోని పలువురు ముస్లిం సభ్యులు ఈ విషయంలో తీవ్రంగా విభేదించారు. అయినప్పటికీ కామన్ సివిల్‌కోడ్‌కు సంబంధించిన ఈ అధికరణ రాజ్యాంగంలో అలాగే ఉండిపోయింది. దీన్ని అడ్డుపెట్టుకునే అప్పుడప్పుడు ముస్లిం పర్సనల్‌లాను రద్దుచేసి కామన్ సివిల్‌కోడ్ అమలు చేయాలనే వ్యాఖ్యలు వినపడుతుంటాయి.

**కుటుంబ వ్యవస్థలో స్త్రీ పురుషుల హక్కులు, బాధ్యతలు**

ఇస్లామ్ స్త్రీ, పురుషులకు సమాన హక్కులు కల్పిస్తోంది. విద్యా, ఆర్థిక, సామాజిక, వారసత్వ హక్కులో పురుషుడితో సమా నంగా హక్కు ప్రసాదించింది. పాశ్చాత్య దేశాలలో అనేక ఉద్యమా లు, విప్లవాలు, నిరసనల తరువాతనే మహిళలకు హక్కులు లభించాయి. ఇరవైయ్యో శతాబ్దంలో అందిన ఈ హక్కు ఇస్లామ్ ధర్మం 1500 సంవత్సరాలకు పూర్వమే మగువకు సమాన హక్కు కల్పించింది. స్త్రీ, పురుషులకు సమాన హక్కు అంటే బాధ్యత విషయంలో సమానత్వం కాదు. ఇస్లామ్ ధర్మం ఈ విషయంలో స్త్రీ పురుషుల పరిధులను విభజించింది. వారి వారి సామర్థ్యాలకు అనుగుణంగా వారి వారి స్తోమతను, శక్తి సామ ర్థ్యాలను బట్టి పని విభజన చేసింది. మహిళకు పిల్లల పెంపకం, పోషణ, శిక్షణ, ఇంటి నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. మరో వైపు పురుషుడిపై తన ఇంటి భార్యాపిల్లల సంరక్షణ బాధ్యతను మోపింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, విభేదాలు పొడసూపి నప్పుడు వాటిని మొగ్గలోనే తుంచేయాలి. వారిరువురు వాటిని దూరం చేసుకునేందుకు ప్రయత్నించాలి. అయినప్పటికీ ఇద్దరి మనసుల్లో ఒకరిపట్ల ఒకరికి ఏహ్యాభావం, ఇద్దరి మధ్య పొరపొచ్చాలు దూరం కానప్పుడు ఇరు కుటుంబాల్లోని పెద్దలు కూర్చుని వారిరువురి మధ్య రాజీ కుదిర్చే ప్రయత్నాలు చేయాలి. ఈ ప్రయత్నాలన్నీ విఫలమై ఆలుమగల మధ్య కీచులాటలు హద్దుమీరిపోయినప్పుడు వారిద్దరి దాంపత్య జీవితం దుర్భరమవుతుంది. ఎవరి దారి వాళ్లు చూసుకోవడం మేలు. దంపతులిద్దరూ విడిపోయి వారికి తగ్గ సంబంధాలు ఎంచుకొని రెండో పెండ్లి చేసుకోవడం ఉత్తమం. ఇంతకుమించి వేరే గత్యంతరం లేదు. భార్యాభర్తల మధ్య సంబంధ బాంధవ్యాలు తెగదెంపులైతేనే తలాక్ చివరి మార్గం. అదే తలాక్ ఉద్దేశం.

సెల్ : 9640622076

# అధర్మ 'వేద'ం

ఓగోటి కిరణ్‌కుమార్

మానవత్వంతో కొంతకాలం ఆశ్రయం ఇచ్చినందుకు కృతజ్ఞత చూపకపోగా హిందూ మతాన్ని అవమానించారని నిందిస్తూ అనేక రూపాల్లో వేధింపులకు పాల్పడ్డారు. చివరికి ఉన్నత స్థాయిలో ఉన్న బ్రాహ్మణవాదుల అండతో నాన్‌బెయిలబుల్ కేసు పెట్టించి జైలుపాలు చేశారు. ఈ దుర్మార్గమైన ఘటన రాష్ట్ర రాజధాని నడిబొడ్డున బోడుప్పల్ పరిధిలో చోటు చేసుకుంది.

బోడుప్పల్‌లోని రామయ్య, నర్సయ్య, శంకరయ్య (ఆర్ఎన్ఎస్) కాలనీ గత ఐదు తరాలుగా ఎస్సీ మాల కులానికి చెందిన 'బొమ్మకు' వారి ఆధీనంలో ఉంది. ఈ కాలనీని వారే అభివృద్ధి చేశారు. ప్రస్తుతం సినీ నిర్మాత బొమ్మకు మురళీ ఈ కాలనీకి చైర్మన్‌గా ఉన్నారు. ఈ కాలనీలో ఎలాంటి సమస్యలొచ్చినా ఆయనే పరిష్కస్తారు. ఇక్కడి పాలక మండలి పట్టించుకోని అభివృద్ధి పనులను కూడా బోడుప్పల్ ఫెడరేషన్ (బీసీఎండబ్ల్యూ) పేరుతో చేస్తున్నారు. కరెంటు, డ్రైనేజీ, రోడ్లు వంటి అనేక మౌలిక సదుపాయాలు కల్పించారు. ప్రతీ పండుగకు కుల, మతాలకు అతీతంగా కల్చరల్ ప్రోగ్రామ్స్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. అయితే ఈ కాలనీలో బ్రాహ్మణులే ఎక్కువ. ఈనేపథ్యంలో దత్తాత్రి శర్మ అనే ఓ బ్రాహ్మణ వ్యక్తి ఆర్ఎన్ఎస్ కాలనీలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వేద పాఠశాలను నడుపుతున్నారు. ఈ విషయమై కాలనీ చైర్మన్‌గా ఉన్న బొమ్మకు మురళీని ఆరు నెలల పాటు పాఠశాల నడుపుకునేందుకు అనుమతి కోరారు. మరో చోట తమ పాఠశాలకు సంబంధించిన భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయనీ, అప్పటి వరకు ఇక్కడ నిర్వహించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఆ పాఠశాలలో 50-60మంది విద్యార్థులు ఉంటారు. ఇక్కడే సమస్య మొదలైంది. బ్రహ్మ ముహూర్తం పేరుతో ఉదయం 4గంటల ప్రాంతం లోనే లేచి బిగ్గరగా మంత్రాలు జపిస్తుంటారు. దీంతో కాలనీలో నిద్రిస్తున్న చుట్టుపక్కల వారు తీవ్ర అసౌక ర్యానికి గురయ్యారు. ఈ కేకలను తాము భరించలేక పోతున్నామని కాలనీకి చెందిన బ్రాహ్మణులే కాలనీ చైర్మన్ బొమ్మకు మురళికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన వెళ్లి పాఠశాల యజమాన్యంతో మాట్లాడితే తమ బిల్డింగ్ పనులు ఇంకా పూర్తి కాలేదనీ, మరికొంత గడువు ఇవ్వాలని బతిమిలాడారు. ఇలా రెండున్నర ఏండ్లు గడిచిపోయాయి.

మరికొన్ని రోజుల తర్వాత బ్రాహ్మణురాలైన సరోజా అనే వృద్ధురాలు ఆ వేద పాఠశాల నిర్వాహణపై తీవ్ర అభ్యంతరం తెలుపుతూ మురళీకి ఫిర్యాదు చేసింది. అక్కడి వేద పాఠశాలలో పౌరోహిత్యం కూడా సరైన పద్ధతిలో సాగడం లేదని వాపోయింది. ఈ నేపథ్యంలో ఆ పాఠశాలపై స్థానిక ఎమ్మెల్యేకు కాలనీ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అలాగే మరోసారి వేద పాఠశాల నిర్వాహకులు దత్తాత్రిశర్మను కలిసి మాట్లాడగా, తాను ఆ పాఠశాల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకున్నాననీ, ప్రస్తుతం శశిభూషన్ శర్మ ఆధ్వర్యం లో కొనసాగుతున్నదనీ చెప్పారు. తాను ఆశించిన విధంగా కాకుండా ప్రస్తుతం ఆ పాఠశాల వ్యాపారమ యం అయిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వెంటనే (గత నవంబర్ 25న) శశిభూషన్ శర్మకు బొమ్మకు మురళి ఫోన్ చేసి ఇక్కడి నుంచి పాఠశాలను తొలగించాలని తెలియజేయగా, మరుసటి రోజు చెబుతామని ఆయన చెప్పారు. బ్రాహ్మణురాలు సరోజా మరుసటి రోజు ఉదయమే మురళి వద్దకు వచ్చి ఇంకా సమస్య పరిష్కారం కాలే దనీ రాత్రి పూట కంటినిండా నిద్రించలేకపోతున్నామ నీ తీవ్ర ఆవేదనతో తెలిపింది. దీంతో మళ్లీ శశిభూష న్ శర్మకు బొమ్మకు మురళి ఫోన్ చేసి ఎప్పుడు తొలగిస్తున్నారని ప్రశ్నించగా ఒక్క రోజులో ఎలా చెబుతాం, కాస్త టైం పడుతుందని నిర్లక్ష్యంగా సమా ధానమిచ్చారు. దీంతో ఎన్ని రోజుల్లో తీసివేస్తారో కచ్చితమైన సమయం చెప్పాలని మురళీ వారిని కోరారు. "ఇప్పటికిప్పుడు పిల్లల్ని ఎక్కడికి తీసుకెళ్ల మంటారు" అంటూ తీవ్ర స్వరంతో శశిభూషన్ శర్మ ప్రశ్నించారు. "మీరు ఎక్కడికైనా వెళ్లండి, ఇక్కడ ఉండటానికి మీకు అనుమతి లేదు" అంటూ బొమ్మకు మురళి సమాధానమిచ్చారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. "కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు, ఎక్కడికి వెళ్లాలని నన్ను అడుగుతారేంటి? మీరు ఏట్లోకి వెళ్లినా మాకు అవసరం లేదు. ఇక్కడ మాత్రం ఉండటానికి వీళ్లేదు" అని బొమ్మకు మురళి తెలిపారు. "కావాలంటే మరోచోట నాలుగు ఎకరాల స్థలం ఉంది. అక్కడ మీకు ప్రశాంతంగా ఉంటుంది. కాలనీ వాసులకు కూడా ఇబ్బంది తప్పుతుంది" అని చెప్పారు. అయినా వేదాల వల్ల ఉపయోగం లేదు, భారత రాజ్యాంగాన్ని మీరు ఒక్కసారి చదవండి" అని సున్నితంగానే సర్దిచెప్పారు. ఈ సంభాషణ అంతా శశిభూషన్ శర్మ ఫోన్‌లో రికార్డు చేశారు. దానిని కొంత ఎడిట్ చేసి ఫేస్‌బుక్‌లో పెట్టాడు. "ఇతనికి వేదాలపై నమ్మకం లేదు. హిందువులంటే తీవ్ర వ్యతిరేకత" అంటూ కొన్ని వ్యాఖ్యానాలతో సామాజిక మాధ్యమంలో పెట్టారు. దీంతో మరుసటి రోజు నుంచి బొమ్మకు మురళికి విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, శివశక్తి, బీజేపీ తదితరుల నుంచి విపరీతమైన ఫోన్స్ వచ్చాయి. అసభ్యపదజాలంతో మాట్లాడుతూ దూషించారు.



బొమ్మకు మురళికి మద్దతుగా ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

**పోలీసుల అత్యుత్సాహం**

వేద పాఠశాలపై బొమ్మకు మురళి తీరును నిరసిస్తూ నవంబర్ 26న ఉప్పల్ ఎమ్మెల్యే ప్రభాకర్ రోడ్డుపై ఆందోళనకు దిగారు. వీరికి విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, శివశక్తి, బీజేపీ తదితర హిందు త్వ సంస్థలు మద్దతుగా ఆందోళనల్లో పాల్గొన్నాయి. ఈఘటనతో బోడుప్పల్ సీఐ ఫోన్ చేసి బొమ్మకు మురళిని పోలీస్‌స్టేషన్‌కు రావాలని, లేకుంటే మా ఎస్ఐని పంపించి బేయిజ్జత్ (ఇజ్జత్ తీసేస్తా) చేయా ల్సి వస్తుందని హెచ్చరించారు. తాను వేదాలను కించపర్చలేదనీ, ఇక్కడి నుంచి పాఠశాలను తొలగిచా లని మాత్రమే కోరాననీ, తాను పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదనీ బొమ్మకు మురళి చెప్పా రు. దీంతో బొమ్మకు మురళి ఇంటి చుట్టు పోలీసులు మోహరించారు. రెండు వ్యాన్లలో 15 మంది పోలీసులు, నలుగురు ఎస్ఐలు ఇంటికొచ్చి నానా హంగామా సృష్టించారు. ఆ సమయంలో మురళి ఇంట్లో లేరు. అయినా పోలీసులు నానా హడావిడి చేశారు. ఈనేపథ్యంలో బొమ్మకు మురళిపై 295ఏ ( మతాన్ని కించపరచడం) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఇది నాన్ బెయిలబుల్ కేసు. ఆ తర్వాత జైలుకు పంపారు. దీనిపై స్థానిక టీఆర్ఎస్ నాయకురాలు దుర్గాదేవి తీవ్ర అభ్యంతరం తెలిపారు. బొమ్మకు మురళికి జరిగిన అన్యాయంపై న్యాయ పోరాటానికి దిగి 15 రోజుల్లో బెయిల్ మంజూరు చేయించారు. ఈ సమస్య పరిష్కారం కాకుంటే అధికార పార్టీ నుంచి తొలగడానికి కూడా సిద్ధమేనని ఆమె ప్రకటించారు. అనంతరం బాధితుడైన వ్యక్తిని విచారించకుండా, తన వాగ్మూలం తీసుకోకుండా పోలీసులు ఇష్టానుసారంగా కేసు నమోదు చేయడా న్ని సవాల్ చేస్తూ డీసీపీపై విధుల్లో నిర్లక్ష్యం (నెగ్లిజెన్సీ డ్యూటీ) కింద బొమ్మకు మురళి పోలీసులపై కేసు వేశారు. తాను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడితే సెక్ష న్స్ మార్చి పోలీసులు ఆ కేసును నీరు గార్చారని వాపోయారు. ఈ ఘటన ఇంత తీవ్రంగా సాగుతున్న క్రమంలో శశిభూషన్ శర్మ బ్లాక్‌మెయిల్ యత్నాని కి ప్రయత్నించారనే ఆరోపణలున్నాయి. ఈ ఘటనతో అప్పటిదాకా శశిభూషన్ శర్మకు మద్దతిచ్చిన కొందరు బ్రాహ్మణు లు క్రమంగా ఈ ఘటనకు దూరంగా ఉంటున్నారు.

**వేదాలను కించపరిచారని ప్రచారం**

ఇక్కడ జరిగిన ఘటనలో వాస్తవం గా వేద పాఠశాల వల్ల కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. వారే స్వయం గా కాలనీ చైర్మన్‌గా ఉన్న బొమ్మకు మురళిని కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో బొమ్మకు మురళి ఈ పాఠశాలకు తాము ఇచ్చిన గడువు ముగిసింది. కాలనీవాసులకు ఇబ్బంది కలుగకుండా తొలగించాలని మాత్రమే ఆయన కోరారు. కానీ ఇక్కడ శశిభూషన్ శర్మ ఈ ఘటనను హిందూత్వంపై దాడిగా వక్రీకరించారు. కేవలం దళితుడనే ఒకేఒక్క కారణంతో ఇంత తీవ్రస్థాయిలో దాడి జరిగినా సమస్యను పరిష్కరించాల్సిన పోలీసులు కూడా నిందితులకే వత్తాసు పలుకుతున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు.

సెల్ : 9666011107

**న్యాయ పోరాటం చేస్తా**



ప్రస్తుతం నాకు జరిగిన అన్యాయంపై సీపీకి ఫిర్యాదు చేస్తా. హైకోర్టులో కూడా కేసు వేస్తా. నేను హిందువును, ఓ హిందువునే తిట్టాను. కానీ వేదాలను తిట్టలేదు. నేను తీసిన శరణం గచ్ఛామి సినిమాలో బ్రాహ్మణుల వల్ల అణగారిన వర్గాలు తరతరాలుగా ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో చూపించడం వారిని నొప్పించి ఉండొచ్చు. అలాంటివన్నీ మనస్సులో పెట్టుకొనే తనపై ఇలా కలిసికట్టుగా దాడికి దిగారు.

**బొమ్మకు మురళి, ఎన్ఆర్ఎస్ కాలనీ చైర్మన్**

## కాలనీకి దళితుడి పేరు పెట్టినా అంగీకరించని అగ్రవర్ణం

వి.తరుణ్‌తేజా


నేటికీ దళితులపై వివక్ష అనేక రూపాల్లో కొనసాగుతూనే ఉంది. దళితులు ఉన్నతులుగా ఎదిగే క్రమాన్ని ఏ పరిస్థితుల్లోనూ సహించే పరిస్థితి లేదు. దీనికి మరో ఉదాహరణ బోడుప్పల్‌లో జరిగిన ఘటన. 30 ఎకరాల భూమిని అభివృద్ధి చేసుకొని దానికి బొమ్మకు శంకరయ్య కాలనీగా నామకరణం చేసుకుందామని అక్కడి ప్రజలు నిర్ణయించుకున్నారు. అందుకు అనుగుణంగానే ఆ భూమిని అభి వృద్ధి చేశారు. దీనికి ప్రముఖ సినీ నిర్మాత బొమ్మకు మురళి ఆర్థికం గానూ, అన్ని రకాలుగానూ పూర్తి సహకారం అందించారు. అందరి కృషి ఫలితంగా ఆ కాలనీ నివాసానికి అనువుగా మారింది. ఇక్కడే అగ్రవర్ణాలకు కన్నుకుట్టింది. ఓ దళితుడి పేరు కాలనీకి పెట్టడమేం టని అనుకున్నారు. "ఈ ప్రాంతంలో దళితుల ఆటలు ఇంకా ఎన్ని రోజులు సాగనివ్వాలి. వారి పేర్లు ఎన్ని రోజులు మోయాలి" అని హేళనభావంతో మాట్లాడుకున్నారు. అందరూ కూడబదులుక్కొని బొమ్మకు శంకరయ్య కాలనీ పేరును టెలిఫోన్ కాలనీగా మార్చారు. అన్ని రకాలుగా సహకరించిన బొమ్మకు మురళి ఈ హఠాత్‌పరిణా మంతో కంగుతిన్నారు. వెళ్లి ఆ కాలనీ బాధ్యులను అడిగితే తగిన సమాధానం రాకపోగా వాగ్వివాదానికి దిగారు. ఇందులో ప్రస్తుత ఘట్‌కేసర్ జెడ్పీటీసీ ఎం.సంజీవరెడ్డి ప్రముఖ పాత్ర పోషించారు. ఉప్పల్ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్.ప్రభాకర్, ఏసీపీ, సీఐ జగన్నాథరెడ్డి వీళ్లంతా మావాళ్లే అంటూ జడ్పీటీసీ బెదిరింపులకు పాల్పడ్డారు.

**అట్రాసిటీ కేసులను పట్టించుకోని పోలీసులు**

ఈ ఘటనపై బొమ్మకు మురళి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు వేశారు. కానీ ఇదంతా అబద్ధమని ఏసీపీ కేసు కొట్టిపారేశారు. ప్రభుత్వం కూడా అణగారిన వర్గాలపై జరిగే దాడులపై స్పందించడం లేదు. ఇది చాలా బాధాకరమైన విషయం. ఏ దిక్కూ లేనివారికి ప్రభుత్వం అండగా ఉండాలి. కానీ నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. అందుకే అణగారిన వర్గాలపై ప్రతిరోజూ దాడుల పరంపర కొనసాగుతున్నది.

సెల్ : 8639518341

**అధికార కాంక్ష లేనందుకే...**



దళిత, బహుజనుల్లో అధికార కాంక్ష లేనందునే అగ్రవర్ణాల వారు దాడులకు తెగబడుతున్నారు. అందుకే కనీసం కాలనీలకు ఓ దళితుడి పేరు పెట్టే అర్హత కూడా లేదని అధిపత్య కులాల వారు అడ్డుకుంటున్నారు. అణగారిన వర్గాలపై అధిపత్య కులాలు దౌర్జన్యానికి పాల్పడినప్పుడు ప్రభుత్వం అండగా నిలవాలి. చట్టాలు సాయమందించాలి. కానీ ఈ వ్యవస్థలో చట్టాలు ఉన్నోళ్లకే చుట్టాలుగా మారాయి.

**బొమ్మకు మురళి, ప్రముఖ సినీ నిర్మాత**



# ద్రవిడ్ సూచనకు బీసీసీఐ ఓకే

**ముంబయి :** అండర్-19 ప్రపంచకప్ సాధించిన జట్టు సహాయక సిబ్బంది నగదు ప్రోత్సాహకాల్లో వ్యత్యాసాలపై కోచ్ రాహుల్ ద్రవిడ్ సూచనను బీసీసీఐ అంగీకరించింది. ఈ మేరకు నూతన నగదు ప్రోత్సాహకాలతో సవరణ ప్రకటన చేసింది. తొలుత రాహుల్ ద్రవిడ్‌కు రూ. 50 లక్షలు, ఇతర సహాయక సిబ్బందికి రూ. 20 లక్షలు చొప్పున ప్రకటించారు. కానీ ఇప్పుడు రాహుల్ ద్రవిడ్ సహా ఇతర సహాక బృందానికి రూ. 25 లక్షల చొప్పున ఇవ్వనున్నారు. ఆటగాళ్లకు ఇచ్చే రూ. 30 లక్షల నగదు బహుమానంలో ఎటువంటి మార్పు లేదు.

# మేరికి రజతం

**స్ట్రాంజ స్మారక బాక్సింగ్ టోర్నీ**



**సోఫియా (బల్గేరియా) :** ఐదు సార్లు ప్రపంచ చాంపియన్, దిగ్గజ బాక్సర్ మేరికోమ్ స్ట్రాంజ స్మారక బాక్సింగ్ టోర్నీలో రజత పతకం సాధించింది. ఆసియా చాంపియన్‌షిప్స్, ఇండియా ఓపెన్‌లలో వరుసగా రెండు స్వర్ణాలు సాధించిన మేరి.. మూడో పసిడిని తృటిలో చేజార్చుకున్నది. 69వ స్ట్రాంజ స్మారక బాక్సింగ్ పోటీల్లో 48 కిలోల విభాగంలో తలపడ్డ మేరి.. హోరాహోరీ ఫైనల్లో స్థానిక స్టార్ బాక్సర్ సెవ్‌డా ఆసెనొవా చేతిలో ఓడింది. పంచ్‌ల వర్షం కురిసిన పోరులో ఆఖరు వరకూ మేరిదే పైచేయి అనిపించినా.. పాయింట్ల పరంగా ఆసెనొవాకు బంగారు పతకం దక్కింది. మహిళల 81 కిలోల విభాగంలో ఫైనల్ పోరు చేసిన మరో భారత బాక్సర్ సీమ పూనియా రష్యా బాక్సర్ అన్నా ఇవనోవా చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకున్నది. మీనా కుమారి దేవి (54 కిలోలు), ఎల్ సరితా దేవి (60 కిలోలు), బూర సవీటి (75 కిలోలు), కాచరి భాగ్యవతి (81 కిలోలు) కాంస్య పతకాలకు పరిమితమయ్యారు. రెండు రజతాలు సహా నాల్గు కాంస్య పతకాలు నెగ్గిన మహిళా బాక్సర్లు.. ప్రతిష్టాత్మక ఈవెంట్లో భారత్‌కు మొత్తంగా ఆరు పతకాలు అందించారు.

# గోవా ప్లేఆఫ్ ఆశలు సజీవం

- పుణెతో ఐఎస్ఎల్ పోరులో 4-0తో విజయం

**పుణె :** ఎఫ్‌సీ గోవా ప్లే ఆఫ్ ఆశలను సజీవంగా నిలుపుకున్నది. ఐఎస్ఎల్ పోరులో 4-0తో పుణె సిటీపై ఘన విజయం సాధించింది. సీజన్‌లో అత్యధిక గోల్స్ నమోదు చేసిన ఫెర్రాన్ కొరొమినస్ ద్వితీయార్థంలో రెండు గోల్స్‌తో మెరిశాడు. సెమీస్‌లో స్థానంకోసం గెలిచిన తీరాల్సిన మ్యాచ్‌లో గోవా అదిరిపోయే ప్రదర్శన చేసింది. పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోన్న పుణె జట్టుకు గోల్సేమీ కోల్పోకుండా నాల్గు గోల్స్ పిండుకున్నది. మాన్యేల్ లాంజరోట్ 28వ నిమిషంలో చేసిన గోల్‌తో గోవా ఖాతా తెరవగా, ప్రథమార్థంలో పుణె డిఫెన్సు ఆకట్టుకున్నది. అయితే 47, 58 నిమిషాల్లో ఆధిక్యాన్ని పెంచుకున్న గోవా మ్యాచ్‌పై ఆధిపత్యం చలాయించింది. 65వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చిన ఫెర్రాన్ గోవాకు 4-0తో అపూర్వ విజయాన్ని అందించాడు.



# కివీస్ మిలమిల

- టేలర్, శాంట్నర్ మెరుపులు
- తొలి వన్డేలో ఇంగ్లాండ్‌పై గెలుపు

**హామిల్టన్ :** ఉత్కంఠ వన్డేలో ఆతిథ్య కివీస్ అదరగొట్టింది. టెయిలెండర్ మిచెల్ శాంట్నర్ (45 నాటౌట్, 27 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) వీరవిహారం చేయటంతో రసవత్తర ఛేదనలో న్యూజిలాండ్ 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. జోశ్ బట్లర్ (79), జో రూట్ (71), జేసన్ రాయ్ (49)లు రాణించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 8 వికెట్లు కోల్పోయి 284 పరుగులు చేసింది. రాస్ టేలర్ (113, 116 బంతుల్లో 12 ఫోర్లు) శతకానికి తోడు టామ్ లాథమ్ (79) రాణించటంతో కివీస్ లక్ష్యం దిశగా సాగింది. కానీ ఆఖర్లో బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు చేరగా.. మ్యాచ్ ఇంగ్లాండ్ వైపు మొగ్గింది. ఈ తరుణంలో మిచెల్ శాంట్నర్ గెలుపు ఇన్నింగ్స్ ఆడాడు. నాల్గు సిక్సర్లు, రెండు ఫోర్లతో చెలరేగి మరో నాల్గు బంతులుండగానే న్యూజిలాండ్‌కు విజయాన్ని అందించాడు. వీధి గొడవలో కోర్టు కేసు ఎదుర్కొంటున్న స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ పునరాగమనంలో 12 పరుగులే చేసినా, 2 వికెట్లు కూల్చాడు. ఐదు వన్డేల సిరీస్‌లో న్యూజిలాండ్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది.



# ఐసీసీ టెస్టు గద మళ్లీ మనకే

నిరుడు ఆస్ట్రేలియాపై ధర్మశాల టెస్టు విజయంతో వరల్డ్ నం.1 జట్టుగా ఐసీసీ టెస్టు గద అందుకున్న టీమ్ ఇండియా.. వరుసగా రెండో ఏడాది గదను తన వద్దే నిలుపుకున్నది. దక్షిణాఫ్రికా పర్యటనలో 1-2తో టెస్టు సిరీస్‌లో ఓడినా.. ర్యాంకింగ్స్‌లో కోహ్లిసేన అగ్రస్థానానికి ఎటువంటి ముప్పు వాటిల్లలేదు. దీంతో వరుసగా రెండో ఏడాది టెస్టు గదను సునీల్ గవాస్కర్ చేతుల మీదుగా కెప్టెన్ కోహ్లి అందుకున్నాడు. ' వరుసగా రెండు సార్లు టెస్టు గదను అందుకోవటం సంతోషంగా ఉంది. ఇది పూర్తిగా జట్టు విజయం. సమష్టిగా ఆడటంతో అగ్రస్థానాన్ని నిలుపుకోగలిగాం. అత్యున్నత ప్రమాణాలతో కూడిన క్రికెట్ ఆడేందుకు అను నిత్యం జట్టును సిద్ధం చేసిన సహాయక సిబ్బంది కృషి అమోఘం. ఇక ప్రత్యేకించి సఫారీ గడ్డపై సిరీస్ ఓడినా మంచి పాఠాలే నేర్చుకున్నాం. విదేశాల్లో ఆడుతున్నప్పుడు ఎటువంటి మానసిక పరిపక్వత సాధించాలి, ప్రతి రోజు ఆటలో ఏ విధమైన వ్యూహంతో వెళ్లాలనే విలువైన పాఠాలు నేర్చుకున్నాం. ఇక్కడ్నుంచి స్వదేశానికి వెళ్లినా.. విదేశీ పిచ్‌లపై ఆడేందుకు అవసరమైన అనుభవం ఇక్కడ గడించాం' అని కెప్టెన్ విరాట్ కోహ్లి అన్నాడు.

# కోహ్లి, మహీలకు విశ్రాంతి

- రోహిత్ శర్మకు కెప్టెన్సీ పగ్గాలు
- శిఖర్ ధావన్‌కు ఉప సారథి హోదా

**ముక్కోణపు టీ20 సిరీస్‌కు జట్టు ఎంపిక**

**నవతెలంగాణ-ముంబయి**

దక్షిణాఫ్రికా గడ్డపై రెండు పరిమిత ఓవర్ల సిరీస్ విజయాలతో సగర్వంగా స్వదేశానికి తిరిగొస్తున్న కెప్టెన్ విరాట్ కోహ్లి... ఎడతెరపి లేని షెడ్యూల్ నుంచి కొంత ఉపశమనం పొందనున్నాడు. మార్చి 6 నుంచి శ్రీలంకలో జరుగనున్న ముక్కోణపు టీ20 సిరీస్ నుంచి పరుగుల యంత్రం కోహ్లి విశ్రాంతి తీసుకున్నాడు. కోహ్లి లేని వేళ ముంబయి ఇండియన్స్ సారథి రోహిత్ శర్మకు టీమ్ ఇండియా పగ్గాలు దక్కాయి. వ్యక్తిగత కారణాల రీత్యా దిగ్గజ ఆటగాడు మహేంద్రసింగ్ ధోని సైతం ముక్కోణపు సిరీస్‌కు అందుబాటులో ఉండటం లేదు. ఓపెనర్ శిఖర్ ధావన్‌కు డిప్యూటీ కెప్టెన్ బాధ్యతలు అందించారు. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ తిరిగి జట్టులోకి వచ్చాడు. బంగ్లాదేశ్, శ్రీలంకలతో ముక్కోణపు సిరీస్‌లో మరోసారి అదృష్టం పరీక్షించుకోనున్నాడు.

**దొరుకునా మళ్లీ విరామం!**

దక్షిణాఫ్రికా పర్యటనలో కెప్టెన్ కోహ్లి సహా హార్దిక్ పాండ్య, జశ్‌ప్రీత్ బుమ్రాలు దాదాపు ప్రతి మ్యాచ్‌లోనూ ఆడారు. కోహ్లి, బుమ్రాలు చెరో టీ20లో విశ్రాంతి తీసుకున్నా.. పాండ్య మాత్రం అన్ని ఫార్మాట్లలో అన్ని మ్యాచుల్లోనూ ప్రాతినిథ్యం వహించాడు. దీంతో రానున్న సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని సెలక్టర్లు వీరికి విశ్రాంతినిచ్చారు. మార్చి 6-18న జరిగే ముక్కోణపు సిరీస్ తర్వాత మే-ఏప్రిల్‌లో భారత ఆటగాళ్లంతా ఐపీఎల్‌లో పాల్గొంటారు. జూన్‌లో స్వదేశంలో అఫ్ఘనిస్థాన్‌తో ఓ టెస్టు మ్యాచ్ ఆడాల్సి ఉంది. జులైలో ఇంగ్లాండ్ పర్యటనకు బయల్దేరాలి. అక్కడ్నుంచి తిరుగుముఖం పట్టగానే సెప్టెంబర్‌లో ఆసియా కప్‌లో బరిలోకి దిగాల్సి ఉంటుంది. దీంతో కీలక ఆటగాళ్లకు విరామం దొరికే అవకాశం బహు స్వల్పం. అందుకే కోహ్లి, పాండ్య, బుమ్రా సహ భువనేశ్వర్‌లకు సెలక్టర్లు విశ్రాంతి అందించారు.

**కుర్రాళ్లకు మరో అవకాశం**

సీనియర్లకు విశ్రాంతి లభించిన వేళ కుర్ర క్రికెటర్లకు జాతీయ జట్టు తరఫున సత్తా చాటేందుకు సువర్ణావకాశం లభించింది. దేశవాళీ పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో ఆకట్టుకున్న వికెట్ కీపర్ రిషబ్ పంత్ మరోమారు జట్టులోకి వచ్చాడు. గతంలో జట్టులో ధోని ఉండగా అవకాశాలు రాలేదు. కానీ ఈ సిరీస్‌లో రిషబ్ పంత్‌కు మంచి అవకాశం లభించనున్నది. బరోడా ఆటగాడు దీపక్ హుడా, తమిళనాడు కుర్రోడు విజయ్ శంకర్‌లు భారత్-ఏ జట్టుకు రెగ్యులర్ ఆటగాళ్లు. ఇప్పుడు మెరుగ్గా రాణిస్తే రానున్న కాలంలో సెలక్టర్లు వీరిని పరిగణనలోకి తీసుకునే అవకాశాలు ఎక్కువ. హైదరాబాద్ సీమర్ మహ్మద్ సిరాజ్ జాతీయ జట్టు తరఫున తనెంటో ఇంకా నిరూపించుకోవాల్సి ఉన్నది. హైదరాబాద్ తరఫున రంజీల్లో మెరుపు ప్రదర్శనలు చేస్తోన్నా.. అంతర్జాతీయ సర్క్యూట్‌లో సిరాజ్ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇంకా చేయాల్సి ఉంది.

' విరామం లేని పని ఒత్తిడి, రానున్న సీజన్ షెడ్యూల్‌ను గమనంలో ఉంచుకుని ముక్కోణపు టీ20 సిరీస్‌కు జట్టును ఎంపిక చేశాం. ఫాస్ట్ బౌలర్లకు అవసరమైన విశ్రాంతి ఇవ్వాలని, అప్పుడే అథ్లెటిక్ ఫిట్‌నెస్ సాధించగల్గి గాయాల బారిన పడకుండా ఉండగలరని హై పర్‌ఫార్మెన్స్ బృందం సూచించింది. ఎం.ఎస్ ధోని సెలక్షన్‌కు అందుబాటులో లేడు. విశ్రాంతి కావాలన్న వినతిని అంగీకరించాం'

**- ఎమ్మెస్కే ప్రసాద్, సెలక్షన్ కమిటీ చైర్మెన్**

**ముక్కోణపు టీ20 సిరీస్‌కు భారత జట్టు**

రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్, కెఎల్ రాహుల్, సురేశ్ రైనా, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, యుజ్వేంద్ర చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, షార్దుల్ ఠాకూర్, జైదేవ్ ఉనద్కత్, మహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్.

**ఇన్ :** వాషింగ్టన్ సుందర్, విజయ్ శంకర్, మహ్మద్ సిరాజ్, దీపక్ హుడా, రిషబ్ పంత్

**అవుట్ :** విరాట్ కోహ్లి, ఎం.ఎస్ ధోని, జశ్‌ప్రీత్ బుమ్రా, భువనేశ్వర్ కుమార్, హార్దిక్ పాండ్య, కుల్దీప్ యాదవ్.

**70వ స్వాతంత్ర్య వేడుకలు**

ఇటీవల వరుసగా శ్రీలంకతో మ్యాచులు రావటంతో భారత అభిమానులు లంకేయులతో పోరు అంటే అసహనానికి గురైన సందర్భాలు ఉన్నాయి. కానీ తాజా ముక్కోణపు టీ20 సిరీస్‌కు ఓ ప్రత్యేకత ఉంది. బ్రిటీష్ పాలన నుంచి శ్రీలంక స్వేచ్ఛా వాయువులు పీల్చుకుని 70 వసంతాలు పూర్తయిన సందర్భంగా ముక్కోణపు సిరీస్‌ను ఏర్పాటు చేశారు. 1948, ఫిబ్రవరి 4న లంకకు స్వాతంత్ర్యం వచ్చింది. శ్రీలంక బోర్డు కోరగానే.. బీసీసీఐ ఈ సిరీస్‌కు పచ్చజెండా ఊపింది. భారత్, శ్రీలంకలతో పాటు మరో పొరుగు దేశం బంగ్లాదేశ్ ఇందులో పాల్గొంటుంది.



# ఐసీసీ అడిగినా.. మార్చలే!

- కోల్‌కతలో ఐపీఎల్ మ్యాచ్‌పై బీసీసీఐ

**ముంబయి :** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఏప్రిల్ 22-26న కోల్‌కతలో వార్షిక సమావేశం కానున్నది. ఐసీసీ సభ్య దేశాల ప్రతినిధులు అందరూ ఈ భేటీకి హాజరు కాబోతున్నారు. ఈ తరుణంలో సమావేశాలకు హాజరైన సభ్య దేశాల ప్రతినిధులు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మ్యాచ్‌ను వీక్షించే భాగ్యం కావాలనుకున్నారు. ఇందు కోసం బీసీసీఐకి ఐసీసీ ఓ వినతి పంపింది. ఈ సమావేశాలు జరుగుతున్న సమయంలో కోల్‌కతలో ఐపీఎల్ మ్యాచ్‌లు లేవు. కనీసం కోల్‌కత నైట్‌రైడర్స్ సొంతగడ్డ మ్యాచ్‌నైనా ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరింది. ఏప్రిల్ 22-26న హైదరాబాద్, ముంబయి, ఇండోర్, బెంగళూర్, జైపూర్‌లలో మ్యాచులు ఉన్నాయి. ఒక్క మ్యాచ్ కోసం షెడ్యూల్‌లో మార్పులు చేస్తే.. పూర్తి షెడ్యూల్‌లో మార్పులు చేయాల్సి ఉంటుందని బీసీసీఐ బదులిచ్చింది. ఐసీసీ వినతిని తిరస్కరించిన బోర్డు పెద్దలు ఆ సమయంలో కోల్‌కతలో ఐపీఎల్ మ్యాచ్ కుదరదని తేల్చి చెప్పారు. ఈ మేరకు బోర్డు అధికారి ఒకరు తెలిపారు. చాలా కాలం తర్వాత ఐసీసీ వార్షిక సమావేశాలు కోల్‌కతలో జరుగుతున్నాయి. ఈ సమావేశానికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు నజీం సేథి సైతం రానుండటంతో కోల్‌కతను వేదికగా ఎంచుకున్నట్టు తెలుస్తోంది. అయితే, పీసీబీ అధ్యక్షుడికి భారత వీసా లభించే అవకాశాలు స్వల్పంగా ఉన్నాయని, అదే జరిగితే సెప్టెంబర్‌లో ఆసియా కప్‌లో ఆడనున్న పాకిస్థాన్ క్రికెటర్లకు వీసాలపై ఓ అవగాహన రావొచ్చని బీసీసీఐ భావిస్తోంది.




# ఏడోస్థానంలో అరుణ


**జిమ్నాస్టిక్స్ ప్రపంచ కప్ ఫ్లోర్ ఈవెంట్**



**మెల్‌బోర్న్ :** జిమ్నాస్టిక్స్ ప్రపంచ కప్‌లో కాంస్య పతకం గెల్చుకుని చరిత్ర సృష్టించిన తెలుగు జిమ్నాస్ట్ బుద్ద అరుణ రెడ్డి.. ఆదివారం జరిగిన ఫ్లోర్ ఈవెంట్‌లో ఏడో స్థానంలో నిలిచింది. మహిళల ఫ్లోర్ ఈవెంట్‌లో 10.833 స్కోరు చేసింది. పురుషుల ప్యారలల్ బార్స్‌లో రాకేష్ పాత్రా 13.433 స్కోరుతో ఏడో స్థానానికే పరిమితమయ్యాడు. 2014 ఆసియా గేమ్స్ కాంస్య విజేత ఆశిష్ కుమార్ పరుషుల వాల్ట్ విభాగంలో రెండు ప్రయత్నాల్లో 13.583 సగటుతో ఎనిమిదో స్థానంలో నిలిచి నిరాశపరిచాడు.

# సమీర్ వర్మకు టైటిల్

- స్విస్ ఓపెన్ ఫైనల్లో జాన్‌పై 2-0తో అలవోక విజయం



**బేసెల్ :** భారత యువ షట్లర్ సమీర్ వర్మ స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టైటిల్ గెల్చుకున్నాడు. రెండో సీడ్‌గా బరిలో దిగిన సమీర్ ఆదివారం సాయంత్రం జరిగి ఫైనల్లో జాన్ ఓ జోర్గన్‌సెన్ (డెన్మార్క్)పై 21-15, 21-13తో విజయం సాధించాడు. హోరాహోరీగా సాగిన సెమీస్ సమరంలో 2-1తో కాంటఫోన్ వాంగ్‌చరోన్ (థాయిలాండ్)ను ఓడించిన సమీర్‌కు టైటిల్ పోరులో ఏమంత కష్ట ఎదురుకాలేదు. తొలి గేమ్‌లో 3-0తో శు భారంభం చేసిన రెండో సీడ్ సమీర్.. 10-12తో ప్రత్యర్థి పోటీలోకొచ్చినా ఐదు వరస పాయింట్లతో 17-10కి దూసుకెళ్లాడు. 21-15తో తొలి గేమ్ నెగ్గిన సమీర్ రెండో సెట్ పదో పాయింట్ వరకూ నెమ్మదించాడు. 6-5తో ఆధిక్యం అందుకున్నాక ప్రత్యర్థిక మరో అవకాశం ఇవ్వలేదు. 21-13తో రెండో సెట్‌నూ గెలుపొంది స్విస్ ఓపెన్ టైటిల్‌ను ముద్దాడాడు. సమీర్‌కు సీజన్‌లో ఇది తొలి టైటిల్ కాగా గతేడాది జనవరిలో చివరిగా సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ టైటిల్ అందుకున్నాడు.



# సెమీస్‌లో ఆంధ్రకు నిరాశ

- సౌరాష్ట్ర చేతిలో పరాజయం
- విజయ్ హజారే వన్డే టోర్నీ

**న్యూఢిల్లీ :** ప్రతిష్టాత్మక విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జట్టుకు నిరాశ ఎదురైంది. సెమీస్‌లో 59 పరుగుల తేడాతో సౌరాష్ట్ర చేతిలో ఓటమి పాలైంది. సౌరాష్ట్ర తరఫున జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శనకు తోడు బ్యాట్స్‌మెన్ వైఫల్యం ఆంధ్ర ఫైనల్ అవకాశాలకు గండి కొట్టాయి. టాస్ నెగ్గి తొలుత ఫీల్డింగ్‌కు దిగిన ఆంధ్ర ఛేదించగల లక్ష్యానికే సౌరాష్ట్రను పరిమితం చేసింది. ఆరంభంలో ఆంధ్ర బౌలర్ దువ్వారపు శివ కుమార్ (2/19) మెరిశాడు. ఐదు ఓవర్లలోపే కీలక టాప్ ఆర్డర్ వికెట్లు కూల్చి సౌరాష్ట్రను ఒత్తిడికి గురి చేశాడు. కానీ ఓపెనర్ సామర్థ్ వ్యాస్ (46) రాణించగా.. రవీంద్ర జడేజా (56), అర్పిత్ వసవాడ (58)లు అర్ధ శతాకలతో మెరిశారు. ప్రేరక్ మన్‌కడ్ (40) సైతం రాణించడంతో 49.1 ఓవర్లలో సౌరాష్ట్ర అన్ని వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. ఇక ఛేదనలో ఆంధ్ర టాప్ ఆర్డర్ ఆకట్టుకోలేదు. ఓపెనర్లు శ్రీకర్ భారత్ (29), అశ్విన్ హెబ్బర్ (12) స్వల్ప స్కోరుకే పరిమితమయ్యారు. మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ బోడపాటి సుమంత్ (42), ద్వారక రవితేజ (42) ఓ దశలో ఆంధ్రను ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే వీరికి మిగతా బ్యాట్స్‌మెన్ నుంచి సహకారం కొరవడింది. దీంతో 45.3 ఓవర్లలకే ఆలౌటైన ఆంధ్ర 196 పరుగులకే పరిమితమైంది. సౌరాష్ట్ర తరఫున జడేజా నాల్గు, శౌర్య రెండు వికెట్లు పడగొట్టారు.. చిరాగ్, ప్రేరక్, కమలేశ్‌లు తలో వికెట్ తీశారు.

మంగళవారం జరుగనున్న ఫైనల్ పోరులో కర్నాటకతో సౌరాష్ట్ర తలపడనున్నది.

# మూడో స్థానంలో హైదరాబాద్

**హైదరాబాద్ :** తెలంగాణ టీ 20 లీగ్‌లో హైదరాబాద్ థండర్‌బోల్ట్స్ జట్టు మూడో స్థానంలో నిలిచింది. రంగారెడ్డి రైజర్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఒక్క పరుగు తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ డాని ప్రిన్స్ (104) శతకంతో 194 పరుగుల చేసింది. ఛేదనలో రంగారెడ్డి నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 193 పరుగులు మాత్రమే చేయగల్గింది.



# ఐపీఎల్ అనుభవం పనికొచ్చింది

- భువనేశ్వర్ కుమార్

**న్యూఢిల్లీ :** దక్షిణాఫ్రికా పర్యటనలో భారత బౌలర్లు అద్భుతంగా రాణించారు. ప్రత్యేకించి భారత సీమర్ భువనేశ్వర్ కుమార్ అదరగొట్టాడు. వన్డేల్లో కాస్త తడబడినా.. టెస్టులు, టీ20లలో మాత్రం భువీ ఆకట్టుకున్నాడు. ఇక టీ20 సిరీస్‌లో ఏడు వికెట్లతో మెరిసిన భువీ, సఫారీ టూర్‌లో విజయవంతంగా రాణించడానికి ఐపీఎల్ అనుభవం పనికొచ్చిందన్నాడు. ' టీ20 ఫార్మాట్ అంటేనే తక్కువ సమయంలో పూర్తవుతుంది. బౌలర్ చేతిలో కేవలం నాలుగు ఓవర్లే ఉంటాయి. ఒక ఓవర్‌లో మూడు చెత్త బంతులు పడితే అది పూర్తిగా మ్యాచ్ ప్రణాళికను దెబ్బతీస్తుంది. ఒక్కోసారి జట్టు ఓటమి పాలయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఇందులో ప్రతి ఒక్క బంతి కీలకమే. ఈ విషయంలో నాకు ఐపీఎల్‌లో ఆడిన అనుభవం పనికొచ్చింది' అని భువీ తెలిపాడు. 'సఫారీతో పొట్టి ఫార్మాట్ సిరీస్‌లో కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్ బంతులు వేయగలిగాను. నకెల్ బాల్ వేయటంలో సఫలమవటం వల్ల బ్యాట్స్‌మెన్ అంచనాలకు అందకుండా బౌలింగ్ చేశాను. నేను పవర్‌ప్లేలో రాణించడానికి అదే అసలు కారణం' అని చెప్పాడు. బుమ్రా బౌలింగ్ తీరుపై..'బుమ్రా తనకు తోచినట్లు ఆడుతుంటాడు. ప్రణాళికకు విరుద్ధంగా బంతులేసినా, చివరికి మాత్రం విజయాన్ని సాధించగల్గుతాడు' అని వివరించాడు. పవర్‌ప్లేలో కట్టుదిట్టంగా బంతులేయడం, బ్యాట్స్‌మెన్ సరైన సమయాల్లో పరుగులు చేయటం వల్లనే భారత్ నిలకడైన విజయాలు సాధిస్తుందని డెత్ ఓవర్ల స్పెషలిస్టు భువనేశ్వర్ అన్నాడు. ఇక సఫారీ పర్యటనలో విజయాలు జట్టు ఆత్మ విశ్వాసాన్ని మరింత పెంచాయని, ఇదే ఉత్సాహంతో రానున్న ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా పర్యటనల్లోనూ రాణిస్తామని ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.